

www.andhrajyothy.com
నిజామాబాద్ సిటీ*
ఆంధ్రజ్యోతి



సోమవారం | 19-3-2018 | పేజీలు: 16 + 20 | వెల: రూ. 5.00 | సంపుటి: 14 సంచిక: 248
శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: విదియ సా. 5.53 తదుపరి తదియ; నక్షత్రం: రేవతి రా. 8.09 తదుపరి అశ్విని; వర్జ్యం: ఉ. 8.10-9.46; దుర్ముహూర్తం: మ. 12.48-1.35, మ. 3.11-3.59; అమృతఘడియలు: సా. 5.45-7.21; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.24; సూర్యాస్తమయం: 6.23
Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

హాయ్.. నేను డాక్టర్ రోబో!



రోగులకు మరమనిషి సేవలు
కదలించే చేస్తే బీపీ రికార్డు చేస్తుంది
రోగిని వైద్యుడి వద్దకు తీసుకెళ్తుంది
మళ్లీ ఆస్పత్రికి వస్తే 'హలో' అని పలకరింపు
తొలిసారి సన్‌షైన్ ఆస్పత్రిలో అందుబాటులోకి
టీహబ్‌లోనే తయారైన రోబో


5

తాగి కారు నడిపిన యువతి



ఫుడ్ సంస్థ డెలివరీ బైక్‌తో ఢీ
డెలివరీ బాయ్ మృతి
మరొకరి పరిస్థితి విషమం
ఢిల్లీ నుంచి స్నేహితుణ్ని
కలిసేందుకు వచ్చిన యువతులు
కారులో మద్యం సీసాలు

ఆఖరి బంతికి ఆరేశాడు



6 4 6 0 2 4 1 6
8 బంతుల్లో 29 రన్స్

భారత్‌ను గెలిపించిన దినేశ్ కార్తీక్
ముక్కోణపు టీ-20 టోర్నీ కైవసం
బంగ్లాదేశ్‌తో ఫైనల్ పోరు

15

దేవ రాష్ట్రం

పంచ పంచాంగాలు

కేసీఆర్‌ది అద్భుత యోగం. ఆయన ఎక్కడైనా చక్రం తిప్పగల సమర్థత కలిగి ఉన్నారు. ఐదారుగురు మంత్రులు మళ్లీ మంత్రి పదవి చేపట్టడం కష్టం.

-ప్రభుత్వ పంచాంగ పఠనంలో సంతోష్ శర్మ

ఈ ఏడాది అన్ని పార్టీల్లో కాంగ్రెస్‌కే మంచి భవిష్యత్తు కనిపిస్తోంది. అక్టోబరు తర్వాత పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కు మహర్దశ పడుతుంది.

- కాంగ్రెస్ కార్యక్రమంలో తిరుమల శాస్త్రి

తెలంగాణలో టీడీపీ పుంజుకుంటుంది. 2019 ఎన్నికల తర్వాత ప్రభుత్వంలో భాగస్వామిగా కూడా అవతరించనుంది.

- టీడీపీ-టీఎస్ ఆఫీసులో శ్రవణ్‌కుమార్

ఏపీలో చంద్రబాబు వచ్చే ఎన్నికల్లోనూ విజయం సాధిస్తారు. రాజకీయంగా ఆయన రాశి బలంగా ఉంది.

-గుంటూరు టీడీపీ ఆఫీసులో ఆంజనేయ శాస్త్రి

వచ్చే ఏడాది మేలో జగన్ ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తారు. వైసీపీకి 135 సీట్లు వస్తాయి. అక్కడి నుంచి 12 ఏళ్ల 8 మాసాల 18 రోజులు ఆయన సీఎంగా కొనసాగుతారు. ఈ సంఖ్య తప్పితే నేను ఎక్కడా పంచాంగ పఠనం చేయను.

- వైసీపీ కార్యక్రమంలో రామకృష్ణ శర్మ

తెలంగాణలో అద్భుతంగా పూజలు: కేసీఆర్



ఆదివారం ప్రగతి భవన్‌లో ఉగాది కార్యక్రమంలో కేసీఆర్‌కు వేదపండితుల ఆశీర్వచనం

రాష్ట్ర ఆదాయం 8 వ్యయం 2.. రాజపూజ్యం 7 అవమానం 3
ప్రజల్లో ఉంటేనే టికెట్లు.. మంచి పేరు తెచ్చుకుంటే వస్తాయి
ఏడెనిమిది స్వయంసమృద్ధ రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి
దేశాభివృద్ధిలో తెలంగాణది కీలక పాత్రని ప్రధానికి చెప్పా
ప్రగతి భవన్ ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి కేసీఆర్
పోలీసు శాఖ పనితీరుపై ప్రశంసల జల్లు

కచ్చితంగా ఇది సైన్సే

ఏ పంచాంగం చెప్పినా.. మూల సిద్ధాంతం ఒక్కటే: సీఎం

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): "ఈ ఏడాది ఎన్నికల సంవత్సరం. కాబట్టి ఏ రాశి వారికి టికెట్లకు ఢోకా ఉండదో.. ఏ రాశి వారికి ఇబ్బంది అవుతుందో పంచాంగకర్తలు చెప్పారు. ఆయా రాశులవారు జాగ్రత్తగా ఉండాలి. టికెట్లు సంపాదించుకోవాలంటే ప్రజల్లో ఉండాలి. హైదరాబాద్‌లో ఉండవద్దు. ప్రజల్లో ఉండి మంచి పేరు తెచ్చుకోవాలి. అప్పుడే టికెట్లు ఆటోమేటిక్‌గా వస్తాయ్"

మిగతా 2వ పేజీలో...



జూలై, ఆగస్టుల్లోనే కాళేశ్వరం నీళ్లు!

కీలక ఘట్టానికి చేరిన పనులు
అన్నారం బ్యారేజీ గేట్ల బిగింపు షురూ
త్వరలోనే పంపుల డ్రై రన్

5

ఒకరి వెంట ఒకరు.. నీట మునిగి ఐదుగురి దుర్మరణం

కుమారులను కాపాడేందుకు తండ్రి
వీరిని కాపాడే క్రమంలో మరో ఇద్దరు
మెదక్ జిల్లాలో విషాదం

ఢీ అంటే ఢీ!

అవిశ్వాసంపై టీడీపీ పక్కా వ్యూహం

లోక్‌సభలో చర్చకు ఉడుంపట్టు



50 మందితో ముందే సంతకాలు
నేడు స్పీకర్‌కు మరోసారి నోటీసు
అనుమతించేదాకా రోజుకొకటిగా
కేంద్రం అల్లరి చేయించి ఆపేస్తే రచ్చే!
లోపలా బయటా ఆందోళనలు ఉధృతం
టీడీపీ నిర్ణయం.. ఎంపీలకు విప్ జారీ

అమరావతి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అవిశ్వాస తీర్మానంపై కేంద్ర ప్రభుత్వంతో ఢీ అంటే ఢీ అనే రీతిలో వ్యవహరించాలని తెలుగుదేశం పార్టీ నిశ్చయించింది. సోమవారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ తీర్మానం లోక్‌సభలో చర్చకు వచ్చేలా వ్యూహరచన చేస్తోంది. ప్రత్యేక హోదా, ప్యాకేజీ, విభజన హామీలపై నాలుగేళ్లపాటు కాలయాపన చేసిన మోదీ ప్రభుత్వం.. ఇప్పుడు వైసీపీ, జనసేన పార్టీలను తన పైకి ఉసిగొల్పుతోందని భావిస్తున్న నేపథ్యంలో దీనిని గట్టిగా ఎదుర్కొనేందుకు పకడ్బందీ ప్రణాళిక వేస్తోంది. అయితే అవిశ్వాస తీర్మానాన్ని సభలో అసలు చర్చకు బీజేపీ రానిస్తుందా అన్న అనుమానాలు రేగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సోమవారం ఉదయం సభ ప్రారంభమయ్యేలోపు మరోసారి అవిశ్వాసం నోటీసును లోక్‌సభ సెక్రటేరియట్‌లో ఇవ్వాలని టీడీపీ నిర్ణయించింది. నోటీసిచ్చిన వెంటనే

మిగతా 6వ పేజీలో...



మోదీ అంటేనే అవినీతి

వేల కోట్లు దోచిన వారిని బీజేపీ రక్షిస్తుంది.. వాళ్లు కౌరవులు, మేం పాండవులం
హత్య కేసులో ఉన్న వ్యక్తి బీజేపీ అధ్యక్షుడు.. 2019లో మాదే విజయం: రాహుల్
మోదీ హయాంలో ఆర్థిక వ్యవస్థ సర్వనాశనం.. అంతా వాగాడంబరమే
కశ్మీరును కంగాళీ చేశారు.. నోట్ల రద్దే చెడ్డ ఆలోచన.. హడావుడిగా జీఎస్టీ
శుష్క వాగ్దానాలతో మోసం.. అన్ని రంగాల్లో ఘోర వైఫల్యం
కాంగ్రెస్ ప్లీనరీలో మోదీ సర్కారుపై మన్మోహన్ సింగ్ ధ్వజం

6















రామ, సుగ్రీవుల మైత్రీబంధమే..

పరంజ్యోతి

మిత్రుడు అంటే సూర్యభగవానుడు. సర్వజగత్తుకూ వెలుగులు పంచేవాడు, చైతన్యప్రదాత. అందుకే స్నేహితుణ్ని మిత్రుడన్నారు. దుర్మార్గమైన పనుల నుంచి నివారించే వ్యక్తి, సత్కార్యాలు చేయడానికి ప్రోత్సాహాన్నిచ్చేవాడు, రహస్యాలను కాపాడేవాడు, సద్గుణాలను కలిగి ఉండేవాడు, ఆపత్కాలంలో నీడవలె అనుసరించివచ్చేవాడే నిజమైన మిత్రుడు. మనిషి సౌశీల్యం అతడు పాటించే మిత్రధర్మాన్ని బట్టి నిర్ణయించవచ్చు. ఆభిజాత్యాన్నిగానీ ఐశ్వర్యాన్నిగానీ విద్యనుగానీ పదవినిగానీ దృష్టిలో పెట్టుకుని స్నేహం చేయకూడదు. ఆ దృష్టి లేనివాడే సౌశీల్యమూర్తి. అలాంటి సౌశీల్యరూపుడు శ్రీరామచంద్రుడు. రామకథలో వాల్మీకి మహర్షి స్నేహితుడి గొప్పదనాన్ని, మైత్రీప్రాశస్త్యాన్ని రాముడి ద్వారా లోకానికి చాటాడు. రామాయణంలో గుహుడు, సుగ్రీవుడు, విభీషణుడు రాముడికి ఆప్తమిత్రులుగా దర్శనమిస్తారు. రాముడు చక్రవర్తి అయినా.. గిరిజనుడైన గుహునితో, వానరుడైన సుగ్రీవునితో, రాక్షసుడైన విభీషణుడితో స్నేహం చేసి మైత్రీధర్మానికి స్థాయీబేధాలు లేవని ప్రపంచానికి మార్గదర్శనం చేశాడు. కష్టాల్లో సహకారం అందించేవాడు నిజమైన మిత్రుడని రామసుగ్రీవులు చాటారు. వారిద్దరూ భార్యావియోగాన్ని అనుభవించినవారే. సుగ్రీవుని భార్య రుమను వాలి తన అధీనంలోకి తీసుకుంటే.. సీతాదేవిని రావణుడు అపహరించాడు. రామ, సుగ్రీవుల మైత్రీబంధమే.. రుమ, సీతల విముక్తికి కారణమైంది. శత్రువు సోదరుడైనా సరే.. అధర్మాన్ని ఎదిరించి వచ్చినందుకు విభీషణుడితో రాముడు స్నేహం చేశాడు. 'మిత్రభావేన సంప్రాప్తం న త్యజేయం కథంచన'.. మిత్రభావంతో వచ్చినవానిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదలనన్నాడు.



ధనత్యాగ సుఖత్యాగో దేహత్యాగో పి వా పునః
వయస్యార్థే ప్రవర్తన్తే స్నేహం దృష్ట్వా తథావిధమ్

..అన్నారు వాల్మీకి మహర్షి. నిజమైన స్నేహానికి ధనాన్నైనా, శరీర సుఖాన్నైనా, చివరకు దేహాన్నైనా త్యాగం చేయాల్సిందే తప్ప స్నేహాలన్ని వదలరాదని దీని భావం.

-గన్నమరాజు గిరిజామనోహర బాబు



శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం పుస్తకాన్ని సీఎం కేసీఆర్‌కు అందజేస్తున్న సీపీఆర్వో జ్వాలా నరసింహారావు

కేసీఆర్‌కు శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం బహూకరణ

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర వాల్మీకి, కవి సార్వభౌమ శ్రీ వాసుదాస స్వామి తెలుగులోకి అనువదించిన వాల్మీకి రామాయణం బాలకాండను ముఖ్యమంత్రి సీపీఆర్వో జ్వాలా నరసింహారావు శిష్ట వ్యవహారిక భాషలో అనువదించారు. శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం పేరుతో రూపొందించిన ఈ బాలకాండ మందర మకరందం రెండో ప్రచురణను సీఎం కేసీఆర్‌కు జ్వాలా నరసింహారావు ఆదివారం అందజేశారు. సామాన్యులకు అర్థమయ్యే భాషలోకి రామాయణాన్ని అనువదించడం అభినందనీయమని సీఎం కొనియాడారు.

ఎడ్ల బండ్ల ప్రదర్శనలో అపశ్రుతి

- ఒకరి మృతి, ముగ్గురికి తీవ్రగాయాలు

దోమకొండ, మార్చి 18 : ఉగాది పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ఎడ్లబండ్ల ప్రదర్శనలో అపశ్రుతి చోటు చేసుకుంది. ప్రదర్శనలో పాల్గొన్న కాడెద్దులు బెదిరి జనంపైకి దూసుకెళ్లడంతో ఒకరు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన కామారెడ్డి జిల్లా దోమకొండలో ఆదివారం చోటు చేసుకుంది. శివరాంమందిర్ ప్రాంగణంలో నిర్వహించిన ఎడ్ల బండ్ల ప్రదర్శనలో ఇస్సన్నపల్లి ఎల్లయ్యకు చెందిన ఎద్దులు బెదిరి జనాలపైకి వెళ్లడంతో నలుగురికి తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో బోరెడ్డి బాల్‌రెడ్డి (45) తలపై బండి చక్రం వెళ్లడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. క్షతగ్రాతులను నర్రాగుల భూపతి, నర్రాగుల వనజ, ఉట్ల పోశయ్యలుగా గుర్తించారు.

కేసీఆర్.. ఎక్కడైనా చక్రం తిప్పగలరు

ఆయనది అద్భుత యోగం.. రాష్ట్రంలో పాలన అద్భుతంగా ఉంటుంది

- ఐదారుగురికి మంత్రి పదవులు కష్టమే
- ఒక మఠాధిపతికి తీవ్ర అనారోగ్యం
- ప్రగతి భవన్ పంచాంగ పఠనంలో సంతోష్ కుమార్ శర్మ



శ్రీరామనవమి ఉత్సవాలకు రావాలంటూ సీఎం కేసీఆర్‌కు ఆహ్వానపత్రం అందిస్తున్న భద్రాచలం పండితులు

హైదరాబాద్,మార్చి 18(ఆంధ్రజ్యోతి): "మన సీఎం కేసీఆర్‌ది అద్భుతయోగం. ఆయన 17-02-1954లో మేషలగ్నంలో జన్మించారు. గురు, సూర్య బలం వల్ల యోగదాయక కాలం. ఈ ఏడాది ఆయన రాష్ట్రంలోనే కాదు.. ఎక్కడైనా చక్రం తిప్పగల సామర్థ్యాన్ని, ఏదైనా చేయగల సమర్థతను సూచిస్తోంది. తెలంగాణ రాష్ట్రానిది, సీఎందీ కర్కాటక రాశి. శని అనుకూలత అద్భుతంగా ఉంది. రాష్ట్రప్రభుత్వం సమర్థపాలనను అందిస్తుంది. ఆరోగ్యం కూడా చక్కగా ఉంటుంది. ఆటంకాలు ఉండవు"అని ధర్మపురి దేవస్థానం పండితుడు సంతోష్ కుమార్‌శర్మ అన్నారు. విళంబిఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రగతిభవన్‌లో ఆదివారం ఆయన పంచాంగ పఠనం చేశారు. "విళంబిలోనే శ్రీరామచంద్ర మూర్తి అవతరించారు. ఆయనది సూర్యవంశం. ఈ సారి ఉగాది ఆదివారం వచ్చింది. ఈ సంవత్సరానికి రాజు కూడా సూర్యుడే. ఎవరెన్ని విమర్శలు చేసినా రాజు ఆత్మకారక శక్తి వల్ల ఇబ్బందులు ఉండవు. రాష్ట్రం ముందుకెళ్తుంది. పథకాలు దిగ్విజయంగా అమలవుతాయి. శాంతిభద్రతల్లో స్వల్ప ఒడిదుడుకులు తప్పవు. అయితే, జగజ్జని శక్తితో ఇవన్నీ తొలగిపోతాయి" అని వివరించారు. మన రాజు(కేసీఆర్) వేగాన్ని మంత్రులు అందుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. పనుల్లో విఫలమయ్యే ఐదారుగురు మంత్రులు తిరిగి మంత్రిపదవి చేపట్టడం కష్టమన్నారు. ఒక మఠాధిపతికి తీవ్రఅనారోగ్యం కలుగుతుందన్నారు. ఈసారి అంద రూ ఆదివారాల్లో మాంసభక్షణ చేయకపోవడం మంచిదని సూచించారు. దేశం లో, రాష్ట్రంలో కు టుంబాల మధ్య కలహాలు పెరుగుతాయని, విడాకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు."తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన లగ్నం అద్భుతం. కోటి వెలుగుల బంగారు కొండ కింద పరుచుకున్న సరస్సులో వశించే తెలంగాణ తల్లి కంజాతవల్లి. రాష్ట్రావతరణ, రాజు(కేసీఆర్) రాశి ఒక్కటే. ఇది కలిసివచ్చింది. బంగారు తెలంగాణ అతిత్వరలో సాధ్యం. పర్యాటకం బాగుంటుంది. టీఎస్ఆర్టీసీ లాభాల బాట పడుతుంది. పంచాయతీరాజ్, మునిసిపల్, భూగర్భశాఖల్లో స్వల్ప అపశ్రుతులు వస్తాయి. సాంఘిక సంక్షేమం అద్భుతం. విద్య, వైజ్ఞానిక, వినోదం, మీడియా రంగాలు బాగుంటాయి" అన్నారు. పోలీసు శాఖ ఉపద్రవాలను ముందే పసిగడుతుందని చెప్పారు. ధార్మిక సంబంధ కార్యక్రమాల్లో అవినీతి ఆరోపణలు వస్తాయని చెప్పారు.

పంటలు బాగుంటాయి

"రైతులకు శుభమే. వర్షాలు భారీగానే కురుస్తాయి. చెరువులు నిండుతాయి. మధ్య దేశంలో అక్టోబరు నుంచి మహావర్షాలు కురుస్తాయి. డిసెంబరులో భారీ వర్షాలుంటాయి. వర్షాలు సకాలంలో కురవకపోయినా రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంటుంది. మంచిపంటలు పండుతాయి" అని పంచాంగకర్త తెలిపారు. పశు నష్టానికి చాన్స్ ఉందన్నారు.

మనది దేవ రాష్ట్రం

(మొదటిపేజీ తరువాయి..)

అంటూ పండుగ పర్వదినాన పార్టీ నేతలకు ముఖ్యమంత్రి కేసీఆర్ సుతిమెత్తగా హెచ్చరికలు చేశారు. ఉగాది పండుగ సందర్భంగా ప్రగతి భవన్‌లో ఆదివారం పంచాంగ పఠనం తర్వాత ఆయన మాట్లాడారు. "రాష్ట్రానికి రాజపూజ్యం 7 అవమానం 3 అని చెప్పారు. ఆదాయం 8 వ్యయం 2 అని చెప్పారు. అంటే, తెలంగాణ కచ్చితంగా సర్‌ప్లస్ బడ్జెట్ రాష్ట్రంగా ఉంటుంది. ఇది చాలా సంతోషకరమైన విషయం." అని కేసీఆర్ సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఢోకా లేదని, సుసంపన్న, మిగులు రాష్ట్రంగా ఉంటుందని చెప్పారన్నారు. మహేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి శాఖలు అద్భుతంగా ఉంటాయంటూ వారికి శుభాకాంక్షలు చెప్పారు. తాము ఎవరినీ కొట్టే పని లేదని, శాంతి భద్రతల పరిస్థితి బాగుంటుందని, దుర్మార్గుల ప్రకోపం తగ్గుతుందని చెప్పడంతో డీజీపీ మహేందర్ రెడ్డి, హోంమంత్రి నాయిని చాలా సంతోషంగా ఉన్నారని చెప్పారు. "నిజంగానే మనం గర్వపడే మాదిరిగా మహేందర్ రెడ్డి నేతృత్వంలో పోలీస్ శాఖ సమర్థంగా పని చేస్తోంది. పలు అవార్డులు వస్తున్నాయి." అని కొనియాడారు.

సాయం అందించే స్థితిలో..

దేశంలోని ఏడెనిమిది స్వయం సమృద్ధ రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని, ఎవరైతే సమృద్ధంగా లేరో వారికి సహాయాన్ని అందించే స్థితిలో తెలంగాణ ఉందని సీఎం కేసీఆర్ చెప్పారు. "తెలంగాణ తాను ఎదుగుతూనే, దేశాభివృద్ధి ప్రక్రియలో భాగస్వామి అవుతుందని ఓసారి ప్రధానికి కూడా చెప్పాను. కేంద్రానికి మనం రూ.50వేల కోట్లు ఇస్తే.. అక్కడి నుంచి రూ.24వేల కోట్లే వస్తుంది. అయినా, మన ఆదాయంతోనే మనల్ని మనం పోషించుకుంటున్నాం. దేశాన్ని ముందుకు తీసుకుపోయే దాంట్లో తెలంగాణది కీలక పాత్ర. ఈ మాట మన రాష్ట్రానికి గర్వకారణం" అని సీఎం అన్నారు.

పంచాంగం అంటే జ్యోతిష్యం కాదు.. సైన్స్

పంచాంగం అంటే ఏదో జ్యోతిష్యం చెప్పడం కాదని, డెఫినిట్‌గా ఇట్స్ ఏ సైన్స్ అని సీఎం కేసీఆర్ అన్నారు. ఇది అనేక యుగాల కిందటే మన దేశంలో ఆవిష్కృతమైన సైన్స్ అని, ఖగోళ సంవత్సరాలను లెక్కగట్టి 50 ఏళ్ల తర్వాత జరిగే విషయాలనూ చెప్పగలుగుతారని తెలిపారు. "ఆదాయం 8 వ్యయం 2 అంటే ఏ పంచాంగం చెప్పినా ఒకటే ఉంటుంది. తేడా ఉండదు. మారదు. పంచాంగకర్తల్లో ఒకరు చమత్కారంగా చెబుతారు. మరొకరు గంభీరంగా చెబుతారు. కొందరు హెచ్చరికపూర్వకంగా చెబుతారు. అంతేతప్ప, మూల సిద్ధాంతం ఒకటే. పంచాంగం చెప్పేవారు సూచన చేస్తారంతే. గ్రహ స్థితిగతులు, గ్రహణాలు సంభవించినప్పుడు అది మనుషులపై పడే ప్రభావం చెప్పేదే పంచాంగం" అని కేసీఆర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పంచాంగకర్త సంతోష్ కుమార్ శర్మ చాలా చతురులని సీఎం చమత్కరించారు.

కష్టం, సుఖం కలిస్తేనే జీవితం

"కొంత మంచి, కొంత చెడు. కొంచెం కష్టం, కొంచెం సుఖం కలగలసి జీవితముంటుందని తెలుగు సంవత్సరాది తొలిరోజునే పెద్దలు మనకు సందేశాన్ని అందిస్తున్నారు. అన్నింటినీ గంభీరంగా అనుభవిస్తూ, దైవాన్ని ప్రార్థిస్తూ ఎప్పటికప్పుడు తగిన ప్రయత్నాలు చేసుకుంటూ ముందుకు సాగడమే జీవితలక్ష్యం" అని తాత్వికంగా సీఎం వివరించారు. ఈరోజు తినే పచ్చడిలో తినే పదార్థం కంటే సందేశం ఎక్కువ ఉంటుందని, పులుపు, తీపి వంటి రుచుల కలయిక మాదిరిగానే జీవితం ఉంటుందని ఉగాది పచ్చడి విశిష్ఠతను వివరించారు.

అన్ని పండుగలను ఒకేలా చూసే సంస్కృతి తెలంగాణది

పేదింటి ఆడపిల్లకు పెళ్లి కానుక, వితంతువులు, వృద్ధులకు పింఛన్లు ఇస్తున్నామంటే అది భగవంతుని కృప అని, బ్రహ్మోత్తముల ఆశీస్సులు ఉన్నాయని సీఎం కేసీఆర్ చెప్పారు. "తెలంగాణ దేవ రాష్ట్రం. మసీదుల్లో కావచ్చు, చర్చిల్లో, గుడుల్లో కావచ్చు. అద్భుతమైన పూజలు జరుగుతాయి. మౌజీమ్‌లు, ఇమామ్‌లు, పూజారులకు ఏ రాష్ట్రంలో వేతనాలు ఇవ్వరని, అన్ని పండుగలను సమానంగా చూస్తున్నది తెలంగాణ ఒక్కటేనని ఓ పెద్దాయన ఈరోజు మాతో చెప్పారు. ఆ సంస్కారం తెలంగాణకు మాత్రమే ఉంది. అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను. భగవంతుడు నియమించిన కార్యకర్తలుగా ఇందుకు మనం యథాశక్తి కృషి చేద్దాం" అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. అన్ని సంవత్సరాల మాదిరిగానే ఈ ఏడాది కూడా రాష్ట్ర ప్రజానీకానికి శుభం జరగాలని, మంచి వర్షాలతో పంటలు పండి, రైతాంగం సుభిక్షంగా ఉండాలని భగవంతుడిని మనసారా ప్రార్థిస్తున్నానని సీఎం కేసీఆర్ చెప్పారు.



రాజ్‌భవన్‌లో ఉగాది వేడుకల సందర్భంగా వేదపండితుల ఆశీర్వాదం తీసుకుంటున్న గవర్నర్ నరసింహన్ దంపతులు

కాంగ్రెస్‌కు ఉజ్వల భవిష్యత్తు

- అక్టోబరు తర్వాత ఉత్తమ్‌కు మంచి రోజులు
- గాంధీభవన్‌లో ఉగాది పంచాంగ శ్రవణం

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విళంబి నామ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీకి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పంచాంగకర్త గొట్టిపాల తిరుమల శాస్త్రి జోస్యం చెప్పారు. గాంధీభవన్‌లో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం విళంబినామ సంవత్సరాదిని పురస్కరించుకుని ఆయన పంచాంగ శ్రవణం చేశారు. ప్రజాసమస్యలపై చేస్తున్న పోరాటాలు పార్టీకి విజయాన్ని అందిస్తాయని చెప్పారు. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డికి అక్టోబరు తర్వాత మహర్దశ ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయాల దిశగా అడుగులు వేస్తోందని, ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని చెప్పారు.



బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఉగాది పచ్చడిని సేవిస్తున్న దత్తాత్రేయ, లక్ష్మణ్, రాంచంద్రరావు తదితరులు

నవ భారత నిర్మాణం దిశగా అడుగులు: లక్ష్మణ్

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో నవ భారత నిర్మాణం దిశగా మోదీ ప్రభుత్వం వేగంగా పనిచేయనుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. ఆదివారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఉగాది వేడుకలను నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. శశిభూషణ్‌శర్మ పంచాంగ శ్రవణం చేశారు. విళంబినామ సంవత్సరంలో రాజు స్థానంలో సూర్యుడు ఉన్నాడని, దీంతో వాతావరణం, పాడి పంటలకు అనుకూలమని తెలిపారు. వర్షాలు పుష్కలంగా కురిసి సమృద్ధిగా పంటలు పండుతాయని చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, సుధాకర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఏడాదిలో టీడీపీకి పూర్వవైభవం: రమణ

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విళంబినామ సంవత్సరంలో ఆటంకాలన్నీ తొలగి తెలంగాణలో తెలుగుదేశం పూర్వ వైభవాన్ని సంతరించుకుంటుందని టీడీపీ-టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రమణ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం ఎన్టీఆర్‌భవన్‌లో నూతన సంవత్సర ఉగాది వేడుకలను నిర్వహించారు. తాండూరి శ్రవణ్‌కుమార్ పండితులు పంచాంగాన్ని చదివి వినిపించారు. కొత్త సంవత్సరంలో టీడీపీ తెలంగాణలో పుంజుకుంటుందని తెలిపారు. ప్రజాభిమానంతో రాష్ట్రంలో నిర్ణయాత్మక శక్తిగా ఎదుగుతుందని జోస్యం చెప్పారు. 2019 ఎన్నికల తర్వాత ప్రభుత్వంలో భాగస్వామిగా కూడా అవతరించనుందని చెప్పారు. జాతీయ రాజకీయాల్లోనూ తెలుగుదేశం కీలక పాతర పోషిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి, కొత్తకోట దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన సంస్కృతి ప్రపంచానికి ఆదర్శం

కొత్త ఆలోచనలు, మార్పులకు నాంది పలకండి. మాతృభాషను మరిస్తే మానవుడే కాదు

- ఉగాది పచ్చడిలో జీవిత పరమార్థం దాగుంది
- స్వర్ణభారత్ ట్రస్టు ఉగాది వేడుకల్లో ఉప రాష్ట్రపతి వెంకయ్య



స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఉగాది వేడుకల్లో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రులు నరేంద్రసింగ్ తోమర్, హర్దీప్‌సింగ్ పూరి, డిప్యూటీ సీఎం మహమూద్ అలీ తదితరులు

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి)/శంషాబాద్ రూరల్: భారతదేశ సంస్కృతి, సాంప్రదాయలు ప్రపంచ దేశాలకు ఆదర్శమని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో తెలుగు భాషకు ప్రాధాన్యం తగ్గిందని, భాషను కాపాడాలని ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సూచించానని చెప్పారు. కన్నతల్లి, జన్మభూమి, మాతృభాష, మాతృదేశాన్ని మరిచినవాడు మానవుడే కాదన్న విషయాన్ని తాను ఇప్పటికే పలుమార్లు చెప్పానని గుర్తు చేశారు. రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్‌లో స్వర్ణభారత్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకయ్య మాట్లాడుతూ.. ఈ విళంబినామ సంవత్సరం నుంచి కొత్త ఆలోచనలు, మార్పులకు నాంది పలకాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 'నేటి యువత తెలుగును పూర్తిగా మరిచిపోతోంది. ఇది మంచి పరిణామం కాదు. మన తెలుగు ఇళ్లల్లో ప్రతి ఒక్కరం తెలుగులోనే మాట్లాడుదాం..' అని సూచించారు. గవర్నర్ నరసింహన్ తెలుగులో చక్కగా మాట్లాడతారని ఆయన కొనియాడారు. షడ్రుచుల మేళవింపైన ఉగాది పచ్చడిలో జీవిత పరమార్థం దాగి ఉందన్నారు. దేశాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని కేంద్ర మంత్రి నరేంద్రసింగ్ తోమర్ పిలుపునిచ్చారు. దేశ సంపద యువత అని, సరైన సమయంలో యువతకు ఉపాధి కల్పిస్తే దేశం అభివృద్ధి బాట పడుతుందని కేంద్ర సహాయ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి అన్నారు. ఉప రాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు ఉండటం తెలుగు రాష్ట్రాల గొప్పతనం అని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ కొనియాడారు. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈ సందర్భంగా సర్టిఫికెట్లు అందజేశారు.

సీఎం కేసీఆర్‌కు ఉప రాష్ట్రపతి అభినందనలు

రాజ్‌భవన్‌లో జరిగిన ఉగాది వేడుకల్లో ఉపరాష్ట్రపతి వెంకయ్యకు తెలుగుకు సంబంధించిన పుస్తకాలను సీఎం అందజేశారు. ఇలాంటి పుస్తకాలను ప్రజలకు అందించాలని సీఎం నిర్ణయించడం సంతోషంగా ఉందని, కేసీఆర్‌ను తాను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు వెంకయ్య అన్నారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	36.0	21.0
రామగుండం	35.8	20.6
వరంగల్	34.5	20.5
నల్లగొండ	34.0	21.0
హైదరాబాద్	33.8	21.3

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దాదాపు 75 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి సుమారు 10 గంటలు, దివ్యదర్శనానికి సుమారు 2 గంటల సమయం పడుతోంది. మంగళవారం సేవలకు సంబంధించి విజయాబ్యాంకులో సోమవారం లాటరీ ద్వారా జారీచేసే టిక్కెట్లు.. సుప్రభాతం:50, కల్యాణోత్సవం:80, డోలోత్సవం:25, అర్చన:16, ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లు పొందడానికి www.ttdsevaonline.com లో సంప్రదించాలి.

- ఆంధ్రజ్యోతి, తిరుమల



అయోధ్యలో రామాలయం.. లఖ్‌నవ్‌లో మసీదు

" పలు పార్టీలతో చర్చించాక అయోధ్య వివాదంపై ఒక ప్రతిపాదనను సిద్ధం చేశాం. అయోధ్యలో రామమందిరం కట్టుకోండి.. అలాగే లఖ్‌నవ్‌లో మసీదును నిర్మించుకోనివ్వండి."

- రాహుల్‌గాంధీకి షియా వక్ఫ్ బోర్డు సెక్రటరీ వసీం రిజ్వి లేఖ




వారిని పాండవులుగా గుర్తించాలని అనుకుంటున్నారు

" శ్రీరాముడి ఉనికిని ప్రశ్నించిన పార్టీ(కాంగ్రెస్) ఇప్పుడు పాండవులుగా గుర్తించాలని కోరుకుంటోంది. కాంగ్రెస్‌కు, బీజేపీకి వేర్వేరుగా మతబోధకులు ఉంటారని నేను వినలేదు. రాహుల్ హిందూ మతాన్ని అపహస్యం చేశారు.'

- కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.76.46	పాత ధర 68.13
కొత్త ధర రూ.76.44	కొత్త ధర 68.15
తగ్గుదల: 2 పైసలు	తగ్గుదల: 2 పైసలు



ఊబకాయంపై వైరుధ్యాలు కల్పితమే!

లండన్, మార్చి 18: 'బరువు ఎక్కువగా ఉన్న వారందరికీ హృద్రోగాలు రావు!' అన్న భావన తప్పని, అవాస్తవమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. శరీరంలో కొవ్వు పెరిగిన కొద్దీ గుండె కచ్చితంగా ప్రభావితమవుతుందని హెచ్చరించారు. బాడీ మాస్ ఇండెక్స్ 22-23 దాటితే బీపీ, గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని యూకేలోని గ్లాస్గో వర్సిటీ పరిశోధకులు తెలిపారు.

ప్రొటీన్ చాపతో కాలుష్యానికి ఉచ్చు

లాస్ ఏంజెలిస్, మార్చి 18: విషపూరిత వాయువుల్ని పీల్చి కాలుష్యాన్ని తగ్గించే ప్రొటీన్ చాపల్ని శాస్త్రవేత్తలు తయారు చేశారు. ప్రొటీన్లు సహజ వాతావరణం నుంచి బయటికి వస్తే అస్థిరంగా, కచ్చితమైన నమూనాను కలిగి ఉంటాయి. కానీ, కాలిఫోర్నియా వర్సిటీ శాస్త్రవేత్తలు ప్రొటీన్లు స్థిరత్వాన్ని పెంపొందించుకునేలా చేసి కృత్రిమ సమ్మేళనాలతో ఈ చాపల్ని రూపొందించారు. ఇవి క్రిమిసంహారక మందుల్లోని విషపూరిత, రసాయన వాయువులను పీల్చేస్తాయట.

మొక్కల్లో మెక్కడం నిజమే!

నర్సాపూర్‌లో లీజుకు మరో నర్సరీ.. 4 ఎకరాల్లో 15 లక్షల మొక్కల ఉత్పత్తి అసాధ్యం

- 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెలుగులోకి
- వచ్చే ఏడాదికి టార్గెట్ ఇవ్వలేదట
- కానీ, 'ఆంధ్రజ్యోతి' కథనానికి ఉద్యానవన శాఖ ఖండన
- శాస్త్రవేత్తలు నిర్ణయించిన ధరల్లోనే అమ్ముతున్నాం: డైరెక్టర్



మెదక్ జిల్లా నర్సాపూర్ శివారులో మొక్కలు పెంచామని అధికారులు చెబుతున్న నర్సరీ ఇదే

మెదక్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): హరితహారంలోని స్టేట్ హోం ప్లాంటేషన్లో భాగంగా ఉద్యానవన శాఖ పండ్ల మొక్కలను పెంచాలని, కానీ, ఆ శాఖ అధికారులు ప్రైవేటు నర్సరీల నుంచి తక్కువ ధరకు కొని, ప్రభుత్వానికి ఎక్కువ ధరకు అమ్మారని పేర్కొంటూ 'మొక్కే లేదు. మెక్కేశారు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి ఉద్యానవన శాఖ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి వివరణ ఇచ్చారు. హరితహారం కార్యక్రమంలో ఇచ్చిన లక్ష్యాల సాధనకు, ఉద్యాన శాఖ అజమాయిషీలో వర్క్ కాంట్రాక్టు పద్ధతిలో మొక్కల ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు. అధికారులు, శాస్త్రవేత్తలతో కూడిన కమిటీ నిర్ణయించిన ధరల్లోనే మొక్కలను ఉత్పత్తి చేసి, వారు నిర్ణయించిన ధరలకే అమ్ముతున్నామని వివరించారు. 'ఆంధ్రజ్యోతి' కథనం అబద్ధమని పేర్కొన్నారు. నిర్ణీత ప్రమాణాలను పాటిస్తూ నాణ్యమైన మొక్కలను ఉత్పత్తి చేసి సరఫరా చేస్తున్నామని తెలిపారు. మొక్కల అమ్మకం ద్వారా వచ్చిన లాభాన్ని నర్సరీ అభివృద్ధి, ఇతర పనులకు వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉద్యాన నర్సరీలను నిర్వహించే సొసైటీ ఫర్ హార్టీకల్చర్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి నిధులను ఇవ్వడం లేదని, మొక్కల అమ్మకంతో వచ్చిన లాభాలతోనే మౌలిక సదుపాయాలు, నిర్వహణ, జీతభత్యాలకు ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. నత్నాయిపల్లి నర్సరీలో బోర్లు ఎండిపోవడంతో తయారు చేసిన మొక్కలు చనిపోకుండా నీటి లభ్యత ఉన్న ప్రదేశానికి నర్సరీని మార్చామని, అక్రమాలకు తావు లేదని తెలిపారు. నీటి లభ్యత ఉన్న ప్రాంతాన్ని లీజుకు తీసుకుని, నాణ్యమైన మొక్కలను జిల్లా ఉద్యానవన అధికారుల పర్యవేక్షణలో యూనిట్ కాస్ట్ ప్రొడక్షన్‌కు లోబడే తయారు చేశామని వివరించారు. దాంతోపాటు, ఈ నర్సరీల్లోనే మొక్కలను పెంచామంటూ కొన్ని ఫొటోలను కూడా పంపించారు. అయితే, ఉద్యానవన శాఖ వివరణపై 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయిలో మరింత లోతుగా పరిశీలించింది. లీజుకు తీసుకున్నామని చెబుతున్న నర్సరీల్లో పరిమితంగా మొక్కలు పెంచి.. మిగిలిన వాటిని ప్రైవేటు నర్సరీల నుంచి కొనుగోలు చేసినట్లు స్పష్టమైంది. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని నత్నాయిపల్లి మోడల్ నర్సరీ నుంచి 2016-17 ఆర్థిక సంవత్సరంలో 14.79 లక్షల మామిడి మొక్కలు సరఫరా చేసినట్లు రికార్డుల్లో పేర్కొన్నారు. అయితే, నత్నాయిపల్లి నర్సరీలో అసలు నీళ్లు లేవని, అక్కడ పిచ్చి మొక్కలు పెరిగాయనీ 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. దాంతో, నర్సాపూర్ పట్టణ శివారులోని మల్లన్న ఆలయ సమీపంలో ఓ వ్యక్తి నిర్వహిస్తున్న 4 ఎకరాలు లీజుకు తీసుకున్నట్లు స్థానిక ఉద్యాన శాఖ అధికారులు చెప్పారు. అక్కడికి వెళ్లి 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయిలో పరిశీలించింది. అధికారులు చెబుతున్నట్లు అక్కడ 4 ఎకరాల నర్సరీ లేదు. కేవలం రెండున్నర ఎకరాలు మాత్రమే ఉంది. అక్కడ 14.79 లక్షల మొక్కలు పెంచడం అసాధ్యం. 15 లక్షల మొక్కలను సరఫరా చేయాలంటే ఎంత లేదన్నా కనీసం 20 లక్షల మొక్కలను గ్రాఫ్టింగ్ (అంటుకట్టడం) చేయాల్సి ఉంటుంది. ఇందుకు కనీసంలో కనీసం 30 లక్షల పిక్కలను నింపాల్సి ఉంటుంది. ఇందుకు 25-30 ఎకరాల స్థలం అవసరమని ఆ రంగంలో అనుభవజ్ఞులు చెబుతున్నారు. ఒకవేళ స్థానిక అధికారులు చెబుతున్నట్లు అక్కడ 4 ఎకరాలను లీజుకు తీసుకున్నా 15 లక్షల మొక్కలను సరఫరా చేయడం అసాధ్యమని శాస్త్రవేత్తలే తేల్చి చెబుతున్నారు. ఒక రోజుకు ఒక వ్యక్తి వెయ్యి మొక్కలను మాత్రమే గ్రాఫ్టింగ్ చేయగలరు. ఒకవేళ పదిమంది పని చేశారని అనుకున్నా.. సెలవులేకుండా పని చేస్తే ఒక్క గ్రాఫ్టింగ్‌కే 150 రోజులు అంటే 5 నెలలు పడుతుంది. ఏడాదంతా కష్టపడిన ఒక్క ప్రైవేటు నర్సరీల్లో మూడున్నర లక్షలకు మించి మొక్కల ఉత్పత్తి సాధ్యం కాదని వాటి యజమానులే చెబుతున్నారు. లీజుకు తీసుకున్న నర్సాపూర్ నర్సరీలో 4 లక్షలలోపే మొక్కలను పెంచినట్లు తెలుస్తోంది. మిగిలిన 10 లక్షల మేర మొక్కలను సంగారెడ్డి జిల్లా సదాశివపేట, ఖమ్మం జిల్లా అశ్వారావుపేటల్లోని ప్రైవేట్ నర్సరీల నుంచి కొనుగోలు చేసి తెచ్చారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఒక్కో మొక్కను పెంచేందుకు ప్రభుత్వం రూ.22 ఖర్చు చేయాల్సి ఉంది. కానీ, అధికారులు మాత్రం నాసిరకం మొక్కలను రూ.12 నుంచి రూ.14 వరకు వెచ్చించి తెప్పించినట్లు తెలుస్తోంది. వాటినే ఒక్కో మొక్కకు రూ.30 చొప్పున ప్రభుత్వానికి విక్రయించారని సమాచారం. ప్రైవేట్ నర్సరీల నుంచి తెప్పించిన మొక్కలను నర్సాపూర్‌లో లీజుకు తీసుకున్న స్థలంలో పెంచిన మొక్కలతో కలిపేశారు. అక్కడి నుంచే వివిధ జిల్లాలకు సరఫరా చేశారు. తక్కువ ధరకు కొనుగోలు చేసిన వాటితో కమీషన్ నొక్కేశారు. ఈ అక్రమ తంతులో నర్సాపూర్‌కు చెందిన ఓ నర్సరీ యజమాని కూడా కీలక పాత్ర పోషించాడు. నిజానికి, నర్సాపూర్‌లోనే మరో చోట నర్సరీని అధికారులు లీజుకు తీసుకుంటే.. ఉద్యానవన శాఖ పేరుపై భూ యజమానితో అగ్రిమెంట్ చేయించాలి. కానీ, ఎంతమేర లీజు కోసం వెచ్చించారన్న లెక్కలు లేవు. నర్సరీల్లో పని చేసిన కూలీలు ఎందరు, వారికి ఎలా కూలీ మొత్తం చెల్లించారన్న సమాచారం లేదు. ప్రభుత్వం స్పందించి సమగ్ర విచారణ జరిపిస్తే మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

కొసమెరుపు

వరుసగా రెండేళ్లపాటు 5 లక్షలు, 14.79 లక్షల మొక్కలను సరఫరా చేసిన 'మోడల్ నర్సరీ'కి మూడో ఏడాది కూడా మొక్కల సరఫరా కాంట్రాక్టు ఇవ్వాలి కదా! వాటి ఉత్పత్తి ఇప్పటికే ప్రారంభించి ఉండాలి కదా! అయితే వచ్చే ఏడాది హరితహారానికి ఎన్ని మొక్కలు సరఫరా చేస్తున్నారు? వాటిని ఎక్కడ ఉత్పత్తి చేస్తున్నారని 'ఆంధ్రజ్యోతి' మెదక్ జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వక్రపాణిని ప్రశ్నించింది. అయితే, వచ్చే ఏడాది హరితహారానికి సంబంధించి తమకు ఎటువంటి లక్ష్యం ఇవ్వలేదని, తాము మొక్కలను ఉత్పత్తి చేయడం లేదని ఆయన స్పష్టం చేయడం గమనార్హం.



మెదక్ జిల్లా నర్సాపూర్ శివారులో లీజుకు తీసుకున్నట్లు అధికారులు చెబుతున్న స్థలం ఇదే

కర్నూలు కేంద్రంగా నకిలీ విత్తనాల దందా

- సూత్రధారి కోసం పోలీసుల వేట



నకిలీ విత్తనాలతో పట్టుబడిన లారీ (ఫైల్)

మంచిర్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గత రెండేళ్లుగా మూడు రాష్ట్రాల్లో నకిలీ విత్తనాల దందా చేస్తున్న ముఠా సూత్రధారి కర్నూల్‌లోనే ఉన్నట్లు సమాచారం. నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. కేవలం ఫోన్ల ద్వారానే లారీలు పంపించి మరీ ఈ వ్యవహారం నడుపుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీనిపై మంచిర్యాల జిల్లా పోలీసులు రామగుండం కమిషనర్ విక్రంజిత్ దుగ్గల్ నేతృత్వంలో లోతుగా విచారిస్తున్నారు. తాండూర్ ఎస్‌ఐ కొత్తపల్లి రవికి ఈ నెల 15న రాత్రి అందిన సమాచారం మేరకు తాండూర్ వద్ద లారీ లోడ్ నకిలీ విత్తనాలను పట్టుకున్నారు. కుమ్రం భీం జిల్లా కాగజ్‌నగర్, మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా గోండ్ పిప్రికి సరఫరా చేయడానికి లారీ వెళ్తుండగా పట్టుకున్నారు. దీంతో ఈ ముఠా వివరాలు చాలా వరకు బయటపడ్డాయి. ముఠా సూత్రదారి, ఎమ్మిగనూర్‌కు చెందిన సాంబిరెడ్డిని అరెస్టు చేయాల్సి ఉంది. అటు ప్రకాశం జిల్లాలోని ఇంకొల్లుకు చెందిన బుజ్జి పాత్ర కూడా కీలకమని పోలీసులు అనుమానిస్తున్నారు. కర్నూలు జిల్లాలో ఉత్పత్తి అవుతున్న నకిలీ పత్తి విత్తనాల స్థావరాన్ని కనుగొనే పనిలో పోలీసులున్నారు. ఈ విత్తనాలను ఛత్తీస్‌గఢ్ వరకు వీరే సరఫరా చేస్తున్నట్టు సమాచారం. ఉప్పు బస్తాల మాటున ఈ విత్తనాలను ఇటీవల ఈ నెల 15న రాత్రి తీసుకెళ్తుండగా తాండూర్ పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. మొత్తం 51.50 క్వింటాళ్ల నకిలీ విత్తనాలను పట్టుకోగా దీని విలువ రూ. కోటికి పైగా ఉంటుందని పోలీసులు చెప్పారు. ప్రధాన పంపిణీ దారుగా మద్దెల సాంబిరెడ్డిని గుర్తించారు. మారబోయిన కృష్ణారెడ్డిని లారీ యజమానిగా గుర్తించారు. కర్నూలు నుంచి తెలంగాణాలో కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా దాటి అటు మహారాష్ట్రలోని గడ్చిరోలి, ఛత్తీస్‌గఢ్ వరకు భారీగా చెక్ పోస్టులున్నాయి. ప్రతీ చోట సిబ్బందిని మేనేజ్ చేసి మరీ ఈ రాకెట్‌ను నడిపిస్తున్నారని తెలుస్తోంది. ఇన్ని చెక్‌పోస్టులు దాటాలంటే కచ్చితంగా దీని సూత్రధారికి అధికారులతో, లేదా రాజకీయ నాయకులతో మంచి పరిచయాలు ఉండొచ్చని భావిస్తున్నారు. సత్తయ్య, రాఘవరావు, మహేష్, శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తులపై కూడా పోలీసులు కేసులు నమోదు చేశారు. ఏడాది క్రితం మందమర్రి మండలంలోని గద్దెరాగడి వద్ద రూ. కోటికి పైగా విలువ గల నకిలీ విత్తనాలను పటుకున్నారు. ఈ రాకెట్‌ను బట్ట బయలు చేసిన అప్పటి ఏసీపీ సతీష్‌ను బదిలీ చేశారు. సూత్రధారులు బయటకు రాకుండా, ఆయన డబ్బులు తీసుకున్నాడని ఆరోపించి బలిపశువును చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఇది నిజమేనని విచారణలో తేలిందని సమాచారం. ఈసారి ప్రధాన సూత్రధారి ఆట కట్టించడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు.



అఖిలపక్ష నాయకులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్

'పెండ్లిపాకల' బాధిత కుటుంబాలకు పరిహారం

- నల్లగొండ జిల్లా కలెక్టర్ హామీ

దేవరకొండ, మార్చి 18: నల్లగొండ జిల్లా పెండ్లిపాకల ప్రాజెక్టు నీటి గుంతలో పడి మృతి చెందిన ఐదుగురు గిరిజన చిన్నారుల కుటుంబాలకు రూ.3 లక్షల పరిహారం, డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయిస్తామని నల్లగొండ జిల్లా కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ హామీ ఇచ్చారు. ఆదివారం ఉదయం మృతుల బంధువులతో కలిసి అఖిలపక్ష నాయకులు దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ కారును అడుకున్నారు. రూ. 10లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. దీంతో ఎమ్మెల్యే ఈ విషయాన్ని జిల్లా మంత్రి జగదీష్ రెడ్డితో సంప్రదించి సీఎం సహాయ నిధి నుంచి రూ. 2లక్షలు ఇస్తామని ప్రకటించారు. జిల్లా కలెక్టర్ వచ్చి హామీ ఇవ్వాలని బాధితులు డిమాండ్ చేశారు. కలెక్టర్ గౌరవ్ ఉప్పల్, జిల్లా అదనపు ఎస్పీ పద్మనాభరెడ్డిలు దేవరకొండకు చేరుకొని మృతుల బంధువులు, అఖిలపక్ష నాయకులతో మాట్లాడారు. ఒక్కో కుటుంబానికి రూ. 3 లక్షల పరిహారం అందించి డబుల్ బెడ్‌రూంతో పాటు ప్రభుత్వపరంగా ఆ కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని కలెక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉన్న చిన్నారుల మృతదేహాలను పరిశీలించి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతదేహాలను స్వగ్రామమైన పెండ్లిపాకల గుడితండాకు తరలించారు. తక్షణ సహాయం కింద ఒక్కొక్క కుటుంబానికి రూ. లక్ష అందజేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.

బాలికపై అత్యాచారం కేసు: పోలీసుల అదుపులో 14మంది

పినపాక, మార్చి 18 : గిరిజన బాలికపై సామూహిక అత్యాచారం కేసులో 14 మంది నిందితులను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం పాండురంగాపురం గ్రామానికి చెందిన ఓ బాలిక (15)పై ఈనెల 11న 14 మంది యువకులు సామూహిక అత్యాచారం చేసిన ఘటన శనివారం రాత్రి వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై శనివారం రాత్రి బాధితురాలు ఏడూళ్ల బయ్యారం పోలీసులకు ఫిర్యాదు చేయగా... మణుగూరు డీఎస్పీ సాయిబాబా ఆదేశాలతో అశ్వాపురం సీఐ అల్లం నరేందర్ ఆడవి రామరం, దుబ్బగుంపు గ్రామాల్లో ఆదివారం నిందితుల కోసం గాలించారు. 14 మంది నిందితులతో పాటు వారు ఉపయోగించిన ద్విచక్ర వాహనాలు, ఆటోలు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఆర్థిక నష్టంతో రైతు ఆత్మహత్య

తిప్పర్తి, మార్చి 18 : వ్యవసాయంలో నష్టపోయిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఖాజీరామారం గ్రామానికి చెందిన సుంకరి సైదులు (39) తనకున్న ఐదెకరాల్లో పత్తి పంటను సాగు చేశాడు. దిగుబడి రాకపోవటం, ధరలు లేకపోవటంతో ఆర్థికంగా నష్టపోయాడు. దీంతో మనస్తాపం చెందిన సైదులు ఆదివారం గ్రామ సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

కాల్పులు జరిపినా ప్రాణాలతో పట్టుకున్నాం

- భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ అంబర్‌కిషోర్ ఝా

కొత్తగూడెం క్రైం, మార్చి 18: సాయుధ నక్సల్స్ తమపై కాల్పులు జరిపినా ప్రాణాలతో పట్టుకున్నామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ అంబర్‌కిషోర్ ఝా అన్నారు. పాల్వంచలో సాయుధ దళాలు కాంట్రాక్టర్లను, వ్యాపారులను డబ్బుల కోసం డిమాండ్ చేస్తున్న న్యూ డెమోక్రసీ రామన్న దళానికి చెందిన ఆరుగురు సాయుధ నక్సల్స్ శుక్రవారం పోలీసులకు తారసపడ్డారని ఆయన ఆదివారం విలేకరులకు తెలిపారు. నక్సల్స్ కాల్పులను ప్రారంభించారని తెలిపారు. ప్రాణ రక్షణార్థం పోలీసులు కూడా కాల్పులు జరిపారని తెలిపారు. అశ్వాపురం మండలం గొందిగూడేనికి చెందిన మడివి భీమా అలియాస్ భద్రును ప్రాణాలతో పట్టుకున్నట్లు ఝా వివరించారు. భీమా వద్దఒక 8 ఎం.ఎం తుపాకీ, 5 రౌండ్లు, రూ.8,890 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.



భద్రాద్రిలో ఈనెల 26న నిర్వహించే శ్రీ సీతారామచంద్ర స్వామివారి కల్యాణానికి రాష్ట్ర గవర్నర్ నరసింహన్ దంపతులను ఆదివారం హైదరాబాద్ రాజ్‌భవన్‌లో ఆహ్వానిస్తున్న దేవస్థానం ఈవో కె.ప్రభాకర శ్రీనివాస్, వైదిక బృందం - భద్రాచలం

విళంబికి మామిడి వగరు

- ఒక్కోకాయ 50 రూపాయలకు విక్రయం

మెదక్, మార్చి 18 : విళంబి నామసంవత్సరం ధరల మోతతో ప్రారంభమైంది. తెలుగు సంవత్సరాది ఉగాది పండగ పచ్చడి లేకుండా జరగదు. షడ్రుచుల్లో ప్రధానమైన పులుపు, వగరుతో కూడిన లేత మామిడికాయలకు ఈయేడు గడ్డుకాలమొచ్చింది. జిల్లావ్యాప్తంగా మామిడిపూత తక్కువగా పూయడంతో కాయల కొరత తీవ్రంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. ఉగాది పండగ సందర్భంగా ఆదివారం మెదక్ మార్కెట్‌లో ఒక్కో మామిడికాయను రూ.50లకు విక్రయించారు.

వైభవంగా ఉగాది వేడుకలు



యాదాద్రిలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

యాదాద్రి/ భద్రాచలం/ వేములవాడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో ఆదివారం శ్రీ విళంబినామ సంవత్సర ఉగాది వేడుకలను వైభవంగా నిర్వహించారు. బాలాలయంలో స్వామివారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయంలో స్వామివారికి షడ్రుచులతో ఉగాది పచ్చడి, భక్ష్యాలను ప్రత్యేక నివేదన జరిపి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం లక్ష్మీనరసింహులకు విశేష అలంకారం జరిపి బాలాలయ మండపంలో ఊరేగించి.. ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ఆలయ పంచాంగకర్త సిద్ధాంతి గౌరీభట్ల సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిపారు. స్వామి, అమ్మవార్ల రాశి ఫలాలను ఆదాయ కందాయ ఫలాలను వివరించారు. స్వామివారికి ఆదాయం 11, వ్యయం 5 ఉంటుందని, అమ్మవారికి ఆదాయం 11, వ్యయం 11 ఉంటుందని వివరించారు. భద్రాచలం రామాలయంలో ఉగాదిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం కావడంతో మూలవరులకు పంచామృతాభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. రాత్రి పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ సందర్భంగా రామయ్య ఆదాయం 8, వ్యయం 2, సీతమ్మ ఆదాయం 4, వ్యయం 2 గా అర్చకులు తెలిపారు. అనంతరం రామయ్యకు తిరువీధి సేవ జరిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రంలో ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. శ్రీరామ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

కొత్త పంచాయతీలు కొలిక్కి!

తండాలు.. ప్రత్యేక పంచాయతీలు.. కొత్తగా మరిన్ని మునిసిపాలిటీలు

- నేడు కేబినెట్‌లో ఆమోదం



హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కొత్త పంచాయతీల ఏర్పాటుపై కసరత్తు తుది దశకు చేరుకుంది. దాదాపు 4 వేల పంచాయతీలు నూతనంగా ఏర్పడనున్నాయి. సమీప పట్టణాల్లో విలీనమయ్యే గ్రామాలను కూడా ఈ ప్రక్రియలో భాగంగానే అధికారులు గుర్తిస్తున్నారు. అలాగే, నూతనంగా మునిసిపాలిటీల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. సోమవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో కొత్త పంచాయతీలు, సమీప పట్టణాల్లో విలీనం చేసే గ్రామాలకు ఆమోదం తెలపనున్నారు. తద్వారా కొత్త పంచాయతీల ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది. 500కుపైబడి జనాభా ఉన్న ఆవాసాలను పంచాయతీలుగా, గిరిజన తండాలు, గూడేలు లేదా వాటి సమూహాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో కొత్త పంచాయతీల కోసం 5,040 వరకు ప్రతిపాదనలు అందాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు ఖరారు చేసిన జాబితాలే ఫైనల్ అవుతున్నట్లు సమాచారం.

గ్రామసభల తీర్మానాలకు చెక్?

పంచాయతీల స్వరూపాన్ని మార్చాలంటే విధిగా గ్రామ సభలో తీర్మానం చేయాలని ప్రస్తుత చట్టం చెబుతోంది. గ్రామ పంచాయతీలను రద్దు లేదా కొత్త పంచాయతీల ఏర్పాటు కోసం తీర్మానించాల్సి ఉంటుంది. అయితే, నూతన పంచాయతీరాజ్ చట్టం-2018లో గ్రామ సభల తీర్మానం అవసరం లేకుండానే... కొత్త పంచాయతీలు ఏర్పాటు చేసే క్లాజును పొందుపర్చేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. ప్రస్తుత సమావేశాల్లో ఈ బిల్లు ఆమోదం పొందితే గ్రామ పంచాయతీల స్వరూపాన్ని మార్చే విషయంలో సంబంధిత గ్రామ సభల తీర్మానం అవసరం ఉండదు.

12 వేలకు పైగానే!


తెలంగాణలో ప్రస్తుతం 8,684 గ్రామ పంచాయతీలు, 73 మునిసిపాలిటీలు ఉన్నాయి. కొత్తగా 4 వేల వరకు పంచాయతీలు ఏర్పాటు కావడంతోపాటు కొన్ని పంచాయతీలు, ఆవాసాలు సమీప పట్టణాల్లో విలీనం కాబోతున్నాయి. ఈ ప్రక్రియ పూర్తయితే రాష్ట్రంలో గ్రామ పంచాయతీల సంఖ్య 12 వేలకుపైగా చేరుతుందని సమాచారం. వీటితో పాటు పట్టణ స్థానిక సంస్థలుగా మార్చేందుకు అవకాశమున్న వాటినీ గుర్తిస్తున్నారు. ఈ క్రమంలో దాదాపు 40 కొత్త మునిసిపాలిటీలు ఏర్పాటు కానున్నాయని అంచనా. దీంతో మునిసిపాలిటీల సంఖ్య కూడా వంద దాటుతుందని చెబుతున్నారు. మునిసిపాలిటీలుగా మార్చే పంచాయతీలను ప్రస్తుతం గుర్తించినప్పటికీ, అధికారికంగా తర్వాత ప్రకటిస్తారని సమాచారం.

వివిధ
సాహిత్య వేదిక vividha@andhrajyothy.com

హృదయంలోపలి మనిషిని అన్వేషించే 'బౌల్స్'

సంగీతమయ సంస్కృతి, జీవన విధానం బెంగాల్ గ్రామ్య జీవితాన్ని ఎంతగా ప్రభావితం చేసిందంటే, అనేక శతాబ్దాలపాటు బౌల్ అభ్యాసకులను గ్రామీణులు పోషిస్తూవచ్చారు. బౌల్ (Baul) అంటే అనేక అర్థాలున్నాయి. వాటిల్లో ముఖ్యంగా పేర్కొనేవి - ఉన్మత్తులు, గాలిలాంటి వాళ్లు, లయ తప్పిన వారు, అరబ్బీ అర్థంలో సాధువులు. వారు హిందువులైనా కావచ్చు, ముస్లిములయినా కావచ్చు, ఏ మతస్థులయినా కావచ్చు. వారికి మతం లేదు. నిజానికి వారికి ఏ దేవుడూ లేడు. వారు ఎవరైనా, సామాజిక కట్టుబాట్ల ఛాందసాల వ్యతిరేకులు. పరిశుద్ధమైన పారలౌకికవాదులు. సూఫీలలాగ మనిషిలోని ఆవశ్యక మనిషిని వెదికే ప్రయత్నంలో ఉంటారు. ఆ ఆవశ్యక మనిషిని వారు "మొనేర్ మానుష్ (మనస్సు లేదా హృదయంలోని మనిషి)"గా గుర్తిస్తే, దానినే బౌల్‌లు కానివారు ఆత్మగా, అంతరాత్మగా భావిస్తారు. ప్రతీ మనిషిలోని ఆ మొనేర్ మానుష్‌ని ప్రేమించి పూజించడం, దేవుడ్ని ప్రేమించి పూజించడంగానే అనిపిస్తుంది వారికి. మనిషిలోని ఆ లోపలి మనిషి కోసం అన్వేషణలో ప్రేమలో అన్ని సరిహద్దుల్నీ దాటుకుంటూ సంచరిస్తుంటారు. ఆ లక్ష్య సాధన కోసం వారు కవిత్వాన్ని, నాట్యాన్ని, గానాన్ని ఆశ్రయిస్తారు. వారానికి రెండు సార్లు గ్రామ గ్రామాలు తిరుగుతూ ప్రజలకోసం పాడతారు. వారి దైనందిన జీవితం కోసం అక్కడి ప్రజల నుంచి తమకు కావలసిన కొద్ది పాటిని మాత్రమే స్వీకరిస్తారు. వారి ఆస్తిగా ఉండేవల్లా- ధరించే దుస్తులు, సంగీత వాద్యాలు (ఏక్ తారా, దోతారా, మద్దెల తబలా లాంటి డుగి, మువ్వలు, వేణువు మొదలైనవి), వారి పాటలు, వారి రహస్య అభ్యాసాలూనూ.

భయమన్నది లేనపుడు కేవలం ప్రేమ చాలు, అది వారిని పర్యవేక్షిస్తూ దారి చూపిస్తుందని, సంపూర్ణంగా సమర్పణకావడమే జ్ఞాన రహస్యమని నమ్ముతారు. సాధారణ మానవులుగా ఏ దేశానికి, ఏ మతానికి, ఏ ఆచారాలకు, ఏ కట్టుబాట్లకు దేనికీ చెందరు. నాట్యం గానం వారి మతం. దేవుడు అన్న పదం వాడరు. "అధార్ మానుష్" అని, "మొనేర్ మానుష్" అని మనిషిలోని ఆవశ్యక మనిషిని సంబోధిస్తారు. నీలోను నాలోను అందిరిలోనూ ఆ మొనేర్ మానుష్ ఉన్నాడని బలంగా నమ్ముతారు. అతనికోసం వెతుకులాట వారి సంచారం, సంగీతం, నాట్యం, వారి బోధన అంతా పాట రూపంలో వారి కవిత్వమే. అయితే అదేదీ తెచ్చి పెట్టుకున్నది కాదు. కావాలని చేసేదీ కాదు. వారి హృదయం పాడుతుంది గనక వారు పాడతారు. కవిత్వం వారి పాటలో నీడలా వారి వెన్నంటి వస్తుంది. ఎవరినీ మార్చేందుకు ప్రయత్నించరు, వారిని వినేవారికి ఉపశమనం కలిగించడానికి, ఆలోచన రేకెత్తించడానికి మాత్రం వారి పాటలు ప్రయత్నిస్తాయి.



హిందూ, తాంత్రిక బౌద్ధం, సూఫీతత్వంలోని, వారికి అనుకూలమైనవి మాత్రమే బౌల్‌లు వాడుకున్నారు. రవీంద్రుడు వారి గురించి చెప్పే వరకూ, ఈ బౌల్‌లకు అంత గుర్తింపు లేదు. వారిని బెంగాల్ సమాజం దేశదిమ్మరులుగానో, ఇంటింటికీ తిరిగే యాచకులుగానో ఎక్కువగా చూసింది. పశ్చిమ బెంగాల్‌లో వీరిని బౌల్ లని, బంగ్లాదేశ్‌లో ఫకీర్‌లని అంటారు. రవీంద్రుని యవ్వన దశలోనే, బౌల్‌ల రారాజుగా కీర్తించబడ్డ లాలన్ ఫకీర్ (1774-1890) ప్రభావం అతని మీద పడింది. రవీంద్రుని పాటల్లో, రవీంద్ర సంగీతం మీద ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. అతని చాలావరకు నాటకాల్లో బౌల్ పాత్ర ఉంది. అలాగే రవీంద్రుని మార్మిక కవిత్వాల మీద కూడా బౌల్ ప్రభావం ఉంది. రవీంద్రుని మార్మిక కవిత్వానికి ఒక విధంగా మూలం వారు. 19-20 శతాబ్దాలలో అనేకమంది కవులు, నాటకకర్తలు, పాటల రచయితల మీద ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. చూసింది స్పష్టంగా చెప్పగలగడం, మనశ్చిత్రాలు రూపకాలు దైనందిన విషయాల నుంచి, జీవిత నది నుంచి, ప్రాపంచిక విపణుల నుంచి, శిథిలమవుతున్న శరీర గృహం నుంచి సేకరించడం బౌల్‌ల పాటల్లో కనిపిస్తుంది. లాలన్ స్థిరపడ్డ ఖుస్తియా ప్రాంతానికి, రవీంద్రుని వంశంవారు జమిందారులు. రవీంద్రుడు ఆ ప్రాంతానికి తరచు వచ్చి వెళ్లే వారు. లాలన్‌తో అక్కడ జరిగిన పరిచయం, రవీంద్రునికి అన్ని విధాలా మేలు చేసింది. బౌల్‌లకు కూడా.

భుజాల దగ్గరనుంచి మోకాలువరకూ కప్పే పొడవాటి కాషాయ లేదా తెలుపు లేదా రంగురంగుల దుస్తులు, తల మీద తలపాగాలతో ఇప్పటికీ బౌల్‌లు చిన్న గుడిసెలలోనే ఉంటారు. ఒక్కోమారు మరో గ్రామంలోని ఇతర బౌల్ సాధకుల్ని కలుసుకుందుకు కూడా వెళతారు. బౌల్‌లు నివాసం ఉండే ఆశ్రమాన్ని ఆఖ్రా అంటారు. అందులో స్త్రీ పురుషులంతా కలిసి జీవిస్తారు. ఒకరినొకరు ఆధ్యాత్మిక భాగస్వాములుగా భావిస్తారు. నిజానికి ఈ ఆఖ్రాలు సాధకులు సాధకురాండ్రు, ఎక్కడెక్కడి నుంచో వచ్చిన సాధువులు వగైరాలంతా కలుసుకునే చోటు. మహాకవి జయదేవుడు జన్మించిన ప్రాంతం కెందులిలో సంవత్సరానికొక సారి మకర సంక్రాంతి రోజు నుండి, ఒక నెలపాటు బౌల్‌లంతా కలుసుకుని తమ అనుభవాలను ఆధ్యాత్మిక బోధనలను పంచుకుంటూ పాడుతూ నర్తిస్తూ గడుపుతారు.

అందరికీ పరిచయమై దేశమంతా పర్యటించిన మొదటి ప్రఖ్యాత బౌల్ లాంటి గాయకుడు 16వ శతాబ్దపు చైతన్య మహాప్రభువు (1486-1533). అతని ప్రభావం ఆ తరువాత తరాల బౌల్ కవులు, గాయకుల మీద అమితంగా ఉంది. 16వ శతాబ్దం నుండి బౌల సంప్రదాయ మూలాలున్నా, 18వ శతాబ్దం వరకూ చరిత్రకారులు దానిని తప్పకుండా గుర్తించతగ్గ ప్రక్రియగా అంగీకరించలేదు. పశ్చిమ బెంగాల్ బీర్ భూం నుండి మొదలై, త్రిపుర, ఇప్పటి బంగ్లాదేశ్, బీహార్, ఒడిస్సా లవరకూ ఇది ప్రాకింది. బౌల్ సంప్రదాయం బెంగాల్ ప్రాంతపు అంతర్గత భాగం, ఆ ప్రాంతపు గాలి మట్టి, అక్కడి ప్రజల చిత్తం రక్తం.

బౌల్‌లలో చాలామంది కవులు. 116 ఏళ్లు జీవించిన లాలన్ ఫకీర్‌గా పేరు పొందిన బౌల్ వారి ప్రప్రథమ ప్రముఖ కవి, అవిధేయుడు, ఋషి, మార్మికుడు. బౌల్ రాజుల్లో రారాజుగా లాలన్ ఫకీర్‌ని అన్ని కాలాల్లోనూ అందరూ అంగీకరిస్తారు. 5000కు పైబడ్డ అతని పాటలున్నాయి. అవి అన్నీ లాలన్ గీతాలుగా ప్రసిద్ధి చెందాయి. ఎక్కువ పాటలు మౌఖికంగా ఉండిపోవడం వల్ల అతనివిగా మిగిలినవి కొన్ని వందలు మాత్రమే దొరుకుతున్నాయి. లాలన్ ఫకీర్ జీవితం, తత్వాన్ని అర్థం చేసుకుందుకు అనేక పరిశోధనలు జరిగాయి. సాహిత్యంలోను, చలనచిత్రంలోను, టీవీ, నాటకాలలోను అతనిని చిత్రించారు. ప్రఖ్యాత కవి రచయిత సునిల్ గంగోపాధ్యాయ్ రాసిన అతని జీవిత చరిత్ర సంబంధమైన నవల 'మొనేర్ మానుష్'ను అదే పేరుతో ప్రఖ్యాత దర్శకుడు గౌతం ఘోష్ సినిమాగా తీశారు. గోవాలో జరిగిన, 2010 అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో అది ఉత్తమ చిత్రంగా బహుమతి పొందింది. భారతదేశపు బెంగాల్‌లో పుట్టి, బంగ్లాదేశ్ బెంగాలులో కన్నుమూసారు లాలన్. నజ్రూల్ ఇస్లాంకు కూడా లాలన్ అంటే రవీంద్రుడంత ఆరాధనే.

బౌల్ కవితల సారాంశం అంతా హిందూ, వైష్ణవ, ఇస్లాం, సూఫీ, బౌద్ధాల సంగమం. వారి పాటలు అన్ని మతాలూ ఒకటేనని, సర్వమానవ సౌభ్రాతృత్వంతో ఉండాలని, లింగభేదం ఎందుకని కోరుకునేవే. అగాధమైన, సంపన్నమైన, పూర్ణ విముక్తిపొందిన సముద్రంలో, నదులన్నీ కలుసుకున్నట్టు ఉండాలన్నది వారి కోరిక. ధ్యానంలోలా తమనుతాము కోల్పోవడం కాక, ప్రాపంచిక నియమాల నుండి మనస్సుకు సంపూర్ణ స్వేచ్ఛనివ్వడం వారు కోరుకునేది. వారిని నడిపించేది మేధస్సు కాదు, మనస్సు హృదయం. దైవిక శక్తి ప్రసాదించిన కానుక మనమని, శరీరం ఒక దేవాలయమని, సంగీతం ఆ శక్తిని చేరేందుకు మార్గమని వారి విశ్వాసం. వారి గీతాలు మార్మికత్వంతో గాఢంగా పెనవేసుకుని ఉంటాయి. వారి ముఖ్యమైన పాటల తత్వం "దేహ తత్వం", శరీరపు అశరీరతత్వం. మానవులలో దైవత్వాన్ని ఆశిస్తారు.

సమకాలికుల్లో బౌల్ సామ్రాట్‌గా గుర్తించబడ్డ పూర్ణ దాస్ బౌల్ (1933-)కు తండ్రి అయిన నబాని (గోసియ) దాస్ "ఖ్యప్ప" (?-1969) అతని కాలంలో అంతే గొప్పగా కీర్తించబడ్డారు. అతనికి రవీంద్రుడే ఖ్యప్ప (సత్ చిత్ ఆనంద) బిరుదును ప్రధానం చేయడమే కాక, అతనిని శాంతినికేతన్‌లో బౌల్ గురువుగా నియమించారు. "ఆకాశానికి అద్దం" అని కూడా రవీంద్రుడు అతనిని సంబోధించారు. నబాని ఆ సమయంలో ఇందిరాగాంధీకి సైతం బౌల్ గురించి బోధించారు. జవహర్లాల్ నెహ్రూ అనేక సమావేశాల్లో ఇతని బౌల్ గానం ఉండేది. ఆయన కుమారుడు పూర్ణదాస్ 1965లో అమెరికాలో బౌల్ పాటలు ప్రచారం చేసి అక్కడ నోబెల్ బహుమతి గ్రహీత బాబ్ డిలాన్, జాన్ బీజ్, పాల్ రొబ్సన్, మైక్ జగ్గర్, టీనా టర్నర్, బాం మర్లే, గోర్డన్ లైట్ ఫుట్, మహలియ జాక్సన్ లాంటి అమెరికన్ ఉద్దండ సంగీతకారులతో కలిసి ప్రదర్శనలిచ్చారు. న్యూయార్క్ టైమ్స్ పత్రిక అతనిని భారతదేశపు బాబ్ డిలాన్‌గా అభివర్ణించింది. అమెరికా ప్రఖ్యాత కవి, రచయిత అలన్ గిన్స్‌బెర్గ్ (1926-1997), లాలన్ ఫకీర్ మీద ఒక కవిత కూడా రాసారు. నబానీ బౌల్ మరణశయ్య మీద ఉండగా గిన్స్‌బెర్గ్ అతన్ని కలిసారు. నబానీ, గిన్స్‌బెర్గ్‌ని బౌల్‌గానే పరిచయస్తుడు అన్నారు. గిన్స్‌బర్గ్ అమెరికన్ బౌల్ అని బాబ్ డిలాన్ ఒక సందర్భంలో చెప్పుకున్నాడు. నబానీ దాస్ బౌల్, రవీంద్రనాథ్‌ని రవి బౌల్ అని పిలిచేవారు..

నబానీ దాస్‌కు సమర్పణగా అలన్ గిన్స్‌బెర్గ్ రాసిన కవితలో కొంత భాగం ఇది: "ఓ బెంగాల్ బౌల్, నేను అందరి కోసం పాడతాను, నీలపు దనుబె నాకు యమున, హడ్సన్ నా బృందావనం, నన్ను కలకత్తా, టోరంటో, లండన్‌లో చూడండి, ఓ బెంగాల్ బౌల్, నా పిలుపు వినండి, అదే మనిషి అనేక పేర్లు, అదే ఆటగాడు, అనేక ఆటలు, జీవితంలో గెలవడానికి ప్రేమ ఒక గారడీ... ఓ బెంగాల్ బౌల్ నా పిలుపు వినండి".

లాలన్ ఫకీర్ తరువాత వచ్చిన ముందుతరం ముఖ్యమైన బౌల్‌లు: మొనేర్ మానుష్ ప్రయోగాన్ని ముందుగా తన పాటలలో వాడిన గగన్ హర్కర (1845-1910), కంగాల్ హరినాథ్ (1833-1896), కవియల్ బిజయ్ సర్కార్ (1903-1985), నబానీ దాస్ బౌల్ (?-1969).

"నా ఒక బండికి రెండు చక్రాలున్నాయి.
దాని మీద మూడంతస్తుల ఇల్లు
ఆకాశ పాతాళాలన్నీ వెతుకుతావు.
దేహంలో ఉన్నా తెలుసుకోవు
మునిగి చూడు లీలామయుని
ముఖరూపం" - అంటారు బౌల్‌లు, రెండు కాళ్లమీద శరీరం అందులోని మొనేర్ మానుష్ నుద్దేశించి.

* * *

బౌల్ అన్నది సంస్కృత పదం "వతుల" నుండి వచ్చిందని, అంటే వెర్రి అని, లేదా "వ్యాకుల" వ్యాకులుడు, లేదా గాలి మూలంగా సోకే వ్యాధి అని కూడా చెబుతారు. మనందరిలోను నివసిస్తున్న సర్వోన్నతునికోసం వెర్రెక్కినవాళ్లుగా బౌల్‌లు తమ గురించి తామే చెప్పుకుంటారు. వారి జాడలేవీ మిగల్చడానికి వారు ఇష్టపడరు. అంచాత చరిత్రలో వారి పుట్టుపూర్వోత్తరాలు అంతగా తెలియక, వారి పాటల మూలంగా వారి చరిత్రను పండితులు తయారు చేసే ప్రయత్నాలు చేసారు. వారిది మౌఖిక సంప్రదాయం. లిఖిత సంప్రదాయం కాకపోవడంతో, ఆనోటా ఈనోటా విన్నవీ గుర్తున్నవే వారి సాహిత్యం. నిజానికి చాలామంది అభ్యాసకులు చదువురానివారే. వారి జీవన విధానం, భాష, సంగీతం, వారిలా ప్రవర్తించే ఇతర జాతుల మూలంగా ఏ కొద్ది ఆచూకీలు దొరికినా దానితో వారి చరిత్రను అల్లే ప్రయాస కొనసాగుతోంది.

బౌల్‌ల ముఖ్యమైన ఆధ్యాత్మిక ప్రాతిపదిక శరీరం. దానిని విశ్వానికి సూక్ష్మ జగత్తుగా భావించి, జగత్తులో ఉన్నదంతా మనిషిలో ఉందనుకోవడం. అంచాత మొనేర్ మానుష్ మీద అత్యంత గౌరవం వారికి. స్వరంతో సంగీతం, సంగీతంతో సమాధి, సమాధితో నిర్వాణం కలుగుతాయని, అంచాత ప్రేమ పూర్వక సంగీతంతో నిర్వాణ సమాధి సాధ్యమవుతుందని వారి నమ్మకం. బౌల్ సంగీత విధానం, బెంగాల్‌కి ప్రత్యేకమైనదైనా ప్రపంచ సంగీత చరిత్రలో దానికంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పొందింది. బౌల్ సంప్రదాయాన్ని యునెస్కో గుర్తించి "ఉత్కృష్ట మానవజాతి వారసత్వ మౌఖిక సంపద" జాబితాలో చేర్చింది.

బౌల్‌లు కవులు, స్వరకర్తలు, గాయకులు, నర్తకులు, నటులు అన్నీ ఒకరే అయి వినోదపరుస్తారు. వారి పాటలు, విరామాలు, హావభావాలు, అంగవిన్యాసాలతో ప్రేమ పారవశ్య సందేశాన్ని దూరదూర తీరాలకు చేరుస్తారు. వారి పాటల్లోని భాష జానపద శైలిలో ఉన్నా, అవి అందరికీ అర్థమయే రీతిలో సరళంగా, సహజంగా, భావగర్భితంగా, అనుభవింపదగినవిగా ఉండడం విశేషం.

బౌల్‌లు సహజంగా, స్వాభావికంగా, తమ పాటల్లో నాట్యంలో లీనమయేవారు. అంటే ఏవిధమైన పథకం ప్రణాళిక పరికల్పన విచారణ లేదా గుర్తింపు కోసం ప్రయాస పడకుండా సాగించే స్వాభావికమైన జీవన విధానం వారిది. బౌల్‌కు, మొనేర్ మానుష్ అంటే- పరిపూర్ణ స్వరాగంతో ఉన్న ఒక దైవిక యంత్ర వాద్యం. జీవిత సంగీతంలో ఆ మనిషి అనంత సత్యానికి ఒక అభివ్యక్తిని స్తుంటాడు. మనకు గ్రహింపుకురాని మనలో ఉన్న ఆ సత్యాన్వేషణ, బౌల్ పాటల్లో ఇలా బయట పడుతుంటుంది:

"నావను నేను, సముద్రానివి నావికుడవు కూడా నువ్వు
తీరానికి నువ్వు చేర్చకపోయినా, నన్ను ఇందులో మునగనిచ్చినా
మూర్ఖంగా నేను ఎందుకు భయపడాలి
నీతో నేను కోల్పోవడం కంటే, తీరానికి చేరడం అంత గొప్ప బహుమతా?
వాళ్లు చెప్పినట్టు, నువ్వు కేవలం స్వర్గమే అయితే, సముద్రం ఏమిటి?
అది ఉప్పొంగనీ, దాని అలలు నన్ను ఎగరేయనీ, నాకు సంతోషమే
నీ రూపం ఏదైనా ఏమైనా, నీలోనే నేను నివసిస్తాను
నువ్వు కోరుకున్నట్టు నన్ను కాపాడు లేదా హతమార్చు,
ఇతరుల చేతిలో మాత్రం నన్ను వదలొద్దు.

- ఒక అనామకుని బౌల్ పాటకు రవీంద్రుని అనువాదం

కామం నదిలో ఎన్నడూ మునగొద్దు, ఒడ్డుకు చేరుకోలేవు
అవధులులేని నదిలో తుఫాన్లు రేగుతుంటాయి

- ద్విజ కైలాష్ చంద్ర

మూగవాడు చెవిటివానికోసం పాడుతున్నట్టు
చేతులు లేనివాడు వీణ వాయిస్తున్నాడు
కుంటివాడు నాట్యానికి నాయకత్వం వహిస్తున్నాడు
గుడ్డివాడు ఆ ప్రదర్శనలో లీనమై చూస్తున్నాడు
ఎంత వింతైనదీ ప్రపంచం

- గౌర్ చాంద్

నిరర్థకంగా..
నాకు తెలియని మనిషీ నేనూ కలిసి నివసిస్తున్నాము
మా మధ్య లక్షల మైళ్ల దూరం

నా కళ్లకు ప్రాపంచిక కలల గంతలున్నాయి
అతనిని గుర్తించలేను, అర్థం చేసుకోలేను

- లాలన్

మార్మికవాదంలో బెంగాలీ బౌల్ గీతాలు - బౌద్ధం, వైష్ణవం, ఫారసీ సూఫీ తత్వాల సమన్వయంతో కూడినవి. రవీంద్రుడ్ని ఎక్కువగా ప్రభావితం చేసినవి. "ప్రపంచం ఏమీలేదు, మన వెనక వదిలేయాల్సింది" అన్నది ఆ గీతాలన్నింటిలో అంతర్లీనంగా సాగే ఇతివృత్తం. "గడ్డి మీద మంచులా శరీరం క్షణభంగురం" అన్నది అందులోని ముఖ్య సందేశం. సంఖ్యాపరంగా బౌల్‌ను అనుసరించిన వారు తక్కువే అయినా, బెంగాలీ సాహిత్యం సంస్కృతి మీద వారి ప్రభావం చాలా ఎక్కువ.

■ ముకుంద రామారావు
99083 47232

> సూఫీలలాగ బెంగాల్‌లోని 'బౌల్స్' మనిషిలోని ఆవశ్యక మనిషిని వెదికే ప్రయత్నంలో ఉంటారు. ఆ ఆవశ్యక మనిషిని వారు 'మొనేర్ మానుష్ (మనస్సు లేదా హృదయంలోని మనిషి)'గా గుర్తిస్తారు. ప్రతీ మనిషిలోని ఆ మొనేర్ మానుష్‌ని ప్రేమించి పూజించడం, దేవుడ్ని ప్రేమించి పూజించడంగానే అనిపిస్తుంది వారికి. మనిషిలోని ఆ లోపలి మనిషి కోసం అన్వేషణలో ప్రేమలో అన్ని సరిహద్దుల్నీ దాటుకుంటూ సంచరిస్తుంటారు.



స్టీఫెన్ హాకింగ్

అతడు నిద్రపోయాడు
ఆకాశం నివ్వెరపోయింది
అతడు ఎక్కడో మేల్కొనే ఉంటాడు
అది ఖచ్చితంగా అంతరిక్షమే అయి ఉంటుంది
అన్నీ నిర్ధారించుకున్నాక అతడు ఇక
భూగోళ రహస్యాల్ని కూడా
ఖగోళానికి చెబుతూ ఉండే ఉంటాడు
అక్కడి నక్షత్రాల ద్వారా ఆ సంగతి
ఇక్కడి పువ్వులకు
ఇప్పటికే తెలిసిపోయి ఉంటుంది

■ భగవంతం

తూర్పు గౌటా

అసలు ఎవరికీ వంచన చేతకాదు. సాంస్కృతిక కాలుష్యాలు లేవు. సజీవులే సజీవులు.

అసలు ఎవరికీ చికాకు రాదు. నీ లోపల ఖాళీ అద్దం. తిరగదు. గెంతదు. అసలు ఎవరికీ ఊపిరే అఖ్ఖర్లేదు. పువ్వులు చూడవు. గాలీ చూడదు. సమాధీ చూడదు.

తొడుగు. తొడుగు. సరికొత్త జననేంద్రియాల్ని. తొడుగు. తొడుగు. అపూర్వ అంగాల్ని. వాటితో సలాం పెట్టు. వాటికీ సలాం పెట్టు. మలాం పెట్టు పదాలకి. మలాం పెట్టు రాజ్యాలకి. పూజ్య రాజ్యాశ్రువులకీ మలాం అద్దు. హత్తుకో. ఒత్తుకో. ఎత్తుకో. అద్దుపద్దులేని సౌందర్య రాజ్యాధికారాలకీ సలాం పెట్టు. మొక్కు. ఇంకా ఇంకా మోకరిల్లాలని మొక్కు. రక్తశిలాఫలకాలతో కీర్తించు.

చరిత్ర భయపడుతోంది. ఇళ్లు భయపడతాయి. పుస్తకాలు భయపడతాయి. ఆటస్థలాలు భయపడతాయి. ఆసుపత్రులు భయపడతాయి. ప్రేమలు భయపడతాయి. యుద్ధ క్షిపణులు భయపడతాయి. అరచేతులు భయపడతాయి. శ్మశానాలు భయపడతాయి. తుపాకులు భయపడతాయి. చిరునవ్వులు భయపడతాయి. కన్నీళ్ళు భయపడతాయి. మతాలు భయపడతాయి. ఆటబొమ్మలు భయపడతాయి.

ఎప్పటికి శాంతిస్తావు సిరియా? ఎప్పటికి శాంతిస్తాయి నీ ఆయుధాలు?

■ ఎం. ఎస్. నాయుడు



యానాంలో ప్రపంచ కవితా దినోత్సవం

కవిసంధ్య, ఎస్.ఆర్.కె. ఆర్ట్స్ కళాశాల సంయుక్త నిర్వహణలో మార్చి 21న ప్రపంచ కవితా దినోత్సవం జరుగుతుంది. ఈ సందర్భంగా ప్రపంచ కవుల చిత్రపటాలు, చేతి రాతల ప్రదర్శన, ఆధునిక కవిత్వంపై సదస్సు, కావ్యసంపుటాల ఆవిష్కరణ, కవితల పోటీ బహుమతి ప్రదానం ఉంటాయి. కార్యక్రమంలో మల్లాడి కృష్ణారావు, జయరాజ్ డానియల్, వాడ్రేవు సుందర్రావు, ఖాదర్ మొహియుద్దీన్, జి.లక్ష్మీనరసయ్య, రామతీర్థ, ప్రసాదమూర్తి, యాకూబ్ తదితరులు పాల్గొంటారు.

- శిఖామణి

మొజాయిక్ వార్షికోత్సవ సభలు


విశాఖపట్నంలో మొజాయిక్ సాహిత్య సంస్థ పదిహేనో వార్షికోత్సవ సభలు మార్చి 24, 25 తేదీల్లో విశాఖ పౌరగ్రంథాలయంలో జరుగుతాయి. ఈ సందర్భంగా ప్రారంభిస్తున్న మొజాయిక్ సాహిత్య పురస్కారాన్ని సయ్యద్ సలీం అందుకుంటారు. ఈ సందర్భంగా అమెరికా నుంచి నిర్వహింపబడుతూ తిరిగి 2018 ఉగాది నుంచి వస్తున్న 'సారంగ' అంతర్జాల పత్రిక, తూమాటి సంజీవరావు సంపాదకత్వంలో 'తెలుగు సాహిత్యంలో దేశభక్తి' వ్యాససంకలనం ఆవిష్కరణ జరుగుతాయి.

- రామతీర్థ

రెండు పుస్తకాల ఆవిష్కరణ

శ్రీమానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో వి. గీతానాగరాణి పరిశోధన గ్రంథం 'ఆధునిక తెలుగు సాహిత్యంలో ముస్లిం జీవన చిత్రణ', సలీం నవల 'అనూహ్యపెళ్ళి' ఆవిష్కరణ సభ మార్చి 30 సా.5.30గం.లకు శ్రీకళాదీక్షితులు కళావేదిక (శ్రీత్యాగరాయగానసభ) హైదరాబాద్‌లో జరుగుతుంది. నవ్య వారపత్రిక సంపాదకులు జగన్నాథశర్మ అధ్యక్షత వహిస్తారు. ఎస్వీ సత్యనారాయణ, నిడమర్తి నిర్మలాదేవి, వాడ్రేవు చినవీరభద్రుడు, యాకూబ్, కళా జనార్దనమూర్తి పాల్గొంటారు.

- రఘుశ్రీ



నాసిక్‌లో పుట్టిన గో-దా(వ)రి

నది తాను పుట్టినప్పటినుంచీ చూస్తున్నది
ఒడ్డున మట్టిలో పొర్లాడుతున్న మనిషిని
కందమూలాలు ఏరుకోవడం చూసింది
కండలు కరిగించి రాళ్లను పనిముట్లను చేయడం చూసింది
నిప్పు పుట్టించడం చూసింది
వేట చూసింది పాట చూసింది ఆట చూసింది
మనిషి నెత్తురు చెమటయ్యా నెత్తురు గానూ
మట్టిని తడపడం చూసింది
ఎత్తి పోతలతో, మోటలతో, కాల్వలతో
ప్రాజెక్టులతో తనను మళ్లించి
మనిషి పంటలు పండించిన వైనం చూసింది
రైతు మట్టిని ఎన్ని నీళ్లతో, ఎంత మంచుతో
ఎంత సూర్యరశ్మితో, ఎంత గాలితో
మహిమాన్వితం చేసాడో
అంతకన్నా తన రక్త మాంసాలతో
అద్భుత ప్రపంచాన్ని సృష్టించడం చూసింది
రైతు జీవితంలోకి మార్కెట్
ఎప్పుడు ప్రవేశించిందో గానీ
అదృశ్య శక్తుల స్వార్థంకై
అడ్తేదార్ నుంచి దలాల్‌దాకా
అందరూ బాగుపడడం చూసింది తప్ప
రైతు ఎప్పుడూ రుణగ్రస్తుడే
అందరూ రైతుకు రుణపడి ఉన్నామనేవాళ్లే
రైతుకొక్కనికే రుణమాఫీ ఉండదు
రైతుకోసం గిట్టుబాటు ధరలుండవు గిడ్డంగులుండవు
మాల్యాల మోడీల సేవలో తరించే
బ్యాంకులు రైతుల పాలిట వట్టిపోయిన ఆవులు
అమ్మబోతే అడవి కొనబోతే కొరివి
తన శ్రమ విలువ తనకొక్కనికే తెలియదు!
రైతాంగ పోరాటాలు కావచ్చు
రైతుల ఆత్మహత్యలు కావచ్చు
దేశంలో నదులెక్కువ ప్రవహించాయో
రైతుల కన్నీళ్లూ నెత్తురూ ఎక్కువ ప్రవహించిందో
ఆశ్చర్యపోయింది నది
ఆగ్రహించింది నది
అడవిని తోడుతీసుకొని
దిశ మళ్లించి
రాజధానికి
తరలివచ్చింది
నెర్రెలు వారిన నేలలో
నెర్రెలు వారిన పాదాల నెత్తుర్లు
నెత్తుల మీద టోపీలయినవి
నడిచే ఎర్ర జెండాలైనవి
నగరం కురిపించిన పూల జల్లులయినవి
రైతు, అడవి, నది కలిసి మార్చ్ చేసిన ఐక్యతకు
ఆధిపత్యం మోకరిల్లక తప్పలేదు

■ వరవరరావు

నేడు కోల్‌కతాకు కేసీఆర్

» బెంగాల్ సీఎం మమతతో సమావేశం

» దేశ రాజకీయాలు, కొత్త ఫ్రంట్‌పై చర్చ

హైదరాబాద్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): దేశ రాజకీయాలు, వ్యవస్థలో గుణాత్మక మార్పు కోసం జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానన్న సీఎం కేసీఆర్ సోమవారం కోల్‌కతా వెళ్లనున్నారు. కాంగ్రెసేతర, బీజేపీయేతర ఫ్రంట్ ఏర్పాటుపై తొలుత పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీతో సమావేశం కావాలని కేసీఆర్ నిర్ణయించారు. సోమవారం అసెంబ్లీ సమావేశానికి హాజరైన అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక విమానంలో హైదరాబాద్ నుంచి కోల్‌కతా వెళ్తారు. మమతతో రెండున్నర గంటల పాటు సమావేశమయ్యేలా షెడ్యూల్ ఖరారైంది. దేశ రాజకీయాల్లో ప్రస్తుత పరిణామాలు, మారుతున్న సమీకరణాలు తదితర అంశాలపై ఆమెతో చర్చించాలని భావిస్తున్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులు తదితర అంశాలను మమతకు వివరించనున్నారు. కోల్‌కతాలో సీఎం కేసీఆర్ కాళీమాత దర్శనం కూడా చేసుకుంటారు. ఫ్రంట్ ఏర్పాటు చేస్తానన్న ప్రకటన తర్వాత కేసీఆర్ నిర్వహించే తొలి సమావేశం కావడంతో రాష్ట్ర, దేశ రాజకీయాల్లో ప్రాధాన్యతను సంతరించుకుంది. చర్చల్లో కేసీఆర్‌తో పాటు ఎంపీలు కే కేశవరావు, కవిత, పలువురు సీనియర్ల బృందం పాల్గొంటుంది. చర్చల అనంతరం కేసీఆర్ బృందం రాత్రి 9.50 గంటలకు తిరిగి హైదరాబాద్ చేరుకుంటుంది.

● డప్పు పింఛన్ కోసం ధర్నాలు: వంగపల్లి



రాంనగర్/హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని డప్పు, చెప్పు వృత్తిదారులకు రూ. 2 వేల పింఛన్ అమలు కోసం రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేయాలని నిర్ణయించినట్లు టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 21న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, 23న కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఆదివారం విద్యానగర్‌లోని టీఎస్ ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో డప్పు, చెప్పు వృత్తిదారులకు పెన్షన్ అమలు చేస్తున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించి.. బడ్జెట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. మాదిగలకు ఇచ్చిన హామీ ప్రకారం 3 ఎకరాల భూమి ఇవ్వాలని, ఇల్లు లేని మాదిగలకు డబుల్ బెడ్ రూం నిర్మించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో మాదిగలకు దామాషా ప్రకారం నిధులను పెంచాలని కోరారు. మాదిగ ఉప కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 21, 23న నిర్వహించే ఆందోళన కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వంగపల్లి కోరారు.

● నేడు బీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) రాష్ట్ర కార్యాలయం సోమవారం హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్ సమీపంలోని గోల్కొండ చౌరస్తాలో ప్రారంభంకానుంది. కార్యక్రమానికి గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మేవాని ముఖ్యఅతిథిగా హాజరుకున్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, గద్దర్, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, రిటైర్డ్ ఐఏఎస్ కాకి మాధవరావు, ఎంబీటీ పార్టీ నేత మజీదుల్లాఖాన్, బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ తదితరులు పాల్గొననున్నారు. అనంతరం మధ్యాహ్నం 2గంటలకు సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 'నేటి రాజకీయాలు-వామపక్ష సామాజికశక్తుల కర్తవ్యం' అనే అంశంపై సదస్సు జరగనుంది.

'బీసీ కమిషన్'కు రాజ్యాంగ బద్ధత కల్పించాలి

» లేకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమం చేస్తాం: ఆర్.కృష్ణయ్య



బర్కత్‌పుర/హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధత కల్పించే బిల్లును ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టి ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్‌చేశారు. లేకపోతే జాతీయ స్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఇకనైన నాన్చుడి ధోరణి విడనాడి చిత్తశుద్ధితో బీసీల సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు.

● మహిళా స్టార్టప్‌లకు 'వీ-హబ్' ఆన్‌లైన్ శిక్షణ

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మహిళా స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వీ-హబ్ ద్వారా ఇకపై ఆన్‌లైన్‌లోనూ శిక్షణ లభించనుంది. ఇంటివద్దే ఉంటూ.. వ్యాపారాలు, పరిశ్రమలు నెలకొల్పాలనుకునే మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. వ్యాపార ఆలోచనల్లో అనుమానాలుండే మహిళలు కూడా ఆన్‌లైన్‌లో తమను సంప్రదించి వాటిని నివృత్తి చేసుకోవచ్చని వీ-హబ్ సీఈవో దీప్తి రావుల తెలిపారు.

● జారిపడ్డ మాజీ ఎంపీ మంద జగన్నాథం



సోమాజిగూడ/హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ ఆదివారం నిర్వహించిన పంచాంగ శ్రవణ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వెళ్తుండగా మాజీ ఎంపీ మంద జగన్నాథం ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డారు. ఆయన తలకు స్వల్పంగా దెబ్బ తగిలింది. అక్కడే ఉన్న సిబ్బంది సహాయంతో గాయపడిన మాజీ ఎంపీని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. మంద జగన్నాథానికి స్వల్ప గాయాలే అయ్యాయని.. రెండు రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచించారు.

● పాము కాటుతో హాస్టల్ విద్యార్థి మృతి

కొల్చారం, మార్చి 18: పాముకాటుతో విద్యార్థి మృతి చెందిన సంఘటన కొల్చారం మండలం రంగంపేటలోని ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌లో ఆదివారం చోటు చేసుకుంది. సంగారెడ్డి జిల్లా బ్యాతోల్ తండాకు చెందిన 9వ తరగతి చదువుతున్న అర్జున్ కుమార్(14) మలవిసర్జన కోసం బయటకు రావడంతో పాము కాటేసింది. తోటి విద్యార్థులు హాస్టల్‌లో ఉన్న వాచ్‌మెన్‌కు సమాచారం అందించారు విద్యార్థిని చికిత్స నిమిత్తం నాటు వైద్యం కోసం వేరే గ్రామానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

● శంషాబాద్ విమానం చెన్నైలో దిగింది

పది విమాన సర్వీసులు అలాగే.. వాతావరణ ప్రతికూలతే కారణం

శంషాబాద్, మార్చి 18: అది శంషాబాద్ విమానాశ్రయం.. ఆదివారం ఉదయం ఢిల్లీ నుంచి వచ్చిన ఇండిగో విమానం ఎయిర్‌పోర్టులో దిగకుండా గాల్లోనే చక్కర్లు కొట్టింది. అనంతరం.. చెన్నై వైపు వెళ్లిపోయింది! ఈ విధంగా ల్యాండవ్వాల్సిన ఎన్నో విమాన సర్వీసులను చెన్నై, బెంగళూరుకు మళ్లించారు. కారణం.. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో వాతావరణం అనుకూలించకపోవడమే! ఉదయం 7 గంటల నుంచి 9 గంటల మధ్య అక్కడ విమానాల ల్యాండింగ్‌కు వాతావరణం అనుకూలించలేదు. ఢిల్లీ, మస్కట్, దుబాయ్, కువైట్‌ల నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి రావాల్సిన పది విమాన సర్వీసులను చెన్నై, బెంగుళూరుకు మళ్లించారు. ఉదయం పది గంటల ప్రాంతంలో ఈ విమానాలు మళ్లీ శంషాబాద్‌లో ల్యాండయ్యాయి.

సిద్దిపేటలో వ్యవసాయాధార పరిశ్రమలు

» దుద్దెడ శివార్లలో ఐటీ పార్కు

» వచ్చే ఉగాదికల్లా గోదావరి జలాలు: హరీశ్

సిద్దిపేట అర్బన్, మంథని, మార్చి 18: సిద్దిపేట శివార్లలోని మిట్టపల్లి - మందపల్లి గ్రామాల మధ్య రూ. 300 కోట్లతో వ్యవసాయాధార పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దుద్దెడ గ్రామ శివారులో ఐటీ పార్కును ప్రారంభిస్తామని వెల్లడించారు. పారిశ్రామికంగా సిద్దిపేటను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని, పరిశ్రమలతో నిరుద్యోగ సమస్య పరిష్కృతమవుతుందని పేర్కొన్నారు. వచ్చే ఉగాదిలోగా సిద్దిపేటకు గోదావరి జలాలను తెప్పించి, ఇక్కడి పంటపొలాలను సస్యశ్యామలం చేస్తామన్నారు. ఆదివారం ఆయన జిల్లాలోని సిద్దిపేట, నంగునూరు మండలాల్లో జరిగిన పలు కార్యక్రమాల్లో మాట్లాడారు. భూనిర్వాసితులను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. అనంతరం నంగునూరులో ఉగాది వేడుకల్లో పాల్గొని, ఉగాది పచ్చడి సేవించారు. నంగునూరు నుంచి సిద్దిపేటకు తిరిగి వస్తున్న క్రమంలో.. దారిలో హరిత సైనికుడు బాలమల్లు మొక్కలు నాటుతుండడాన్ని చూసి, మంత్రి ఆగారు. కాసేపు ఆయనతో ముచ్చటించి, తానూ ఒక మొక్కను నాటారు. బాలమల్లును శాలువాతో సత్కరించారు. మంత్రి శనివారం అర్ధరాత్రి పెద్దపల్లి జిల్లా మంథనిలో గోదావరిపై నిర్మిస్తున్న సుందిళ్ల బ్యారేజీ, అన్నారం పంప్‌హౌస్ పనులను పరిశీలించారు. ఇంజనీరింగ్, వర్క్ ఏజెన్సీల ప్రతినిధులతో పనుల ప్రగతిపై సమీక్షించారు. రాత్రి అక్కడే బసచేసి, ఉదయం మరోమారు పనుల తీరును పరిశీలించారు.



హరిత సైనికుడు బాలమల్లును శాలువా కప్పి సత్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు

జూలై, ఆగస్టుల్లో కాళేశ్వరం నీళ్లు

కీలక ఘట్టానికి చేరిన ప్రాజెక్టు పనులు.. అన్నారం బ్యారేజీ గేట్ల బిగింపు ప్రారంభం

» త్వరలోనే పంపుల డ్రై రన్



హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ పనులు కీలక ఘట్టానికి చేరుకున్నాయి. గోదావరి నదిపై నిర్మిస్తున్న ప్రధాన బ్యారేజీల గేట్ల బిగింపు పనులు మొదలయ్యాయి. త్వరలోనే పంపుల డ్రై రన్‌ను నిర్వహించనున్నారు. వచ్చే వర్షాకాలం మొదట్లోనే అంటే.. జూలై, ఆగస్టు మాసాల్లోనే కాళేశ్వరం నీటిని మల్లన్నసాగర్ వరకు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. సుమారు రూ.80 వేల కోట్ల భారీ వ్యయంతో కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టు ద్వారా కొత్తగా 18 లక్షల ఎకరాలకు పైగా సాగునీటిని అందించడంతోపాటు మరో 18 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్టు నుంచి ఈ ఏడాది డిసెంబరు నాటికి నీటిని తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. నిధుల కొరత లేకుండా బడ్జెట్‌లో భారీ కేటాయింపులు చేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ ఒక్క ప్రాజెక్టు నిర్మాణానికే సుమారు రూ.11 వేల కోట్ల వ్యయం చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ ఇదే స్థాయిలో ఖర్చు చేయాలని భావిస్తున్నారు. అందుకోసం వివిధ బ్యాంకుల నుంచి సుమారు రూ.20 వేల కోట్ల రుణం కూడా తీసుకుంటున్నారు. ఇంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు నుంచి వీలైనంత త్వరగా నీటిని పంపింగ్ చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది. నీటిని ఎత్తిపోయడానికి వీలుగా ప్రధాన గోదావరి నదిపై మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను నిర్మిస్తున్న విషయం తెలిసిందే. అన్నారం బ్యారేజీకి 66 గేట్లు, మేడిగడ్డలో 86, సుందిళ్ల బ్యారేజీకి 74 గేట్లను బిగించాల్సి ఉండగా.. అన్నారం బ్యారేజీకి శనివారం తొలి గేట్‌ను బిగించారు.

ఖరీఫ్ లక్ష్యంగా మంత్రి హరీశ్ చర్యలు..

వచ్చే ఖరీఫ్ సీజన్‌లోనే కాళేశ్వరం ద్వారా సాగునీటిని అందించాలని మంత్రి హరీశ్ భావిస్తున్నారు. ఈ మేరకు సంబంధిత ఇంజనీర్లకు ఆదేశాలను జారీ చేసినట్లు సమాచారం. ప్రాజెక్టు నిర్మాణ పనుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న మంత్రి.. పనులు పూర్తి కావడానికి వీలుగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. కొండపోచమ్మ నుంచి నిజాంసాగర్ వైపు, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలకు వెళ్లే ప్రధాన కాల్వ నిర్మాణానికి కూడా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు భూసేకరణ ప్రక్రియను కూడా వేగంగా చేస్తున్నారు. ఇప్పటికే భూసేకరణ నోటిఫికేషన్‌ను జారీ చేసిన ప్రభుత్వం.. త్వరలోనే ఈ కాల్వల తవ్వకానికి సంబంధించి టెండర్లను ఆహ్వానించనుంది. ఈ కాల్వలు పూర్తయితే పొలాలకు నీటిని తీసుకెళ్లడానికి అవకాశం ఉంది.

ప్రత్యేక విద్యుత్తు లైన్లు..

ప్రాజెక్టుకు సంబంధించిన బ్యారేజీలు, పంప్‌హౌజ్ పనుల్లో 80 శాతం సిమెంటు కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. పంప్‌హౌజ్‌లకు అవసరమైన యంత్రాలు మరో పది రోజుల్లో జపాన్, స్విట్జర్లాండ్, ఆస్ట్రియా నుంచి దిగుమతి కానున్నాయి. అన్నారం-కన్నేపల్లి మధ్య గ్రావిటీ కెనాల్ పనులనూ 70 శాతం పూర్తి చేశారు. మరోవైపు ప్రాజెక్టుకు విద్యుత్తు సరఫరాకు సంబంధించిన సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులు కూడా వేగవంతమయ్యాయి. ప్రత్యేక విద్యుత్తు లైన్ల ఏర్పాట్లు జరుగుతున్నాయి. జైపూర్‌లోని సింగరేణికి చెందిన పవర్ ప్లాంట్ ద్వారానే పంప్‌హౌజ్‌లకు వేర్వేరుగా విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా గోలివాడ నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కన్నేపల్లి దగ్గర నిర్మిస్తున్న పంప్‌హౌజ్ వరకు 80 కిలోమీటర్ల మేరకు విద్యుత్తు లైన్ వేస్తున్నారు. 40 మెగావాట్ల సామర్థ్యంతో 11 మోటార్లకుగాను 440 మెగావాట్ల విద్యుత్తు అవసరం ఉంది. ఇందుకు సంబంధించి 220/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయి. విద్యుత్తు లైన్, టవర్లు, అటవీమార్గంలో 9 కిలోమీటర్ల మేరకు విద్యుత్ లైను వంటి పనులకు రూ.180 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పనులు ఈ నెలాఖరుకల్లా పూర్తి కానున్నాయి. ఇక సుందిళ్ల పంప్‌హౌజ్ కోసం జైపూర్ పవర్ ప్లాంట్ నుంచి 6కిలోమీటర్ల మేరకు విద్యుత్తు లైను పనులు జరుగుతున్నాయి. 40 మెగావాట్ల సామర్థ్యంతో 9 మోటార్లకుగాను 360 మెగావాట్ల విద్యుత్తు అవసరానికిగాను 400/220/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం జరుగుతోంది. దీని పనులు కూడా 60 శాతం పూర్తయ్యాయి. 400 కేవీ విద్యుత్తు డబుల్ సర్క్యూట్ లైన్ పనులను 75 శాతం పూర్తి చేశారు. కాగా అన్నారం పంప్‌హౌజ్ కోసం 40 మెగావాట్ల సామర్థ్యంతో 8 మోటార్లకుగాను 320 మెగావాట్ల విద్యుత్తు అవసరం కాగా.. 220/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను 80 శాతం పూర్తి చేశారు. విద్యుత్తు లైను పనులు 45 శాతం, టవర్ల ఎరక్షన్ పనులు 10 శాతం పూర్తయ్యాయి. మేడిగడ్డ బ్యారేజీ వద్ద 365 రోజులూ నీరు అందుబాటులో ఉంటున్నందున.. ఎప్పుడు, ఎంత పని జరిగితే.. అంత మేర నీటిని తరలించి చెరువులు నింపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకోసం వేర్వేరు జనరేషన్ స్టేషన్ల ద్వారా విద్యుత్తు అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తర భారతదేశంతో దక్షిణాది రాష్ట్రాల విద్యుత్తు గ్రిడ్‌ను అనుసంధానం చేసే ప్రక్రియ వేగవంతంగా అమలవుతోంది. ప్రాజెక్టు పూర్తయ్యే నాటికి గ్రిడ్ అనుసంధానం కూడా పూర్తవుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

పూర్తవుతున్న లింకు-2

కాళేశ్వరం ప్రాజెక్టు లింక్-2 పనులు ఇప్పటికే పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్ వరకు, అక్కడి నుంచి కొండపోచమ్మ రిజర్వాయర్‌లోకి నీటిని చేర్చి, మళ్లీ అక్కడి నుంచి నిజాంసాగర్ వైపు, ఇటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు తరలించడానికి వీలుగా పనులు జరుగుతున్నాయి. ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్ వరకు గల పంప్‌హౌజ్‌లు, టన్నెళ్లు, ఇతర పనులు చివరి దశలో ఉన్నాయి. ప్యాకేజీ-8లోని పంప్‌హౌజ్ డ్రై రన్‌ను మరో 20 రోజుల్లో నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. జూన్‌లో ట్రయల్‌రన్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దాంతో ఎల్లంపల్లి నుంచి జూలై, ఆగస్టు నుంచే నీటిని మల్లన్నసాగర్ వరకు తీసుకురావడానికి అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆలోపు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, పంపులు పూర్తయితే.. దిగువ గోదావరి నీటినే కాళేశ్వరానికి తరలిస్తారు. ఒక వేళ అవి పూర్తికాకపోతే ఎల్లంపల్లికి వచ్చే నీటి నుంచి మళ్లించనున్నారు.



కేటీఆర్‌కో నీతి.. రాజయ్యకో నీతా?

» సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలి

» కేటీఆర్ అవినీతికి సాక్ష్యాలున్నాయి

» ఏసీబీకి ఫిర్యాదు చేస్తా: దాసోజు

హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మంత్రి కేటీఆర్ అవినీతిని ప్రోత్సహిస్తున్నారని, సిరిసిల్ల మునిసిపల్ చైర్‌పర్సన్ ఉదంతమే ఇందుకు నిదర్శనమని టీపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి దాసోజు శ్రావణ్ అన్నారు. కేటీఆర్ అవినీతికి సంబంధించి సాక్ష్యాలు కూడా దొరికినా ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదో సీఎం కేసీఆర్ చెప్పాలన్నారు. దళితుడైన మాజీ ఉప ముఖ్యమంత్రి రాజయ్య అవినీతికి పాల్పడ్డారంటూ.. ఏం చేశారో కూడా చెప్పకుండానే పదవి నుంచి తొలగించారని పేర్కొన్నారు. రాజయ్యకో నీతి, మంత్రి కేటీఆర్‌కు మరో నీతి వర్తింపజేస్తారా? కేటీఆర్‌పై చర్య తీసుకోకపోవడానికి కొడుకు కావడమే కారణమా? అని ప్రశ్నించారు. మంత్రి కేటీఆర్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని, ఆయన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆదివారం ఒక ప్రకటనలో శ్రావణ్ డిమాండ్ చేశారు. మంత్రి కేటీఆర్ సొంత నియోజకవర్గమైన సిరిసిల్లలో వెలుగుచూసిన అవినీతి.. రాష్ట్రంలో భారీగా జరుగుతున్న అవినీతికి మచ్చుతునక అని పేర్కొన్నారు. రాజీనామా చేసిన మునిసిపల్ చైర్‌పర్సన్ పావని.. మీడియా ప్రతినిధుల ఎదుట మాట్లాడిన మాటల్లో అనేక వాస్తవాలు ఉన్నాయన్నారు. తన గుట్టురట్టవుతున్న విషయాన్ని గుర్తించిన కేటీఆర్.. ఆమెతో పదవికి రాజీనామా చేయించారని ఆరోపించారు. కమీషన్లు తీసుకోవాలని కౌన్సిలర్లు, చైర్‌పర్సన్‌లకు సూచించిన కేటీఆర్.. తన వంతు పర్సంటేజీలను తీసుకోకుండా ఉంటారని ఎలా నమ్మమంటారో చెప్పాలన్నారు. ఈ పర్సంటేజీల వ్యవహారం మంత్రి కనుసన్నల్లోనే జరుగుతోందనే విషయం కూడా పావని బయటపెట్టినా సీఎం పట్టించుకోవడంలేదన్నారు. ఈ వ్యవహారంపై తాను ఏసీబీకి ఫిర్యాదు చేస్తానని తెలిపారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లిన టీఆర్ఎస్ ఎమ్మెల్సీ లక్ష్మీనారాయణను అక్కడి సిబ్బంది లంచం అడిగారని, ఆయనే వెల్లడించినా చర్యలు తీసుకోలేదన్నారు.



చెరువులో పడి మృతి చెందిన ఐదుమంది మృతదేహాలు

నీట మునిగి ఐదుగురి దుర్మరణం

» కుమారులను కాపాడేందుకు తండ్రి

» వీరి కాపాడే క్రమంలో మరో ఇద్దరు.. మెదక్ జిల్లాలో విషాదం

కౌడిపల్లి, మార్చి 18 : మరో కొద్ది రోజుల్లో ఆ ఇంట్లో శుభకార్యం. ఇల్లంతా బంధువులతో సందడి సందడిగా ఉంది. ఆదివారం సరదాగా చెరువుకు వెళ్లారు. కొందరు చేపలు పడుతుండగా.. మరికొందరు స్నానం చేస్తున్నారు. ఇంతలో ఇద్దరు నీట మునిగారు. వీరిని రక్షించే క్రమంలో మరో ముగ్గురు ఒకరి వెంట ఒకరు ప్రాణాలు వదిలారు. మరో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. మృతుల్లో తండ్రి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటన మెదక్ జిల్లా మెదక్ జిల్లా మహ్మద్‌నగర్ పంచాయతీ కన్నారంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మహ్మద్ ఖాజా ఇంతియాజ్‌అలీ (35), తన భార్య, కుమారులు ఆసిఫ్‌అలీ (12), ఖాజా హైమద్‌అలీ (8)లతో హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. అయితే వివాహానికి హాజరయ్యేందుకు కుటుంబంతో సహా వారం క్రితం గ్రామానికి వచ్చారు. హైదరాబాద్‌లోనే ఉంటున్న ఇసాక్‌అలీ (28), మహ్మద్‌హుదా (18), హుబేద్‌ఉల్లా, పాతిమాలు పెళ్లి నిమిత్తం ఇటీవల గ్రామానికి చేరుకున్నారు. ఆదివారం చేపలు పట్టేందుకు చెరువుకు వెళ్లారు. అసిఫ్‌అలీ, ఖాజాహైమద్‌అలీ స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు నీట మునిగారు. గమనించిన ఇంతియాజ్, ఇసాక్, మహ్మద్‌హుదాలు వీరిని కాపాడే ప్రయత్నం చేస్తూ వారు కూడా నీట మునిగారు. హుబేద్‌ఉల్లా, పాతిమాలను అక్కడే ఉన్న వాహన డ్రైవర్ సుబాన్‌అలీ కాపాడారు. ఒకేసారి ఐదుగురు ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. చెరువులో తవ్విన భారీ గోతులే ప్రమాదానికి కారణమని ఆరోపిస్తున్నారు.

హాయ్.. నేను డాక్టర్ రోబో!

రోగులకు మరమనిషి సేవలు.. కరచాలనంతో బీపీ రికార్డు చేస్తుంది

» తొలిసారి సన్‌షైన్ ఆస్పత్రిలో అందుబాటులోకి

» టీహబ్‌లోనే తయారైన రోబో



రోబోను పరిశీలిస్తున్న ఐటీ కార్యదర్శి జయేశ్ రంజన్

రాయదుర్గం, హైదరాబాద్ సిటీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): 'ఓ ఆస్పత్రిలో కడుపులో బిడ్డ అడ్డం తిరిగి గర్భిణి తీవ్ర నొప్పులతో రోదిస్తోంది. ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆపరేషన్ చేయడానికి వైద్యులు జంకుతున్నారు. ఏ మాత్రం సాహసం చేసినా తల్లీబిడ్డ ప్రాణానికి ముప్పే. అప్పుడే ఒక వ్యక్తి వచ్చి ఆపరేషన్ చేసి తల్లీబిడ్డను కాపాడాడు.' రోబో సినిమాలోని సన్నివేశం ఇది. చికిత్స చేసిన ఆ వ్యక్తి మనిషి కాదు మరమనిషి. ఆ స్థాయిలో కాకపోయినా నాడీ చూసి బీపీ ఎంత ఉందో చెప్పే రోబో.. ఆదివారం కొత్తగా రాయదుర్గంలో ప్రారంభమైన సన్‌షైన్ ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చేసింది. ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్దకు వెళ్లి ఈ రోబోతో కరచాలనం చేస్తే చాలు.. స్వాగతం పలికి బీపీ పల్స్ రేటును నమోదు చేస్తుంది. రోగి పేరు చెప్పగానే రీడింగ్ చేసుకొని, అతడి ముఖాన్ని స్కాన్ చేసి తన మెమరీలో నిక్షిప్తం చేసుకుంటుంది. రోగిని రిసెప్షన్ వద్దకు తీసుకెళ్తుంది. అక్కడ సిబ్బంది.. రోగి పేరుతో రికార్డు సిద్ధం చేసి సంప్రదించాల్సిన డాక్టర్ పేరు, విభాగాన్ని రోబోకు వివరిస్తారు. సిబ్బంది సూచించిన ప్రకారం రోగిని వెంటబెట్టుకొని సదరు డాక్టర్ వద్దకు తీసుకెళ్లి అప్పగించి తిరిగి ప్రధాన ద్వారం వద్దకు చేరుకుంటుంది. ఒకసారి తన పేరును రోబో వద్ద పేరు నమోదు చేసుకున్న వ్యక్తి మళ్లీ ఆస్పత్రికి చికిత్స కోసం వస్తే అతడ్ని గుర్తుపెట్టుకొని 'హలో' అని పలకరించి అవసరమైన సేవల్ని అందించే ప్రయత్నం చేస్తుంది. టీహబ్‌లోనే తయారైన ఈ రోబోను తొలిసారి సన్‌షైన్ ఆస్పత్రిలో ప్రవేశపెట్టినట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గురవారెడ్డి చెప్పారు. రోబో చేతికి ఉండే ప్రత్యేక సెన్సర్ పరికరాల ద్వారా రోగి బీపీ చెక్ చేస్తుందని తెలిపారు. మున్ముందు ఈ రోబోలో రోగికి సంబంధించిన డయాగ్నస్టిక్ నివేదికలను కూడా నిక్షిప్తం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వివరించారు. రోగి మరోసారి ఆస్పత్రికి వైద్య సేవల కోసం వచ్చిన సమయంలో ఈ రోబో ద్వారా తన పాత నివేదికలను ప్రింట్‌ను కూడా తీసుకోవచ్చునన్నారు. ఆస్పత్రి ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర హోం మంత్రి నాయిని, సంగీత దర్శకుడు కీరవాణి ఈ రోబో పనితీరుకు ముగ్ధులయ్యారు. ఉగాదిని పురస్కరించుకొని సన్‌షైన్ ఆస్పత్రిని ప్రారంభించారు.

మద్యం తాగి.. యువతుల షి'కారు'

» ఫుడ్ సంస్థ డెలివరీ బైక్‌ను ఢీకొట్టిన జూమ్ కారు

» డెలివరీ బాయ్ మృతి.. మరో యువకుడి పరిస్థితి విషమం



మృతి చెందిన చిరంజీవి (ఫైల్)

రాయదుర్గం/హైదరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు అమ్మాయిలు.. ఢిల్లీ నుంచి స్నేహితుణ్ని కలిసేందుకు వచ్చారు. పీకల దాకా మద్యం తాగారు. మత్తులోనే అర్ధరాత్రి.. నగర రోడ్లపై అద్దెకారులో షికారు చేశారు. మితిమీరిన వేగంతో వెళ్లి.. ఓ బైక్‌ను ఢీకొట్టారు. ఓ ఫుడ్ సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేసే నిరుపేద యువకుడి ప్రాణాలను బలిగొన్నారు. శనివారం రాత్రి గచ్చిబౌలిలోని టీ హబ్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండలో నివాసముంటూ, సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న రామాయణం శ్రీనివాసులు కుమారుడు చిరంజీవి (20) జూమోటో ఫుడ్ సంస్థలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో ఓ పార్సిల్ ఇచ్చేందుకు తన స్నేహితుడు సాయి కుమార్‌తో కలిసి కైనటిక్ హోండాపై వెళ్తున్నాడు. గచ్చిబౌలిలోని టీ హబ్ వద్దకు రాగానే వెనుక నుంచి ఓ జూమ్ కారు వేగంగా వచ్చి.. వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు పల్టీలు కొట్టి బైక్‌పై పడింది. దీంతో చిరంజీవి, సాయికుమార్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వారిని సమీపంలోని కేర్ ఆస్పత్రికి తరలించగా చిరంజీవి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సాయికుమార్ పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకున్న రాయదుర్గం పోలీసులు.. ఆ కారును నడిపిన యువతి ఢిల్లీకి చెందిన జెన్నీ జాకబ్‌గా గుర్తించారు. ఆమెతోపాటు కారులో ఆమె స్నేహితురాలు లీసా ఉన్నట్లు నిర్ధారించారు. వీరు మాదాపూర్‌లోని నోవార్టిస్‌లో పనిచేసే తమ స్నేహితుడు నవనీత్ నీరుల్లాను కలిసేందుకు ఢిల్లీ నుంచి నాలుగు రోజుల క్రితం నగరానికి వచ్చారని, అద్దె కారులో నాలుగు రోజులుగా నగరంలో తిరుగుతున్నారని ఇన్‌స్పెక్టర్ ఎం.రాంబాబు తెలిపారు. ఈ మేరకు జెన్నీ జాకబ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు, కారులో మద్యం బాటిళ్లు, చికెన్, పేపర్ ప్లేట్లు లభించినట్లు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సాగు చేసిన భూమిలోనే ప్రాణాలొదిలాడు

» పురుగుల మందుతాగి పోడు రైతు ఆత్మహత్య

» అటవీ అధికారుల వేధింపులతో మనస్తాపం.. ఖమ్మం జిల్లాలో ఘటన

పెనుబల్లి, మార్చి 18: ఖమ్మం జిల్లాలో పండగపూట విషాదం చోటు చేసుకుంది. అటవీ అధికారుల వేధింపులతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా సాగు చేసుకుంటున్న పోడుభూమి ఎక్కడ తనకు దక్కకుండా పోతుందోనన్న మనస్తాపంతో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సాగు చేసిన భూమిలోనే ప్రాణాలు విడిచాడు. ఈ విషాదకర ఘటన ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం పార్థసారథిపురం అటవీ ప్రాంతంలో ఆదివారం జరిగింది. పెనుబల్లి మండలం ఉప్పలచెలక గ్రామానికి చెందిన అంబోజి వెంకయ్య(60) గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న పార్థసారథిపురం సమీపంలోని అటవీ ప్రాంతంలో 150 మంది రైతులతో కలిసి ఒకటిన్నర ఎకరం భూమిని పోడు కొట్టి సాగుచేస్తున్నాడు. ఈ ఏడాది కూడా పత్తి వేశాడు. కొంతకాలంగా పోడు భూమి వద్ద ప్రభుత్వం తరఫున హద్దులు గుర్తించే పనులను డీఆర్‌వో రేణుక, రేంజర్ వెంకటేశ్వరరావు, ఇతర అటవీ శాఖ అధికారులు చేపట్టారు. వారం రోజులుగా ఆ పనులు ముమ్మరం కావడంతో శనివారం పలువురు పోడు రైతులు సత్తుపల్లిలోని రేంజ్ అధికారిని కలిసి పోడుభూమిని రైతులకు ఇవ్వాలంటూ వేడుకున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు చేయిస్తున్న పనులు.. వెంకయ్య సాగు చేసిన భూమిలోకి రావడంతో ఒత్తిడికి గురయ్యాడు. తాను సాగు చేసుకుంటున్న భూమి ఎక్కడ దక్కకుండా పోతుందోనని మనస్తాపం చెందాడు. ఆదివారం పోడు భూమి వద్దకు వెళ్లి అక్కడే ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు.



పోడు భూమి వద్ద అంబోజి వెంకయ్య మృతదేహం




అంటార్కిటికాలో 403 రోజులు

- ఇస్రో మొదటి మహిళా శాస్త్రవేత్త అరుదైన రికార్డు
- 56 ఏళ్ల వయసులో మంచు ఖండంలో నివాసం

న్యూఢిల్లీ, మార్చి 18: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మొట్ట మొదటి మహిళా శాస్త్రవేత్తగా గుర్తింపు పొందిన మంగళ మణి మరో అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. మంచు ఖండం అంటార్కిటికాలో ఆమె ఏకంగా 403 రోజులు గడిపారు. అక్కడి భారత పరిశోధన కేంద్రం నిర్వహణకు వెళ్లిన 23 మంది బృందంలో ఆమె ఒక్కరే మహిళ కావడం గమనార్హం. 'మానసికంగా.. శారీరకంగా ఫిట్ అని తేలితేనే అంటార్కిటికాకు పంపుతారు. తొలుత ఉత్తరాఖండ్‌లోని చమేలీ, బద్రీనాథ్‌లలో శిక్షణ పొందాం. ఈ శిక్షణలో సముద్ర మట్టానికి 10వేల అడుగుల ఎత్తులో, మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతల్లో గడపాల్సి ఉంటుంది. అంటార్కిటికాలో కనిష్ఠ ఉష్ణోగ్రత మైనస్ 90 డిగ్రీలు. అక్కడి పరిశోధన కేంద్రం నుంచి బయటకు వెళ్లాలంటే.. పోలార్ దుస్తులు ధరించాలి. అదికూడా మూడు గంటలకు మించి బయట ఉండకూడదు' అని మంగళ పేర్కొన్నారు.


ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

తెలుగు ప్రభుత్వాలకు అనిశ్చితి

- అధికారంలో ఉన్నవారికి కత్తిమీద సాములా పాలన
- శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

పెందుర్తి (విశాఖ సిటీ), మార్చి 18: కుజుడు కేతువుతో కలసి ఉండడంతో దేశానికి కుజస్తంభన ఉందని, ఈ కారణంగా తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలకు అనిశ్చితి ఏర్పడుతుందని, అధికారంలో ఉన్నవారికి పాలన పెనుసవాల్‌గా ఉంటుందని శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పేర్కొన్నారు. చినముషిడివాడలోని శారదాపీఠంలో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. పీఠం ఆస్థాన సిద్ధాంతి పంతులు రామలింగశర్మ విళంబి నామ సంవత్సర పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి స్వరూపానంద అనుగ్రహ భాషణ చేస్తూ... గ్రహచార దోషాలతో పాలకుల వల్ల ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. అతివృష్టి, అనావృష్టిలతో రైతులు తీవ్రంగా నష్టపోతారని జ్యోతిషులు ఉదహరిస్తున్నారని స్వామీజీ అన్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితులను నిలువరించేందుకు ప్రభుత్వాల ఆధీనంలో ఉన్న ఆలయాల్లో పరమేశ్వరుడుకి, సుబ్రహ్మణ్య స్వామి పూజలు నిర్వహించాలని స్వామీజీ సూచించారు.

ఆర్థిక వ్యవస్థ సర్వనాశనం

- కశ్మీరును కంగాళీ చేశారు.. అంతా వాగాడంబరమే
- 2 కోట్లు కాదు.. 2 లక్షల ఉద్యోగాలైనా లేవు
- నోట్ల రద్దే చెడ్డ ఆలోచన.. హడావుడిగా జీఎస్‌టీ అమలు
- ప్లీనరీలో మోదీ సర్కారుపై మన్మోహన్ దాడి



న్యూఢిల్లీ, మార్చి 18: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ విరుచుకుపడ్డారు. ఆర్థికం, విదేశాంగం నుంచి రక్షణ దాకా అన్ని రంగాల్లో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. ఆదివారమిక్కడ ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో కాంగ్రెస్ ప్లీనరీ రెండో రోజున ఆయన ప్రసంగించారు. 'భారత ఎకానమీ ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు భిన్నంగా ఉంది. ఆర్థిక వ్యవస్థను మోదీ సర్కారు సర్వనాశనం చేసింది. ఎన్నికల ప్రచార సమయంలో మోదీ వాగాడంబరం కనబరిచారు. ఏటా రెండు కోట్ల మందికి ఉపాధి కల్పిస్తామన్నారు. కనీసం రెండు లక్షల ఉద్యోగాలైనా కల్పించలేదు. నోట్ల రద్దు ఆలోచనే చెడ్డది. సన్నద్ధత లేకుండా జీఎస్‌టీని అమల్లోకి తెచ్చారు. దీంతో ఎందరికో ఉపాధి దూరమైంది. ఉత్పాదకత, ఉద్యోగ కల్పనపై తీవ్ర ప్రభావం చూపాయి. ఆరేళ్లలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని మోదీ హామీ ఇచ్చారు. దీనిని నెరవేర్చాలంటే ఏటా కనీసం 12 శాతం వృద్ధి రేటు సాధించాలి. ఇది నెరవేరే అవకాశమే లేదు' అని తెలిపారు. జమ్మూకశ్మీరు సమస్యను మోదీ సర్కారు కంగాళీ చేసిందని మన్మోహన్ విమర్శించారు. 'సీమాంతర ఉగ్రవాదం, అంతర్గత తీవ్రవాదం పెచ్చరిల్లుతున్నాయి. దీంతో మన సరిహద్దులు సుభద్రంగా లేవు. వీటన్నిటినీ తనంత తానే పరిష్కరించగలనని మోదీ ప్రభుత్వం అనుకుంటోంది. కానీ ఇది జరిగే పనికాదు. సర్కారుకు పొరుగు దేశాలతో సంబంధాలు సరిగా లేవు' అని అన్నారు.

తిరుపతి హుండీలు లెక్కించేవారిని పిలవాల్సింది

కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం ప్లీనరీలో ఆర్థిక తీర్మానాన్ని ప్రవేశపెట్టిన అనంతరం మాట్లాడుతూ.. 'నోట్ల రద్దు కంటే పెద్ద అబద్ధం ఇంకోటి ఉండదు. బ్యాంకులకు చేరిన పాతనోట్లను ఇంతవరకు ఆర్‌బీఐ ఎందుకు గణించలేకపోయింది? తిరుపతి హుండీల్లో వచ్చిన ధనం లెక్కించేవారు శరవేగంగా లెక్కిస్తారు. వారిని ఎందుకు సంప్రదించలేదని ఆర్‌బీఐ అధికారులను అడుగదలచుకున్నాను' అని ఎద్దేవాచేశారు.

వచ్చే ఏడాది ప్రధానమంత్రిగా ఢిల్లీ ఎర్రకోటపై జాతీయ పతాకావిష్కరణకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ సిద్ధంగా ఉండాలని పంజాబ్ మంత్రి, ఆ పార్టీ నాయకుడు నవజోత్‌సింగ్ సిద్ధూ అన్నారు.

మోదీ అంటేనే అవినీతి: రాహుల్

న్యూఢిల్లీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మోదీ అంటేనే అవినీతి అని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో మార్పు రావాలని, 2019 ఎన్నికల్లో విజయం సాధించడానికి కలిసికట్టుగా పనిచేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన పార్టీ 84వ ప్లీనరీ ముగింపు సందర్భంగా ఆదివారం రాహుల్ ప్రసంగించారు. 'వేల ఏళ్ల క్రితం కురుక్షేత్రంలో పాండవులు, కౌరవుల మధ్య జరిగిన మహాభారత యుద్ధంలో దురహంకారులైన కౌరవులకు డబ్బు, సంఖ్యాబలం ఉంది. వారు అధికారం కోసం పోరాడారు. పాండవులు ఐదుగురే అయినా సత్యం కోసం పోరాడార'ని రాహుల్ చెప్పారు. బీజేపీ, ఆరెస్సెస్‌ను కౌరవులతో, కాంగ్రెస్‌ను పాండవులతో పోల్చారు. బీజేపీ ఒక సంస్థ గొంతుక... కాంగ్రెస్ ఒక జాతి గొంతుక అని చెప్పారు. గత ప్రభుత్వంలో చివరికి కొన్నేళ్లు తాము సరిగ్గా వ్యవహరించనందువల్ల ప్రజలు తమను గద్దె దింపారని అంగీకరించారు. బ్యాంకుల నుంచి రూ.33 వేల కోట్లు దోపిడీ చేస్తే బీజేపీ రక్షిస్తుందని వ్యంగ్యంగా అన్నారు. ఆర్థిక మంత్రి, తన కుమార్తె సన్నిహితులైన పెట్టుబడిదారుల కోసం పనిచేస్తున్నారని, అందుకే ఆయన ఈ అంశంపై మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. "మీరు మధ్యతరగతి వారైనా చైనా ఉత్పత్తులను కొనుగోలు చేస్తూనే ఉండాలి. మీరు పేదవారైతే తాత్కాలిక కార్మికులుగా, రైతులుగా, నిరుద్యోగులుగా ఉండాల్సిందే. మోదీ మాయలోనే జీవించాలి. 'అచ్ఛే దిన్', స్వచ్ఛ భారత్, బ్యాంకు ఖాతాలో 15 లక్షల సొమ్ము అనే ఊహ ప్రపంచంలో ఉండాల"ని వ్యాఖ్యానించారు. ప్రధాని మన దృష్టిని మరల్చడానికి గబ్బర్ సింగ్ టాక్స్ నుంచి యోగా వరకు ఒక కార్యక్రమం నుంచి ఇంకో కార్యక్రమంలోకి దూకుతుంటారని చురకంటించారు. "నీరవ్ మోదీ.. మన ప్రధాన మంత్రిలో ఉన్న పేరు ఉంది. క్రికెట్‌లో అత్యంత అవినీతిపరుడైన వ్యక్తి కూడా ప్రధాని పేరును పంచుకున్నారు. మోదీ అంటే ఏంటి?... మోసం చేద్దామని క్రోనీ క్యాపిటలిస్టులు, భారత ప్రధాన మంత్రి మధ్య కుదిరిన ఒప్పందం" అని ధ్వజమెత్తారు. రాఫెల్ ఒప్పందంపై మాట్లాడుతూ ఒక్కో విమానం కొనుగోలుకు రూ.1100 కోట్లు అదనంగా వెచ్చించారని చెప్పారు. "వాళ్లెప్పుడూ పాకిస్థాన్ వెళ్లలేదు. ఈ దేశానికి అండగా నిలిచేవాళ్లు. అయినా భారతీయ ముస్లింలను మీరు ఇక్కడి వాళ్లు కాదంటారు. తమిళులకు వారి భాషను మార్చుకోమని చెబుతారు. మీ ఆహారం మాకిష్టం లేదని ఈశాన్య ప్రజలకు చెబుతారు. దుస్తులు సరిగా ధరించమని మహిళలకు చెబుతారు" అని బీజేపీ తీరును దుయ్యబట్టారు.

నాలుగేళ్ల క్రితం ప్రజలు మోదీని విశ్వసించారని, ఇప్పుడు ఆయన విశ్వాసం కోల్పోయారని, దేశ యువత ప్రభుతాన్ని ప్రశ్నిస్తోందని అన్నారు. బీజేపీ భయాన్ని వ్యాప్తిచేస్తోందని, న్యాయం కోసం నలుగురు సుప్రీం కోర్టు జడ్జీలు ప్రజల్లోకి రావడాన్ని అందరూ చూశారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రపంచంలో అమెరికా విజన్, చైనా విజన్ అనే రెండు విజన్లు ఉన్నాయని, ఇండియన్ విజన్ ప్రవేశపెట్టడమే తన లక్ష్యమని ప్రకటించారు.

అడ్డుగోడను కూలుస్తా

కాంగ్రెస్‌లో మార్పు రావాలి. మన నాయకులకు కార్యకర్తలకు మధ్య అడ్డుగోడ ఉంది. నా మొదటి పని ఆ గోడను ప్రేమతో పడగొట్టడమేనని రాహుల్ చెప్పారు. 2019లో పార్టీని అధికారంలోకి తీసుకురావడం కోసం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. రానున్న ఆరేడు నెలల పాటు దేశం కోసం పోరాడాలని కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. టాలెంట్ ఉన్న యువతను ప్రోత్సహిస్తానని, అవకాశాలు కల్పిస్తానని చెప్పారు.


ఎల్‌ఈడీ తెరపై ప్లీనరీలో రాహుల్ ప్రసంగాన్ని వింటున్న సోనియా గాంధీ

సీడబ్ల్యూసీ సభ్యుల ఎంపిక బాధ్యత రాహుల్‌కే

- కాంగ్రెస్ ప్లీనరీ ఏకగ్రీవ ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులను ఎంపిక చేసే బాధ్యతను ఆ పార్టీ అధినేత రాహుల్‌గాంధీకి అప్పగిస్తూ కాంగ్రెస్ ప్లీనరీ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. ఆదివారం ఆ పార్టీ సీనియర్ నేత గులాం నబీ ఆజాద్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో త్వరలోనే సీడబ్ల్యూసీకి నూతన సభ్యులను రాహుల్‌గాంధీ ఎంపిక చేసే అవకాశం ఉంది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో కాంగ్రెస్ 84వ ప్లీనరీ సమావేశాలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. దేశ నలుమూలల నుంచి దాదాపు 20 వేల మంది ప్లీనరీలో పాల్గొన్నట్లు అంచనా. పలు తీర్మానాలను ప్లీనరీ ఆమోదించింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతలు రఘువీరారెడ్డి, సంపత్‌కుమార్, వినయ్‌కుమార్, ప్రేమ్ సింగ్ లోధీ, జేడీ శీలంలకు ఆయా తీర్మానాలపై వేదిక మీద ప్రసంగించే అవకాశం లభించింది. తెలంగాణ నుంచి ప్లీనరీకి 500 మంది హాజరవ్వగా ఏపీ నుంచి దాదాపు 100 మంది వచ్చారు.

నోటితో రాముడు.. మనసులో నాథూరామ్

ప్రధాని నరేంద్ర మోదీ.. తన నోటితో రాముడు అంటూనే నాథూరాంను మనసులో ఉంచుకుంటారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రేమ్‌సింగ్ లోధీ విమర్శించారు. ఢిల్లీలో జరిగిన పార్టీ ప్లీనరీలో ప్రవేశపెట్టిన ఆర్థిక తీర్మానంపై ఆదివారం లోధీ మాట్లాడారు. విభజన సమయంలో పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలు మోదీ సర్కారు విస్మరించిందన్నారు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన, ఉద్యాన విశ్వవిద్యాలయాలు ఏర్పాటు హామీలను ప్రభుత్వం బుట్టదాఖలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్నికలవేళ మతఘర్షణలు

- అనుమానం వ్యక్తంచేసిన ఖర్గే

బెంగళూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కర్ణాటకలో మతఘర్షణలు చెలరేగే ప్రమాదముందని కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే అనుమానం వ్యక్తం చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఏఐసీసీ ప్లీనరీ సందర్భంగా ఖర్గే చేసిన వ్యాఖ్య ప్రస్తుతం రాష్ట్రమంతా చర్చకు దారితీసింది. హిందూ, ముస్లిం, దళితులు, వెనుకబడిన వర్గాల మధ్య వివాదాలు పెంచేలా బీజేపీ, సంఘ్ పరివార్ వ్యవహరిస్తోందని ఖర్గే ఆరోపించారు. ప్రధాన మంత్రి కర్ణాటక పర్యటనకు వచ్చిన ప్రతిసారీ అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. 70 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ ఏమీ చేయలేదని బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

రాహుల్ నాయకత్వంలో ముందుకు వెళ్తాం

- రాష్ట్ర కాంగ్రెస్ నేతల స్పందన.. కేసీఆర్‌ది థర్డ్ ఫ్రంట్ కాదు, అదో స్టంట్: రేవంత్

న్యూఢిల్లీ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాలు నూతనోత్తేజాన్ని నింపాయని, రాహుల్‌గాంధీ నాయకత్వంలో ముందుకు వెళ్తామని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నేతలు అన్నారు. ప్లీనరీలో పాల్గొన్న పలువురు నాయకులు ఆదివారం మీడియాతో మాట్లాడారు. 'వ్యవసాయ రంగాన్ని గాడిలో పెట్టాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలి. యువతకు, వ్యవసాయానికి పెద్దపీట వేసి రాహుల్‌గాంధీ నాయకత్వంలో ముందుకు వెళ్తాం..' అని పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. మాజీ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కొత్త తరానికి రాజకీయ భవిష్యత్తు నిచ్చేలా ప్లీనరీ సమావేశాలు జరిగాయని తెలిపారు. 'సీనియర్లకు, కార్యకర్తలకు మధ్య అడ్డుగోడలను తొలగిస్తామని రాహుల్ చెప్పడం పార్టీలో కొత్త ఉత్తేజాన్ని నింపింది' అని మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ అన్నారు. పార్టీ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. 2019లో అటు దేశంలోనూ ఇటు రాష్ట్రంలోనూ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌ది థర్డ్ ఫ్రంట్ కాదని, స్టంట్ అని కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి విమర్శించారు.

ఈవీఎం బదులు మళ్లీ బ్యాలట్ పత్రాలు

- ఏకాభిప్రాయం ఉంటే మేం రెడీ: బీజేపీ

న్యూఢిల్లీ, మార్చి 18: ఇతర రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయానికి వస్తే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంలు) స్థానంలో తిరిగి బ్యాలట్ పత్రాలను ఉపయోగించే అంశంపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని బీజేపీ తెలిపింది. మళ్లీ బ్యాలట్ పత్రాలను తేవాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘాన్ని కోరిన మరుసటి రోజే బీజేపీ ప్రకటన చేయడం గమనార్హం.

అసమర్థులతో ఆర్థిక వ్యవస్థ నాశనం

- మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ధ్వజం

న్యూఢిల్లీ, మార్చి 18: మోదీ ప్రభుత్వం దేశ ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. అసమర్థ ఆర్థిక నిర్వాహకుల నుంచి దేశాన్ని కాపాడితేనే అభివృద్ధి సాధ్యమవుతుందని వ్యాఖ్యానించింది. కాంగ్రెస్ 84వ ప్లీనరీలో ఆర్థిక తీర్మానాన్ని ప్రవేశపెట్టిన కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం మాట్లాడుతూ "12 నెలల తర్వాత ఎవరు అధికారంలోకి వచ్చినా... వారికి విషమ పరీక్షే. భారీ సంక్షోభాన్ని ఎదుర్కోవాలి. తల్చుకుంటేనే భయమేస్తోంద"ని వ్యాఖ్యానించారు. మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానం కూడా గందరగోళంగా, దురుసు ఉందని సీనియర్ నేత ఆనంద్ శర్మ ప్రవేశపెట్టిన మరో తీర్మానంలో కాంగ్రెస్ విమర్శించింది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడంలో.. తెలంగాణలో సుపరిపాలన అందించడంలో కాంగ్రెస్ పార్టీ కృషి చేయాలని కేంద్ర మాజీ మంత్రి పీ శివశంకర్ కుమారుడు పీ వినయ్ కుమార్ అధినాయకత్వాన్ని కోరారు.

యూపీలో కమలానికి మరో షాక్?

- అసంతృప్తిలో బీజేపీ మిత్రపక్షం ఎస్‌బీఎస్‌పీ
- రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో మిత్ర ధర్మం పాటించలేదని ఆరోపణ

లఖ్‌నవ్, మార్చి 18: యూపీలో ఇటీవల గోరఖ్‌పూర్, ఫూల్పూర్ లోకసభ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీకి షాక్ తగిలింది. దాని నుంచి తేరుకోకముందే మరో షాక్ తగిలే సూచనలు కనిపిస్తున్నాయి. రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక విషయంలో తమను సంప్రదించలేదని బీజేపీ మిత్రపక్షమైన సుహెల్దేవ్ భారతీయ సమాజ్ పార్టీ (ఎస్‌బీఎస్‌పీ) వ్యాఖ్యానించింది. బీజేపీ మిత్రధర్మం పాటించలేదని ఆ పార్టీ అధినేత ఓంప్రకాశ్ రాజ్‌భార్ ఆరోపించారు. దీంతో ఈనెల 23న జరిగే రాజ్యసభ ఎన్నికల్లో ఎస్‌బీఎస్‌పీ.. ఏ పార్టీకి మద్దతిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. యూపీలో మొత్తం 10 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనుండగా.. 8 స్థానాలను బీజేపీ ఏకగ్రీవంగా గెలుచుకునే అవకాశాలున్నాయి. తొమ్మిదో స్థానం కోసం బీజేపీ పావులు కదుపుతోంది. మరో స్థానం కోసం 37 ఓట్లు అవసరం. ఎస్‌బీఎస్‌పీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలతో కలిపి బీజేపీకి 28 మంది సభ్యుల మద్దతు ఉంది. తొలి ప్రాధాన్యత ఓట్లలో బీజేపీ తొమ్మిదో స్థానాన్ని గెలుచుకునే అవకాశముందని, మరో తొమ్మిది మంది ఇతర పార్టీల సభ్యులు కూడా మద్దతిచ్చే అవకాశముందని సీఎం యోగి ఆదిత్యానాథ్ ప్రకటించారు. ఇటీవల ఎస్పీ కీలక నేత నరేశ్ అగర్వాల్ బీజేపీలో చేరడం కూడా ఈ వ్యాఖ్యలకు కారణమని తెలుస్తోంది. మరోవైపు రాజ్యసభ ఎన్నికల్లో తాము బీజేపీకి మద్దతివ్వాలా? లేక మరో పార్టీకా అనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఓంప్రకాశ్ రాజ్‌భార్ ప్రకటించారు. రాజ్యసభ ఎన్నికల్లో ఎస్‌బీఎస్‌పీ మద్దతివ్వకపోతే బీజేపీ అంచనాలు తలకిందులయ్యే ప్రమాదముంది. ఇదే జరిగితే.. బీజేపీకి మరో గట్టి దెబ్బ తగులుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బీజేపీ మిత్రపక్షాలు మాత్రం కమలానికి ఢోకా లేదంటున్నాయి.

2019లోనే కాదు.. 2024లోనూ మేమే!

- అవిశ్వాసంపై భయం లేదు: అమిత్‌షా



న్యూఢిల్లీ, మార్చి 18: 'ఇదే మా చివరి ఇన్నింగ్స్ అని ఎవరన్నారు? 2019లోనే కాదు.. 2024లో బీజేపీ అధికారంలోకి వస్తుంది' అని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా స్పష్టం చేశారు. శనివారం జీ ఇండియా కాంక్లేవ్‌లో ఆయన ప్రసంగించారు. 2014లో కంటే ఈ దఫా ఎక్కువ లోక్‌సభ స్థానాలు సంపాదిస్తామని ధీమా వ్యక్తంచేశారు. లోక్‌సభలో ప్రతిపక్షాల అవిశ్వాస తీర్మానంపై మాట్లాడుతూ.. ఎన్‌డీఏ ప్రభుత్వానికి సంపూర్ణ మెజారిటీ ఉందని, సంఖ్యాబలం తగ్గుతుందన్న భయం లేదని స్పష్టం చేశారు. 'అవిశ్వాసంపై చర్చకు సిద్ధం. కానీ ప్రతిపక్షాలు సభను జరగనివ్వడం లేదు. ఓటమి తప్పదని వాటికీ తెలుసు' అని వ్యాఖ్యానించారు. ఇరవై రాష్ట్రాల్లో బీజేపీ ప్రస్తుతం అధికారంలో ఉందని, కొద్ది నెలల్లో జరిగే కర్ణాటక ఎన్నికల్లో కూడా గెలిచి మరో రాష్ట్రాన్ని దక్కించుకుంటామని చెప్పారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలను 'మోదీ వర్సెస్ మిగతా పార్టీలు'గా అంతా పరిగణిస్తున్న విషయమై అడుగగా.. "మమ్మల్ని ఎదుర్కోవడానికి అన్ని పార్టీలూ చేతులు కలపడం బీజేపీ బలాన్ని సూచిస్తోంది. గతంలో 'ఇందిరాగాంధీ వర్సెస్ మిగతా పార్టీలు'గా భావించేవారు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది" అని షా బదులిచ్చారు. యూపీలో ఎస్పీ, బీఎస్పీ చేతులు కలపడంతో గోరఖ్‌పూర్, ఫూల్‌పూర్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో బీజేపీ ఓటమి పాలైన అంశాన్ని ప్రస్తావించగా.. 'ఆ రాష్ట్రంలో బీజేపీ వృద్ధి చెందుతోందనడానికి ఇది నిదర్శనం. రాజకీయ ఉనికి సంక్షోభంలో పడడంతో ఆ రెండు పార్టీలు చేతులు కలిపాయి' అని చెప్పారు. కాంగ్రెస్ ప్రతి రాష్ట్రాన్నీ కోల్పోతోందని చెప్పారు. 'మేం ఆ పార్టీ నుంచి 11 రాష్ట్రాలను కైవసం చేసుకున్నాం. కానీ మేం కొన్ని ఉప ఎన్నికల్లో ఓడగానే కాంగ్రెస్ ఆనందిస్తోంది' అని ఎద్దేవాచేశారు. రాహుల్‌గాంధీకి కాంగ్రెస్ అధ్యక్షుడిగా పదోన్నతి లభించినా.. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ఒనగూరేదేమీ లేదని చెప్పారు. పుట్టుకతోనే ఆయన కాంగ్రెస్ అధ్యక్షుడన్న సంగతి ప్రజలందరికీ తెలుసని షా అనగానే.. సభికులంతా నవ్వేశారు.

ఢీ అంటే ఢీ!

(మొదటి పేజీ తరువాయి)

సభలో దాన్ని సభాపతి చదివి వినిపించాలి. ఆ తీర్మానానికి మద్దతిచ్చేవారెవరు? లేచి నిలబడాలని అడగాలి. కనీసం 50 మంది దానికి మద్దతుగా తమ సీట్లనుంచి లేచి నిలుచుంటే.. దానిని చర్చకు అనుమతించాలి. 10రోజుల్లోపు దానిపై చర్చ, ఓటింగ్ చేపట్టాల్సి ఉంటుంది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. అంతదాకా రానివ్వకుండా.. కొన్ని పార్టీలతో అల్లరి చేయించి సభలో గందరగోళం సృష్టించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఒకవేళ అలా చేస్తే ఏం చేయాలో కూడా టీడీపీ వ్యూహాత్మకంగా సిద్ధమైంది. అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా 50 మంది ఎంపీలు ఉన్నారో లేదో ఖరారుచేసుకోవడానికి సభాపతి సభ్యులను తమ స్థానాల్లో లేచి నిలబడాలని అడుగుతారు. అలా నిలబడేటప్పుడు గందరగోళం సృష్టించి.. సభ్యులంతా నిలబడి.. ఎవరు ఎందుకు నిలుచున్నారో తెలియని పరిస్థితులు సృష్టించి.. ఆ అవిశ్వాసం తీసుకోబోమని అనేందుకు అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ముందుగానే 50 మంది ఎంపీలతో అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేయించి ఇచ్చి.. చర్చకు తీసుకోవాలని పట్టుబట్టాలని టీడీపీ ఎత్తుగడ వేస్తోంది. అయినా అవిశ్వాసం తీసుకోవడానికి అడ్డంకులు సృష్టిస్తే.. పార్లమెంటు లోపలా, బయటా ఆందోళనలు ఉధృతం చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పలు పార్టీలు టీడీపీ అవిశ్వాసానికి మద్దతిచ్చేందుకు ముందుకొచ్చాయి. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలే 34 మంది ఉన్నారు. టీడీపీ ఎంపీలకు వీరు కలిస్తే 50 మంది సరిపోతారు. అయినా మిగతా పార్టీలతో కూడా సంతకాలు చేయించాలని టీడీపీ అనుకుంటోంది. ఇప్పటికే మజ్లిస్ పార్టీ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సంతకం చేశారు. మళ్లీ కావాలన్నా చేస్తారని టీడీపీ ఎంపీలు చెబుతున్నారు. అదే సమయంలో సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీలతో పాటు కేరళకు చెందిన ఒక స్వతంత్ర ఎంపీ కూడా మద్దతిస్తున్నారని టీడీపీ ఎంపీ సీఎం రమేశ్ తెలిపారు. ఒకవేళ సోమవారం సభలో గందరగోళ పరిస్థితులు ఉన్నాయని వాయిదా వేసినా.. ఆ తర్వాత కూడా ఒత్తిడి పెంచుకుంటూ వెళ్తామని చెప్పారు. పార్లమెంటు సమావేశాలు ఏప్రిల్ ఆరో తేదీ వరకు జరగనున్నాయి. అప్పటివరకు ప్రతి రోజూ 50 మందితో సంతకాలు చేయించిన అవిశ్వాస తీర్మానం నోటీసులివ్వాలని.. చర్చకు ఒత్తిడిని తీవ్రతరం చేయాలని తెలుగుదేశం నిర్ణయించింది. మరోవైపు.. తన ఎంపీలకు తెలుగుదేశం పార్టీ విప్ జారీచేసింది.

మిత్రపక్షాలతో బీజేపీ తొలిసారి మాటలు

టీడీపీ అవిశ్వాసం కారణంగా బీజేపీ తొలిసారిగా మిత్రపక్షాలతో చర్చించే పరిస్థితి వచ్చిందని అంటున్నారు. నాలుగేళ్లుగా తనపై గుర్రుగా ఉన్న శివసేనతో బీజేపీ నేరుగా చర్చలు జరిపింది. అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వొద్దని కోరిందని వార్తలు వస్తున్నాయి. అకాలీదళ్, అన్నాడీఎంకే ఎంపీలతోనూ బీజేపీ మాట్లాడుతోందని అంటున్నారు. ఒకరకంగా చెప్పాలంటే టీడీపీ అవిశ్వాసం.. ఎన్డీఏలోని భాగస్వామ్య పక్షాలతో బీజేపీ చర్చలకు వచ్చే పరిస్థితి కల్పించిందని టీడీపీ ఎంపీలు అంటున్నారు.


సరిహద్దుల్లో పాక్ కాల్పుల్లో గాయపడినవారిని తరలిస్తున్న భద్రతా బలగాలు

పాక్ పైశాచికం

- జమ్మూలో సరిహద్దు వెంట జనావాసాలపై కాల్పులు
- ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి

జమ్మూ, మార్చి 18: పాక్ బలగాలు దురాఘతానికి తెగబడ్డాయి. భారత సరిహద్దు వెంట జనావాసాలపై కాల్పులు జరిపి.. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిని పొట్టనబెట్టుకున్నాయి. మృతుల్లో ముగ్గురు చిన్నారులున్నారు. మరో ఇద్దరు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. జమ్మూకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వద్ద పాక్ సైనికులు.. ఆదివారం ఉదయం పూంచ్ జిల్లా బాలకోటే సెక్టార్‌లోని గ్రామాలే లక్ష్యంగా బుల్లెట్లు, మోర్టార్‌షెల్స్‌తో కాల్పులు జరిపారు. దీంతో దేవ్‌తా సర్గ్‌లూన్ గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతిచెందారు. మృతుల్లో ఇంటి పెద్ద చౌదరీ మహమ్మద్ రంజాన్(35), ఆయన భార్య మలికా బీ(32)తోపాటు వారి ముగ్గురు కుమారులు అబ్దుల్లా రెహ్మాన్(14), మహమ్మద్ రిజ్వాన్(12), రజాక్ రంజాన్(7) ఉన్నారు. మహమ్మద్ రంజాన్ ఇద్దరు కూతుళ్లు నస్రీన్ కౌసర్(11), మహ్రీన్ కౌసర్(5) తీవ్రంగా గాయపడ్డారు.

మాతో సమస్య లేదు.. హోదాతోనే చిక్కంతా..

- టీడీపీ నిర్ణయం దురదృష్టకరం.. కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్

న్యూఢిల్లీ, మార్చి 18: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక సాయం అందించేందుకు బీజేపీ ఇప్పటికీ కట్టుబడి ఉందని కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. టీడీపీ వైదలగడానికి బీజేపీ కానీ, పీఎం మోదీ కానీ కారణం కాదని, కేవలం ప్రత్యేక హోదా అంశంపైనే ప్రస్తుతం చర్చ జరుగుతోందని పేర్కొన్నారు. ఓ జాతీయ చానెల్‌కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, ఇన్నేళ్లపాటు కలిసి ఉన్న తర్వాత ఎన్డీయే నుంచి వైదొలగాలని సీఎం చంద్రబాబు నిర్ణయించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం

ఫస్ట్‌పర్సన్

ఇలియానా... ఇలియానా డిక్రూజ్...
తెలుగు నుంచి హిందీ దాకా ప్రతి చోటా గ్లామర్ ఫేసే. ఫేమస్సే.
దక్షిణాదిలో హిట్టయిన ఈ గోవా అమ్మాయి...
ఆరేళ్ళ క్రితం హిందీకెళ్ళాక మనకు కాస్తంత దూరమైంది.
కొత్త హిందీ చిత్రం 'రైడ్'తో తాజాగా పలకరించిన
ఇలియానాను కదిలిస్తే బోలెడన్ని కబుర్లు...

అది కెరీర్‌కు దెబ్బ!

ఫలానా సినిమాలో మీది చిన్న పాత్ర కదా! ఎందుకని ఒప్పుకున్నారు? అని మా లాంటి సినిమా తారలను తరచూ ఓ ప్రశ్న అడుగుతుంటారు. నిజం చెప్పాలంటే, పాత్ర నిడివి ఎంత అనే దాని కన్నా ఆ పాత్ర కథలో ఎంత కీలకం, దానికి ఎంత పేరు వస్తుందన్నవే ముఖ్యం. నేనైతే ఆ దృష్టిలోనే చూస్తాను.

అది శుద్ధ తప్పు...

నన్నడిగితే, సినిమాలో తెర మీద మూడు గంటల పైగా కనిపిస్తే తప్ప, జనం దృష్టిని ఆకర్షించలేమనుకుంటే శుద్ధ తప్పు. తాజాగా రాజ్‌కుమార్ గుప్తా దర్శకత్వంలో నటించిన 'రైడ్' నేను తెరపై కనిపించేది కాసేపే! కాకపోతే, 1980ల నాటి మహిళగా కనిపించా. కథకు కీలక పాత్ర అది. పాత్ర నిడివిని బట్టి నా కెరీర్ ఆధారపడి ఉందని నేనెప్పుడూ అనుకోను. అలాగే, గలగలా మాట్లాడుతూ బబ్లీగా, అందంగా ఉండే పాత్రలు నాకు తరచూ వస్తుంటాయి. అది చూసి, కొంతమంది వచ్చి, 'మీరెంత బాగున్నారో' అంటారు. కానీ, నా దృష్టిలో నా కన్నా చిన్న పిలక జుట్టుతో కనిపించే మూడేళ్ళ వయసు పాపలు చాలా అందంగా ఉంటారనిపిస్తుంది.

ఎప్పుడూ పెద్ద రిస్కే

'రైడ్' సినిమా షూటింగ్ చివరకు వచ్చినప్పుడు మా దర్శకుడు నాతో మాట్లాడుతూ, నేను మహిళా ప్రధాన చిత్రాలు చేస్తే బాగుంటుందన్నారు. నాకు గతంలో కూడా మహిళా ప్రధాన చిత్రాలు వచ్చాయి. పాకిస్తానీయుడితో ప్రేమలో పడ్డ భారత యువతి ఉజ్మా అహ్మద్ బయోపిక్ చేయమని ఆ మధ్య నన్నడిగారు. అయితే, అవునన్నా, కాదన్నా... మన చిత్రసీమలో పురుషాధిక్యం ఎక్కువ. పైగా, ఇక్కడ ఎలాంటి సినిమాలైతే వ్యాపారం జరుగుతుంది, జనాదరణ పొందుతాయనే లెక్కలూ ఎక్కువే. కాబట్టి, మహిళా ప్రధాన చిత్రం చేయడమనేది ఎప్పుడూ పెద్ద రిస్కే.

ఛాన్స్ వదిలేశాక బాధపడను!

హిందీలో నా కెరీర్‌కు 'బర్ఫీ' చిత్రంతో మంచి లాంచింగ్ ప్యాడ్ దొరికింది. అయితే, దాన్ని ఆసరాగా చేసుకొని, ఆ తరువాత అంతే ఉత్సాహంతో ముందుకు సాగలేదని విశ్లేషకులు అంటూ ఉంటారు. కానీ, జీవితంలోనైనా, కెరీర్‌లోనైనా... 'అలా కాకుండా, ఇలా జరిగి ఉంటే...' అనే ఆలోచనకు అర్థం లేదు. నేను ఏదైనా సినిమా అవకాశం వదిలేశాననుకోండి.. దాన్ని మరొక నటి అందిపుచ్చుకొని, ఆమె కెరీర్ ఒక్కదెబ్బతో శిఖరాగ్రానికి చేరుకొని ఉండవచ్చు. అది చూసి, 'అరెరే... మంచి ఛాన్స్ వదిలేశానే' అని బాధపడడం నాకు అలవాటు లేదు.

అన్నీ గమనిస్తుండాలి

ఇన్నేళ్ళ కెరీర్‌లో దక్షిణాదిలో, ఉత్తరాదిలో వివిధ భాషల సినీ పరిశ్రమల్లో పనిచేశా. నేను నేర్చుకున్నది ఏమిటంటే, సెట్‌లో ఉండగా ప్రతిదీ చాలా జాగ్రత్తగా గమనిస్తుండాలి. ప్రతిదీ శ్రద్ధగా తెలుసుకోవాలి. నిజానికి, సెట్‌లో అనేకం జరుగుతూ ఉంటాయి. మనసులో కాస్తంత ఆందోళనగా ఉంటాం. అలాంటి సందర్భాల్లో తదేక దృష్టితో ఉండడం కష్టం కావచ్చు. పైగా సెట్‌లో మనం చేసే ప్రతిదీ అందరూ చూస్తుంటారు. కాబట్టి, శారీరకంగా, మానసికంగా మన దృష్టి అంతా అక్కడే పెట్టాలి. ఏ రంగంలోనైనా మనకంటూ ఓ ప్రత్యేకత, గౌరవం సంపాదించుకోవాలంటే అది తప్పనిసరి.

ఇదేమీ పూలపాన్పు కాదు...

నా దృష్టిలో సినిమా రంగమనేది అందరికీ సరిపోయేది కాదు. ఇక్కడ పైకి రావాలంటే ఏం చేయాలనడానికి ప్రత్యేకించి పుస్తకాలూ, పద్ధతులూ ఏమీ ఉండవు. సరైన సమయంలో, సరైన చోట ఉండడం కూడా చాలా ముఖ్యం. నేను సినిమాల్లోకి వచ్చినప్పటికీ, ఇప్పటికీ పరిస్థితి చాలా మారింది. అప్పటి కన్నా ఇప్పుడు మరింత పోటీ పెరిగింది. కాబట్టి, సినిమా రంగంలోకి రావాలనుకొనేవాళ్ళు ఎన్ని కష్టనష్టాలకైనా, ఊహించనిది ఎదుర్కోడానికైనా సిద్ధమవ్వాలి. ఈ జీవితం, కెరీర్ పూలపాన్పేమీ కాదు. ఇక్కడ ఎవరూ ఎవరినీ పెద్దగా మెచ్చుకోరు. మీకు మీరే ఛీర్ లీడర్. ఎందుకంటే, కెమేరా వెనుక ఏం జరిగింది, మనం ఎంత కష్టపడ్డామన్నది ఎవరికీ అవసరం లేదు.

మళ్ళీ బాధ పడకూడదనే...

సినిమా పరిశ్రమ ప్రతి ఒక్కరినీ ఒంటరిని చేసేస్తుంది. అది ఏదో ఒక దశలో జరుగుతుంది. అందుకే, ఈ రంగానికి చెందిన చాలామంది తాము ఒంటరివాళ్ళమనీ, నైరాశ్యంలో మునిగిపోయామనీ అంటూ ఉంటారు. నిజం చెప్పాలంటే, అసలు మనం ఏం కోరుకుంటున్నాం అన్నదాన్నిబట్టి ఇదంతా ఉంటుంది. మధ్యలో ఒక నెల గ్యాప్ తీసుకొని, ఇంటికి వెళ్ళి మా కుటుంబ సభ్యులతో గడిపితే, అది కెరీర్‌కు దెబ్బే కావచ్చు. కానీ, నేను మాత్రం అదే చేస్తా. ఎందుకంటే, ఇటు వృత్తి జీవితానికీ, అటు వ్యక్తిగత జీవితానికీ మధ్య సమతూకం సాధించడం చాలా ముఖ్యం. లేదంటే, ఈ పైపై మెరుగుల రంగుల ప్రపంచంలో మనల్ని మనం కోల్పోయే ప్రమాదం ఉంది. ఓ రెండు, మూడేళ్ళయ్యాక వెనక్కి తిరిగి చూసుకొని, ఫలానా సినిమా చేస్తుండడం వల్ల కుటుంబంతో తగినంత సమయం గడపలేదే అని బాధపడకూడదు.

ఆ సంగతి వాళ్ళకెందుకు?

వ్యక్తిగత జీవితం విషయానికొస్తే, ఆండ్రూ నీబోన్ (ఇలియానా బాయ్ ఫ్రెండ్)నూ, నన్నూ కలిపి బోలెడన్ని వార్తలు రాస్తూ ఉంటారు. నా దగ్గరకు ఆండ్రూ వచ్చిన మొదటిసారి జనం మమ్మల్ని అవార్డు షోలలో చూశారు. మేమిద్దరం కలిసున్నామా అని అడిగారు. అతనితో ఉండడం నాకు సంతోషంగా ఉందని చెప్పా. ఆ తరువాత అతని పనికి అతను వెళ్ళిపోవాల్సి వచ్చింది. అంతే... 'ఇలియానా స్వర్గంలో సమస్య తలెత్తిందా' అంటూ రకరకాల వార్తలు వచ్చేశాయి. నన్నడిగితే, మా వ్యక్తిగత జీవితంలో సమస్య వచ్చిందా, రాలేదా అన్నది అవతలివాళ్ళకు ఎందుకు? నేనెప్పుడూ నా వ్యక్తిగత జీవితం గురించి అందరితో చర్చించడం ఇష్టపడను.



స్ఫూర్తి

ఒక డాక్టర్ నిర్లక్ష్యం ఆ అమ్మాయి కలలను చెరిపేసింది... ఒక డాక్టర్ అలసత్వం ఆ అమ్మాయి జీవితాన్ని ఛిన్నాభిన్నం చేసింది... ఆ కుటుంబానికి జీవితాంతం తీరని బాధను మిగిల్చింది... కానీ ఆ నిర్లక్ష్యం, అలసత్వం, లెక్కలేనితనంపై ఆ అమ్మాయి, ఆమె కుటుంబం పోరాడి గెలిచింది. ఆ డాక్టర్ నుంచి నష్టపరిహారం రాబట్టుకోవడానికి చేసిన సుదీర్ఘ న్యాయపోరాటం ఆమెలో కొత్త శక్తిని నింపింది. డాక్టర్ నిర్లక్ష్యం వల్ల కాలు తీసేసినా ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తోంది. ఆ సాహసి పేరు మాలపాటి సృజన. ఆమె అ'సామాన్య' పోరాటం ఆమె మాటల్లోనే...

అన్యాయంపై నిలిచి గెలిచింది!





"మాది నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం ముదిగేడు గ్రామం. నా తల్లిదండ్రులు శ్రీనివాసులురెడ్డి, నాగలక్ష్మమ్మలు వ్యవసాయ కూలీలు. పదో తరగతి వరకు మా ఊరిలోనే చదువుకున్న నేను ఇంటర్ కోసం పొదలకూరుకు ఆటోలో వెళ్ళి వస్తూ ఉండేదాన్ని. రోజులానే ఆ రోజు (2014 నవంబర్ 5న) కూడా కాలేజీ ముగించుకొని ఇంటికి బయలుదేరాను. మరో పది నిముషాల్లో ఇంటికి చేరుతాననగా నేను ప్రయాణిస్తున్న ఆటో ప్రమాదానికి గురైంది. అందులోని ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే చనిపోగా నాకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే మా కుటుంబ సభ్యులు నన్ను నెల్లూరులోని విజయ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్ ఆపరేషన్ చేసి పర్వాలేదని చెప్పారు. కానీ కాలు వాపు ఏర్పడడంతో పాటు తీవ్ర నొప్పి రావడం మొదలైంది. నొప్పి భరించలేకపోవడంతో రెండోసారి ఆపరేషన్ చేశారు. ఆ తర్వాత కూడా నొప్పి తగ్గలేదు. తట్టుకోలేకపోయా. నా బాధను చూడలేక మా కుటుంబ సభ్యులు నన్ను చెన్నైలోని విజయ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

అక్కడ ప్రముఖ వైద్యులు, తెలుగువారైనా డాక్టర్ రాజశేఖర్ నన్ను పరీక్షించారు. వైద్యం సరిగా అందలేదని, కాలుకు ఇన్‌ఫెక్షన్ సోకిందని తేల్చారు. వెంటనే మోకాలు వరకు కాలు తీసేయకపోతే ఇన్‌ఫెక్షన్ సోకుతుందని, ప్రాణానికే ప్రమాదం ఉందని చెప్పారు. ఆపరేషన్ జరిగిన ఒక రోజు తర్వాత నేను స్పృహలోకి వచ్చాను. కాలు లేదనే విషయం తెలిసి తట్టుకోలేకపోయాను. అయితే అదృష్టవశాత్తూ నా చేతికి ఏమీ కాలేదు.

మొత్తానికి ఒక డాక్టర్ నిర్లక్ష్యం నన్ను, నా కుటుంబాన్ని జీవితాంతం బాధపడేలా చేసింది. అలా మరొకరికి జరగకూడదన్న ఉద్దేశ్యంతో ఆ డాక్టర్‌పై పోరాడేందుకు నిర్ణయించుకున్నాం. నెల్లూరు వినియోగదారుల ఫోరంలో కేసు వేశాం. ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్న పత్రాలు, చెన్నైలో డాక్టర్లు ఇచ్చిన సర్టిఫికెట్ల ఆధారంగా కేసు నమోదు చేశారు. కేసు సుమారు రెండేళ్ళ పాటు నడిచింది. నాకు జరిగిన అన్యాయాన్ని గుర్తించిన ఫోరం తుది తీర్పునిచ్చింది. నా కాలు పోవడానికి డాక్టర్ నిర్లక్ష్యమే కారణమని తేల్చిన ఫోరం ఆ డాక్టర్‌కు 19 లక్షల 50 వేల రూపాయాలను జరిమానాగా విధించింది. ఖర్చుల కింద మరో రూ.40 వేలు చెల్లించాలని పేర్కొంది. ఈ మొత్తాన్ని 12 శాతం వడ్డీతో చెల్లించాలని తీర్పు చెప్పింది. ఒక వేళ డాక్టర్ అప్పీలుకు వెళ్లాలనుకున్నా ముందుగా యాభై శాతం మొత్తాన్ని చెల్లించాల్సిందేనని స్పష్టం చేసింది. గత నాలుగేళ్ల నుంచి కుమిలిపోతున్న నాకు, నా కుటుంబానికి ఈ తీర్పు కొంత ఊరటనిచ్చింది. నా వైద్య ఖర్చులతో కుటుంబం అప్పుల పాలైంది. అన్యాయం జరిగితే భయపడి, మిన్నకుండిపోవాల్సిన అవసరం లేదు. ఎంతటి వారిపైనైనా పోరాడవచ్చు. పోరాడితే కచ్చితంగా విజయం దక్కుతుంది. అప్పుడే మరొకరికి అటువంటి అన్యాయం జరగకుండా ఉంటుంది. నాలాగా మరొకరు బాధపడకూడదని కోరుకుంటున్నా.

• **ఉప్పు అమరేంద్ర,** నెల్లూరు, **ఫోటోలు**: రావుల పెంచలయ్య

అధైర్యపడాల్సిన అవసరం లేదు..

ఏదైనా ఎదురు దెబ్బ తగిలినప్పుడు అధైర్యపడాల్సిన అవసరం లేదని తెలుసుకున్నా. నా కాలు తీసేసినప్పుడు నేను అనుభవించిన బాధ అంతా ఇంతా కాదు. ఒక్కసారిగా నా కలలన్నీ తల్లకిందులయ్యాయి. కానీ నా తల్లిదండ్రులు, బంధువులు నాకు మనోధైర్యాన్ని అందించారు. చెన్నైలో నాకు కృత్రిమ కాలు పెట్టించారు. వారి ప్రోత్సాహంతో ఇంటర్ పూర్తి చేసిన అనంతరం టీటీసీ (టీచర్ ట్రైనింగ్ కోర్సు)లో చేరాను. ప్రస్తుతం టీటీసీ రెండో సంవత్సరం చదువుతున్నా. టీటీసీ పూర్తయిన తర్వాత డీఎస్సీ రాసి, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో ముందుకెళుతున్నా.

శ్రీశక్తి

పేదరికం ఆమెలో పట్టుదలను నింపింది. అవకాశాల కోసం ఎదురుచూడకుండా వాటిని అందిపుచ్చుకున్నప్పుడే విజయం సాధించవచ్చని గ్రహించింది. ప్లాస్టిక్‌ను పారద్రోలాలని సింగరేణి సంస్థ ఇచ్చిన పిలుపు తనకు అందివచ్చిన అవకాశంగా మార్చుకుంది. ప్లాస్టిక్ స్థానంలో పేపర్, జూట్‌తో అనేక రకాల గృహోపకరణ, వినియోగ వస్తులు తయారుచేసి... పల్లె నుంచి విదేశాలకు వాటిని ఎగుమతిచేస్తూ మహిళా పారిశ్రామిక వేత్తగా రాణిస్తున్నారు పద్మావతి. 'రుక్మిణి ఖాదీ ఎంపోరియం పేపర్ అండ్ జూట్ బ్యాగ్స్' ద్వారా ఎందరికో ఉపాధిని కల్పిస్తున్న పద్మావతి పరి'శ్రమ' ముచ్చట్లు ఆమె మాటల్లోనే...





దినపత్రిక ఆమె దినచర్యను మార్చేసింది!

మాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలోని రేపల్లెవాడ. అమ్మ వెంకటరమణమ్మ గృహిణి, నాన్న తిరుపతయ్య ప్రైవేటు పాఠశాలలో హిందీ పండితుడిగా ఉద్యోగం చేశారు. నాన్నకు వచ్చే చాలీచాలని జీతంతోనే బతుకుబండి ఈడ్చేవాళ్లం. అష్టకష్టాలు పడి ఇంటర్ వరకు చదివాను. ఆ తర్వాత చదివించే స్థోమత లేకపోవడంతో పెళ్లిచేశారు. నా భర్త సింగరేణి కార్మికుడు. ఇద్దరు పిల్లలతో సాధారణ గృహిణిగా జీవితాన్ని కొనసాగిస్తున్న నాకు ఒకరోజు ఉదయమే ఒక ఆలోచన తళుక్కున మెరిసింది. ఇంటికి వచ్చే న్యూస్‌పేపర్ని చదివిన తర్వాత పక్కన పడేయడం... నెలరోజుల తర్వాత చిత్తుకాగితాల వారికి అమ్మడం... ఎందుకో నచ్చలేదు. అందుకే వాటిని చిన్న చిన్న కవర్స్ (క్యారీ బ్యాగులు)గా తయారు చేసి సమీపంలోని మెడికల్, కిరాణాషాపులకు సరఫరా చేశాను. ఆదాయం బాగుండటంతో ఉత్సాహం వచ్చింది.

'సింగరేణి'లో శిక్షణ ...

సరిగ్గా అదే సమయంలో సింగరేణి సంస్థ పర్యావరణ పరిరక్షణ కోసం 'ప్లాస్టిక్‌ను పారద్రోలుదాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం' అనే కార్యక్రమాన్ని చేపట్టింది. సింగరేణి కుటుంబీకులకు పేపరు, జూట్ బ్యాగుల ఉత్పత్తులపై శిక్షణ తరగతులను నిర్వహించింది. అందులో భాగంగా కొత్తగూడెం నుంచి 35మంది మహిళలను హైదరాబాద్‌కు తీసుకెళ్లి వారం రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ఈ శిక్షణ తరగతులను నేను అందివచ్చిన అవకాశంగా సద్వినియోగం చేసుకున్నా. సొంతంగా పేపరుబ్యాగ్స్ తయారీకి శ్రీకారం చుట్టాను. 2010లో కొత్తగూడెంలో సింగరేణి సంస్థ కేటాయించిన స్థలంలో పేపర్, జూట్‌బ్యాగు పరిశ్రమను స్థాపించి మహిళలకు ఉపాధి కల్పిస్తూ జూట్ ఉత్పత్తులను భారీ ఎత్తున తయారుచేయడం మొదలెట్టాను.

ఇంతింతై...

పర్యావరణ హితంగా ఉండే జూట్‌బ్యాగులు, పేపర్‌బ్యాగులకు ఆదరణ బాగుండటంతో... 2011లో 'రుక్మిణీ ఖాదీ ఎంపోరియం' పేరిట హైదరాబాద్ మాసాబ్‌ట్యాంకు సమీపంలో మరో పరిశ్రమను స్థాపించాను. మా జూట్ ఉత్పత్తులు తెలంగాణ, ఆంధ్రరాష్ట్రాలకే పరిమితం కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎగుమతి కావడం విశేషం. ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్స్‌ను పొందుతూ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నాం. వెడ్డింగ్ కార్డులు, హ్యాండ్ బ్యాగ్స్, షో కేస్ ఐటెమ్స్, ఫ్లవర్ బొకేస్, శారీ బాక్సెస్, బ్యాంగిల్స్, ఇయర్ రింగ్స్ వంటివాటిని ఆర్డర్ చేసిన వెంటనే వినియోగదారులకు అందిస్తాం.

దివ్యాంగులకు శిక్షణ...

ఎనిమిదేళ్ల క్రితం కేవలం 10 మందితో ప్రారంభమైన ఈ పరిశ్రమలో ప్రస్తుతం ప్రత్యక్షంగా, పరోక్షంగా 150 నుంచి 200 మంది ఉపాధి పొందుతున్నారు. వీరిలో దివ్యాంగులు కూడా ఉన్నారు. దివ్యాంగుల ఆశ్రమంలో ఉన్న వారికి పేపర్, జూట్ మెటీరియల్‌లతో ఆకర్షణీయమైన గృహోపకరణ ఉత్పత్తులను తయారు చేయడంలో శిక్షణ ఇస్తూ వారికి ఉపాధి కల్పిస్తున్నాను. కేవలం వ్యాపారం, లాభాలే లెక్కలేసుకోకుండా నాకు వీలైనంత సమాజ సేవ చేస్తున్నా. చంద్రుగొండ మండల పరిధిలోని రేపల్లె గ్రామంలో మంచినీటి ట్యాంకును నిర్మించా. సుజాతనగర్ మండల పరిధిలోని రాఘవాపురం ప్రాంతంలో గల లక్ష్మీ ఆలయంలో మరో మంచినీటి ట్యాంకు నిర్మాణం చేపట్టి ఆ ప్రాంత ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషిచేస్తున్నా. ప్రతి ఏడాది మా తండ్రి జ్ఞాపకార్థం 10వతరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పెన్నులు పరీక్షా ప్యాడ్స్‌ను అందిస్తున్నా. వ్యాపారంలో ఎంత సంపాదించామన్నది ముఖ్యం కాదు... జీవితంలో ఎంతమందికి సాయం చేస్తున్నామన్నది కూడా ముఖ్యమే. నేను చేస్తున్న సేవ పిసరంతే కావొచ్చు కానీ అది నాకు ఎనలేని ఆత్మసంతృప్తినిస్తుంది.

• **జోగం తారకరామారావు**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సమ్మర్ జ్యూస్

ఢిల్లీ స్టైయిల్ కోల్డ్ కాఫీ

కాఫీ చుక్క నోట్లో పడకపోతే ఏదోలా ఉంటుంది కాఫీ ప్రియులకు. కానీ వేసవి కాలంలో వేడి ఒక పక్క చంపేస్తుంటే వేడి వేడి కాఫీ ఏం తాగేదెలా అని ఆలోచిస్తుంటారు. అలాంటి వాళ్ల కోసం ఈ కోల్డ్ కాఫీ. దీని తయారీకి ఎంతో సమయం కూడా పట్టదు.

కావలసినవి:

మీగడ తీయని పాలు - రెండు గ్లాసులు (చిల్డ్), ఇన్‌స్టంట్ కాఫీ పొడి - రెండు టీస్పూన్లు, పంచదార - రుచికి తగినంత, క్రష్డ్ ఐస్ - అర గ్లాసు.

తయారీ:

❖ అన్ని పదార్థాలను బ్లెండర్‌లో వేసి అవన్నీ బాగా కలిసి పోయే వరకు విస్క్ చేయాలి.

❖ తరువాత పొడవాటి గాజు గ్లాసులో ఈ మిశ్రమాన్ని పోసి స్ట్రా వేసుకుని తాగేయాలి.

❖ ఎంత సింపుల్ కదా వ ంరిం కెం ద ు కా ల స్యం ఎంజాయ్ ద కాఫీ టేస్ట్ విత వుట్ మిస్సింగ్ ఇట్.



పేరెంటింగ్

పిల్లల శక్తి పెంచాలి!

రెక్కలు ముక్కలు చేసుకుంటేనే అని కాదు, చదవడానికీ, రాయడానికీ ఖర్చయ్యే శక్తి కూడా తక్కువేమీ కాదు. మామూలు రోజుల్లోకన్నా పరీక్షల వేళల్లో ఈ ప్రక్రియలు చాలా ఎక్కువగా ఉంటాయి. అందుకే పిల్లలు రోజు రోజుకీ బాగా బలహీనపడిపోతుంటారు. అయితే ఈ వేళల్లో ఎక్కువగా చదవడం, రాయడమే కాదు, వీటి వెనుక దిగులూ, ఆందోళనలు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవన్నీ కలిసి శారీరకంగా, మానసికంగా పిల్లల్ని బాగా కుంగదీస్తుంటాయి. పరీక్షల వేళల్లో నిద్ర బాగా తగ్గిపోతుంది కాబట్టి సహజంగానే ఆకలి కూడా తగ్గిపోతుంది. శరీరం బాగా నీరసించిపోయి, తినే విషయంలో శ్రద్ధా ఉండదు, ఆసక్తీ ఉండదు. మరింత ఎక్కువ శక్తి అవసరమైన రోజుల్లో సాధారణంకన్నా తగ్గిస్తే మొదటి పరీక్ష రాసిన రోజున ఉన్నంత చలాకీగా, రెండవ పరీక్ష నాటికి ఉండరు. ఆ తేడాలను ఎప్పటికప్పుడు గమనించకపోతే అవసరమైన చర్యలు చేపట్టలేం. ఈ స్థితిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచే మాటలు చెప్పడంతో పాటు, వాళ్లకు ఎక్కువ శక్తినిచ్చే ఆహారపానీయాలు ఇస్తూ ఉండాలి. శారీరకంగా, మానసికంగా బాగా కుంగిపోయిన పిల్లలు ఘనాహారం పట్ల ఆసక్తి చూపరు. అందుకే ద్రవపదార్థాలే ఎక్కువగా ఇవ్వాలి. పండ్లరసాలు, పాలు, మజ్జిగ లాంటివే ఎక్కువగా ఇవ్వాలి. ఒకవేళ ఘనాహారమే ఇచ్చినా పిల్లలు అమితంగా ఇష్టపడేవి ఇవ్వాలి. స్వీట్స్‌లో మెదడు చురుకుదనాన్ని పెంచే అంశాలు ఉన్నాయి. అందుకే రోజుకు ఒకటి రెండు సార్లు ఒకటి రెండు పీసెస్ ఇవ్వడం మంచిదే.





మీ స్మార్ట్‌ఫోన్ మిమ్మల్ని అర్థం చేసుకుంటుంది. మీ మూడ్‌ను పసిగడుతుంది. మీరేం కోరుకుంటున్నారో తెలుసుకుంటుంది. రోజూ ఫోన్ ఉపయోగించే తీరును బట్టి మీ ప్రవర్తనను అంచనా వేసి అందుకనుగుణంగా మీకు కావాల్సిన పనులు చేసి పెడుతుంది. ఇదంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో సాధ్యం కానుంది. రాబోయే రోజుల్లో స్మార్ట్‌ఫోన్స్‌లో కృత్రిమ మేధస్సు విప్లవం సృష్టించనుంది.

సరికొత్త విప్లవం

కృత్రిమ మేధస్సు

అర్థం చేసుకుంటుంది



మీ స్నేహితుడు మిమ్మల్ని అర్థం చేసుకుంటాడో లేదో తెలియదు. కానీ మీ స్మార్ట్‌ఫోన్ మాత్రం మిమ్మల్ని బాగా అర్థం చేసుకుంటుంది. మీకేం కావాలో గుర్తిస్తుంది. ఎప్పుడు ఏది కావాలో అంచనా వేస్తుంది. మీరు ఆ పని ఎలా పూర్తి చేయాలనుకుంటున్నారో తెలుసుకుంటుంది. స్మార్ట్‌ఫోన్ ఇవన్నీ నేర్చుకోవడానికి రోజంతా మిమ్మల్ని ట్రాక్ చేస్తుంది. ప్లాన్ చేసి సమస్యలను మీకోసం పరిష్కరిస్తుంది. సెన్సర్లు, కెమెరాలు, డాటాను ఇందుకోసం ఉపయోగించుకుంటుంది. ఉదాహరణకు ఇంట్లో అందరూ ఆఫీసులకు వెళ్లగానే ఇంటిని క్లీన్ చేయమని వాక్యూమ్ బోట్‌కు సందేశాలు పంపిస్తుంది. మరో 20 నిమిషాల్లో మీరు ఇంటికి చేరుకుంటారనగా రైస్‌కుక్కర్ ఆన్ అయ్యేలా మెసేజ్ ఇస్తుంది.

చేతి స్పర్శే పాస్‌వర్డ్



పాస్‌వర్డ్‌లు పెట్టుకోవడం, వాటిని గుర్తుపెట్టుకోవడం కష్టం. పైగా అంత భద్రత కూడా ఉండదు. కానీ ఏఐ ఫీచర్‌లో సెక్యూరిటీ టెక్నాలజీ, మెషిన్ లెర్నింగ్‌తో కలిసి మీ ప్రవర్తనను అంచనా వేస్తుంది. అదే పాస్‌వర్డ్‌గానూ ఉపయోగపడుతుంది. అంటే మీ స్మార్ట్‌ఫోన్ మీ నడకను, మీరు స్వైప్ చేసే విధానాన్ని, ఫోన్ పట్టుకున్నప్పుడు పెట్టే ఒత్తిడిని గుర్తిస్తుంది. వాటి ఆధారంగానే పాస్‌వర్డ్ లేకుండానే అథంటికేషన్ యాక్టివ్ చేస్తుంది.

మానసిక స్థితిని పట్టేస్తుంది



ఎమోషన్ సెన్సింగ్ సిస్టమ్ మీ మానసిక స్థితిని, మూడ్‌ని గుర్తించి, విశ్లేషిస్తుంది. అందుకు అనుగుణంగా ఫీచర్లను సేకరించుకుని పనిచేస్తుంది.

ఉదాహరణకు కారులో వెళుతున్నప్పుడు మీ స్మార్ట్‌ఫోన్ ఫ్రంట్ కెమెరాను మీ డ్రైవర్ ఫిజికల్ కండిషన్‌ను అర్థం చేసుకోవడానికి ఉపయోగించవచ్చు. అందుకు అనుగుణంగా భద్రతా చర్యలు తీసుకోవచ్చు.

సహజ శైలిని అర్థం చేసుకుంటుంది



ఇప్పుడున్న పర్సనల్ అసిస్టెంట్స్‌ను ఉపయోగించాలంటే కచ్చితమైన కమాండ్స్ ఇవ్వాల్సి ఉంటుంది. మీ సాధారణ భాషలో మాట్లాడితే అసిస్టెంట్ అర్థం చేసుకోలేదు. కానీ ఏఐ ఉంటే మీరు మాట్లాడే భాషను రోజూ గుర్తిస్తుంది. మీ ఇంటెన్షన్‌ను అర్థం చేసుకుంటుంది. 'వాతావరణం చల్లగా ఉంది' అని మీరంటే 'ఆన్‌లైన్‌లో ఒక లెదర్ జాకెట్ ఆర్డర్ చేయాలని' లేదా 'రూమ్ టెంపరేచర్ పెంచాలని' అర్థం చేసుకుంటుంది. రియల్ టైమ్ వాయిస్ ట్రాన్స్‌లేటర్‌గానూ ఉపయోగపడుతుంది. కమాండ్స్ మీ సాధారణ శైలిలో ఇచ్చినా అర్థం చేసుకుంటుంది.

అగ్‌మెంటెడ్ రియాల్టీ



పేషెంట్‌కు సంబంధించిన సమాచారాన్ని ఫోన్ సేకరిస్తుంది. సులభంగా వ్యాధి నిర్ధారణ చేయడానికి ఈ సమాచారం డాక్టర్లకు ఉపయోగపడుతుంది. అగ్‌మెంటెడ్ రియాల్టీ ఫీచర్ల వల్ల ఇది సాధ్యమవుతుంది.

ఫోన్ పనితీరు పెరుగుతుంది



మెషిన్ లెర్నింగ్, సెన్సర్లు డివైజ్ పనితీరును పెంచుతాయి. వినియోగదారుని ప్రవర్తనను అంచనా వేసి, తరచుగా ఉపయోగించే యాప్స్‌ను క్విక్ లాంచ్‌కు సిద్ధంగా ఉంచుతుంది. ఉపయోగించని యాప్స్ షట్‌డౌన్ చేసి బ్యాటరీని, మెమొరీని సేవ్ చేస్తాయి.

సమస్త సమాచారం



స్మార్ట్‌ఫోన్ మీ బిహేవియరల్, పర్సనల్ డాటాను సేకరిస్తుంది. దాన్ని బట్టి ఆ వ్యక్తి ఎక్కడ ఉన్నాడు. ఆ టైంలో ఏం చేస్తున్నాడు వంటి వివరాలు నమోదవుతాయి. ఉదాహరణకు ఇన్సూరెన్స్ కంపెనీలు ఒక వ్యక్తి కారు డ్రైవింగ్ చేసే తీరును ఏఐ సహాయంతో విశ్లేషించి, దానికనుగుణంగా ఇన్సూరెన్స్ ప్రీమియం వేసే అవకాశం ఉంటుంది.

కంటెంట్‌ను గుర్తిస్తుంది



స్మార్ట్‌ఫోన్‌లో నిషేధించిన కంటెంట్ ఏదైనా ఉంటే ఆటోమెటిక్‌గా గుర్తిస్తుంది. నిషేధిత వీడియోలు, ఫొటోలు ఉన్నా నోటిఫికేషన్ రూపంలో అలర్ట్ చేస్తుంది. యూజర్ ఎలాంటి కంటెంట్ చూస్తున్నాడు. అది సెట్టింగ్స్‌కు లోబడి ఉందా? లేదా అనే విషయాన్ని ఏఐ ఫీచర్ గుర్తిస్తుంది.

నాణ్యమైన ఫొటోలు



ఏఐ ఫీచర్ సహాయంతో నాణ్యమైన సెల్ఫీలు దిగొచ్చు. స్కిన్ టోన్స్ మార్చుకోవచ్చు. ఫొటోలకు మెరుగులు దిద్దుకోవచ్చు. యూజర్ సౌందర్యానికి ఇచ్చే ప్రాధాన్యతను ఏఐ గుర్తిస్తుంది.

శబ్దాలు వింటుంది



స్మార్ట్‌ఫోన్ మైక్రోఫోన్ ప్రతి శబ్దాన్ని వింటుంది. అందుకు అనుగుణంగా మీకు సూచనలు ఇస్తుంది. ఉదాహరణకు రాత్రివేళ మీరు గురక పెడుతూ ఉంటే మీ స్లీపింగ్ పొజిషన్ మార్చుకొమ్మని సూచిస్తూ రిస్ట్‌బ్యాండ్‌కు ట్రిగ్గర్స్ పంపిస్తుంది.

టెక్ సందేహాలు

గూగుల్‌కే ఎందుకు?

అండ్రాయిడ్ లేటెస్ట్ వెర్షన్లు ప్రతీ ఏటా గూగుల్ ఫోన్లకే మొదట వస్తుంటాయి. మామూలు ఫోన్లకు ఎందుకు ఆలస్యం అవుతాయో తెలియజేయగలరు.

- **సురేంద్ర,** వనస్థలిపురం



గూగుల్ సంస్థ ప్రతీఏటా ఓ మేజర్ అండ్రాయిడ్ వెర్షన్ విడుదల చేస్తుంటుంది. అలాగే ఒకటి రెండు చిన్న చిన్న వెర్షన్లు రిలీజవుతాయి. గూగుల్ సంస్థ తయారు చేసే పిక్సెల్ ఫోన్లలో ఎలాంటి కస్టమైజేషన్ వాడకపోవడం వల్ల అండ్రాయిడ్ తాజ్ ఆపరేటింగ్ సిస్టమ్‌ని ఉన్నది ఉన్నట్టు ఆయా ఫోన్లలో వాడడం చాలా సులభం. అందుకే మిగతా అన్ని ఫోన్ల కన్నా మొదట గూగుల్ పిక్సెల్ ఫోన్లు అండ్రాయిడ్ లేటెస్ట్ వెర్షన్ చేత అప్‌డేట్ చేయబడతాయి. ఇక శాంసంగ్, ఎల్‌జీ, షియోమీ, ఒన్‌ప్లస్ వంటి ఇతర కంపెనీల విషయానికొస్తే అండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టంను తమ ఫోన్ మోడళ్లకు తగ్గట్టు కస్టమైజ్ చేసి, యూజర్ ఇంటర్‌ఫేస్‌ని మార్చి విడుదల చేయడానికి చాలా సమయం పడుతుంది. అందుకే ఇతర కంపెనీల ఫోన్లకు ఆలస్యంగా అప్‌డేట్లు వస్తుంటాయి.

డాటాను తిరిగి పొందవచ్చా?

నా ఫోన్ స్క్రీన్ పగిలిపోయింది. కొత్త ఫోన్ కొనాలనుకోవడం వల్ల పాత దాని స్క్రీన్ మార్చడం ఇష్టం లేదు. పాత ఫోన్లోని ముఖ్యమైన డేటాని తిరిగి పొందడానికి ఏమైనా అవకాశం ఉందా?

- **విజయశేఖర్,** ఖమ్మం




కేవలం స్క్రీన్ మాత్రమే పాడైనప్పుడు మీ ఫోన్‌ని డేటా కేబుల్ ద్వారా కంప్యూటర్‌కి కనెక్ట్ చేసినట్లయితే అందులో ఇంటర్నల్ స్టోరేజ్ కూడా కనిపిస్తుంది. ఒకవేళ ఏ కారణం చేతైనా ఈ ప్రయత్నం మీకు సక్సెస్ కాకపోయినట్లయితే సర్వీస్ సెంటర్‌కి తీసుకెళ్లడం ద్వారా గానీ, డేటా రికవరీ సర్వీసుల వారిని సంప్రదించడం ద్వారా మీ ఫోన్లో నిక్షిప్తం చేయబడి ఉండే ఫ్లాష్ మెమరీ చిప్‌ని వివిధ పద్ధతుల్లో వారి కంప్యూటర్‌కి కనెక్ట్ చేసి దానినుండి డేటాని రికవర్ చేయడానికి ప్రయత్నిస్తారు. అయితే డేటా రికవరీకి భారీ మొత్తంలో ఖర్చు పెట్టవలసి ఉంటుంది. దానికన్నా ఫోన్ సక్రమంగా ఉన్నప్పుడు ఎప్పటికప్పుడు మన ముఖ్యమైన డేటాని గూగుల్ డ్రైవ్, డ్రాప్‌బాక్స్ వంటి క్లౌడ్ స్టోరేజ్ సర్వీసుల్లోకి బ్యాకప్ తీసుకుంటే మంచిది.

ఆ యాప్స్ వల్ల ఇబ్బందా?

అండ్రాయిడ్ ఫోన్లో వీడియోలను కూడా వాల్ పేపర్లుగా సెట్ చేసుకోవడానికి కొన్ని అప్లికేషన్లు ఉన్నాయి కదా. వీటిని వాడటం వలన ఏదైనా ఇబ్బంది ఉంటుందా?

- **రమణ,** తాడేపల్లిగూడెం



వీడియోలను, జిఫ్ యానిమేషన్లను, ఇంకా చెప్పాలంటే నేరుగా గూగుల్ ప్లేస్టోర్‌లోనే లభించే లైవ్ వాల్‌పేపర్లని ఫోన్ వాల్ పేపర్లుగా అమర్చుకోవచ్చు. అయితే కదలకుండా స్థిరంగా ఉండే వాల్‌పేపర్లకీ, వీడియో వాల్‌పేపర్లకీ చాలా వ్యత్యాసం ఉంటుంది. వీడియో వాల్‌పేపర్లు ఎప్పుడూ పూర్తి రిజల్యూషన్‌లో కనిపించవు. అలాగే ప్రతీ సెకనుకీ అనేక ఫ్రేముల చొప్పున మారుతూ ఉండాలి కాబట్టి భారీ మొత్తంలో ర్యామ్, ప్రాసెసర్, బ్యాటరీ వంటి సిస్టమ్ వనరులను ఈ వీడియో వాల్‌పేపర్లు ఖర్చు చేస్తుంటాయి. ఫోన్ పనితీరు కూడా నెమ్మదించినట్లు స్పష్టంగా అర్థమవుతుంది. అందుకే వీలైనంతవరకు మామూలు ఫోటోలను వాల్ పేపర్లుగా అమర్చుకోవడం మంచిది.

మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం navya@andhrajyothy.com

ట్రై చేద్దామా?

అరచేతిలో కంప్యూటర్!

స్మార్ట్‌ఫోన్ ఒక్కటి చాలు... ప్రపంచాన్ని చూసేయడానికి. అయితే ఎంత ఖరీదైన స్మార్ట్‌ఫోన్ అయినా సరే, ఒక్కోసారి కంప్యూటర్ స్థానాన్ని భర్తీ చేయలేకపోవచ్చు. అదే, కంప్యూటర్ మన అరచేతిలో పట్టేంత చిన్నగా ఇమిడిపోతే... భలే ఉంటుంది కదూ! ఇప్పుడీ మినీ కంప్యూటర్లు త్వరలోనే మన మార్కెట్లోకి అడుగుపెట్టనున్నాయి. వీటిని రూపొందించిన తైవాన్‌కు చెందిన ఎలైట్ కంప్యూటర్ సిస్టమ్స్ సంస్థ ఇటీవల ఈ విషయాన్ని ప్రకటించింది. దీని పేరు 'లివా క్యూ'.

స్పెసిఫికేషన్స్



ర్యామ్: 4జీబీఇంటర్నెల్ స్టోరేజీ: 64 జీబీ. ఇంటెల్ అపోలో ప్రాసెసర్‌తో రూపొందిన ఈ బుల్లి కంప్యూటర్‌లో వైఫై, మెమొరీ కార్డు (128జీబీ) సదుపాయాలతో పాటు రెండు యూఎస్‌బి పోర్టు లుంటాయి. హెచ్‌డీఎమ్‌ఐ పోర్ట్‌తో స్మార్ట్ టీవీకి కూడా కనెక్ట్ చేసుకోవచ్చు. 4కె రిజల్యూషన్‌లో సినిమాలు కూడా వీక్షించవచ్చు. ఒక విండోస్ 10 ఓఎస్‌తో ఈ మినీ కంప్యూటర్‌ను కొనుగోలు చేయాలంటే ధర రూ 15000. ఓఎస్ లేకుండా అయితే రూ 13,500.

నయా ఫీచర్

ఇక హిందీలో కూడా!



ఫోన్ మీద ఉన్న హోం బటన్‌ను క్లిక్ చేస్తే చాలు... 'హా కెన్ ఐ హెల్ప్ యు?' అంటూ గూగుల్ అసిస్టెంట్ ఆంగ్లంలో చక్కగా పలకరిస్తుంది. ఏం కావాలన్నా నేరాగా అడిగితే చాలు. వెంటనే సమాధానం చెప్పేస్తుంది అసిస్టెంట్. అదీ ఆంగ్లంలోనే. ఇప్పుడు హిందీలో ఈ పలకరింపులు వినొచ్చు. ఈ మధ్యే హిందీ భాషను గూగుల్ అసిస్టెంట్‌లో పొందుపరిచారు. అయితే ప్రశ్న అర్థం చేసుకున్నా, సమాధానం మాత్రం ఆంగ్లంలోనే చెప్పేది.

అయితే ఇప్పుడు అలా కాదు, హిందీలోనే దానితో సంభాషించవచ్చు. అయితే మీరు ముందుగా చేయాల్సిన పని ఏంటంటే, గూగుల్ అసిస్టెంట్ యాప్‌ను అప్‌డేట్ చేసుకోవడం ఆ తర్వాత ఈ యాప్‌లో ఉన్న సెట్టింగ్స్‌లో 'ఫోన్' ఆప్షన్‌ను క్లిక్ చేయండి. అందులో లాంగ్వేజ్‌ను క్లిక్ చేసి హిందీకి సెట్ చేసుకోండి. అంతే!

టెక్ డేంజర్స్

పొద్దున్నే నిద్ర లేపటానికి అలారమ్, ఆ తర్వాత వరుసపెట్టి మిత్రుల నుండి, వాట్సాప్ గ్రూపుల నుండి గుడ్ మార్నింగ్ మెసేజ్‌లు, ఇన్‌బాక్స్‌కి వచ్చే మెయిల్స్, యాప్స్ నుంచి వచ్చే నోటిఫికేషన్లు ఇలా నిరంతరం ఏదో ఒక శబ్దం ఫోన్ నుండి వినిపిస్తూనే ఉంటుంది. అలాగే స్క్రీన్ కొద్ది క్షణాలు ఆన్ అయి దానంతట అది ఆఫ్ అవుతూ ఉంటుంది. మన బిజీ జీవితాలను నిర్వహించుకోవడానికి, రిలేషన్లు మెయింటైన్ చేసుకోవడానికి ఇదంతా తప్పనిసరి అనుకుంటుండగానే వాస్తవానికి దీనివల్ల మన బ్రెయిన్ ఎంత ఇబ్బంది పడుతుందో ఎప్పుడూ ఆలోచించం కూడా!

ఇలా చీటికిమాటికి మన ఫోన్ స్క్రీన్ మీద చూపించబడే నోటిఫికేషన్లు, వచ్చే శబ్దాలు మన శరీరంలోని స్ట్రెస్ హార్మోన్లని విపరీతంగా ఉత్పత్తి చేస్తాయన్న విషయం చాలా తక్కువమందికే తెలుసు. మనకు ఏదైనా ప్రమాదం పొంచి ఉన్నప్పుడు మన హృదయ స్పందన వేగవంతం అవడంతోపాటు, ఊపిరి బిగుసుకుపోతుంది, చెమట పడుతుంది, కండరాలు బిగువవుతాయి. ఇదంతా స్ట్రెస్ లక్షణం. అంటే పరిస్థితిని ఎదుర్కోవడానికి ఫైట్ చెయ్యమని శరీరం దానంతట అది సిద్ధపడుతుందన్న మాట. ఇంత అద్భుతమైన వ్యవస్థను కేవలం ఒక వాట్సాప్ మెసేజ్ రిప్లై ఇవ్వడానికో, ఓ ఫేస్‌బుక్ నోటిఫికేషన్‌కో వృథా పరుస్తున్నాం అన్నమాట.



అప్లికేషన్లు ఇలా చేస్తున్నాయి

సామాజిక భద్రత కోసం నిరంతరం పాకులాడే మనిషి యొక్క ఆలోచనా విధానాన్ని మన ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకునే అప్లికేషన్లు హైజాక్ చేస్తున్నట్లు పరిశోధకులు భావిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్లు వాడే వారిలో దాదాపు ఎనభై తొమ్మిది శాతం మంది తమకు ఎలాంటి ఫోన్ కాల్ రాకపోయినా, ఎలాంటి వాట్సాప్ మెసేజ్ రాకపోయినా ఫోన్ వైబ్రేట్ అవుతున్నట్లు భ్రమకు గురవుతున్నారని వెల్లడైంది. అలాగే 86 శాతం మంది తమకు ఎలాంటి మెయిల్, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా మెసేజ్‌లు రాకపోయినా తరచూ వాటికోసం ఫోను చేతిలోకి తీసుకొని చెక్ చేసుకుంటున్నారని తెలుస్తోంది.

మల్టీ టాస్కింగ్ సాధ్యపడదు

స్మార్ట్‌ఫోన్ల మీద గడిపే చాలామంది తాము ఒకేసారి పలు పనులు చేస్తున్నట్లు భ్రాంతికి గురవుతూ ఉంటారు. ప్రపంచంలో 97.5 శాతం మంది కేవలం ఒకసారికి ఒక పని మాత్రమే చేయగలుగుతారు. అందుకే మన ఫోన్లోగానీ, కంప్యూటర్లో గానీ కొత్త నోటిఫికేషన్ వచ్చిన వెంటనే కచ్చితంగా అప్పటివరకూ మనం చేస్తున్న పనిమీద దృష్టి మళ్లుతుంది. దీంతో క్రమేపీ ఏకాగ్రత తగ్గటం, వత్తిడి పెరగడం జరుగుతూ వుంటుంది. ఒక పని నుండి మరో పనికి మనం మారినప్పుడల్లా మనకు తెలియకుండానే కార్టిసోల్ అనే స్ట్రెస్ హార్మోన్ విపరీతంగా ఉత్పత్తి అవుతుందట. అలాగే డొపమైన్ స్థాయిలు కూడా పెరుగుతూ వుంటాయి. చాలామంది యువతలో తరచూ ఫేస్‌బుక్ చెక్ చేసుకోవడం పరోక్షంగా డిప్రెషన్‌కి కారణం అవుతోందని తెలుస్తోంది. అలాగే అలాగే ఫేస్‌బుక్ లైక్‌లు, కామెంట్లకి అతిగా స్పందించటం, వాటి కోసం తాపత్రయపడటం కూడా మానసికమైన ఒత్తిడి పెంచుతోంది. తరచూ సెల్ఫీలు తీసుకోవడం, వాటిని అప్‌లోడ్ చేసి, వాటికి భారీ మొత్తంలో లైక్‌లు వస్తే తమతో పాటు ప్రపంచం ఉందన్న భావనా, ఎవరూ పెద్దగా పట్టించుకోపోతే తమతో ఎవరూ లేరనే ఆత్మన్యూనతత పెరిగిపోతున్నాయి.

అభిప్రాయాలు హైజాక్

స్మార్ట్ ఫోన్ల ద్వారా ఫేస్‌బుక్ వంటివాటిని ఎక్కువ యాక్సెస్ చేసే వారు కాలక్రమేణా తమ ఆలోచనలు, మెచ్యూరిటీ స్థాయిలకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. సోషల్ మీడియాలో రోజుకో సెన్సేషనల్ అంశం మీద మాస్ హిస్టీరియాలా జరుగుతున్న చర్చ స్థిమితంగా ఉండగలిగిన వారిని కూడా ప్రశాంతంగా ఉండనీయట్లేదు. పీర్ ప్యాక్టర్ అనే కాన్సెప్ట్ ఇక్కడ ప్రభావితం చేస్తోంది. తమ చుట్టూ ఉన్న వేలాదిమంది ఆలోచనల తగ్గట్టు తాము ఆలోచించకపోతే, తమకు కొన్ని విషయాలు అనవసరంగా అనిపించినా వాటిపై తాము స్పందించకపోతే సమాజం తమను ఆమోదించదు అనే వత్తిడికి చాలా మంది గురవుతున్నారు. అలాగే మెచ్యూరిటీ స్థాయిలు మర్చిపోయి ప్రతీ విషయంపై ఆవేశంగా స్పందించడం మెల్లగా మన వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తోంది.

జీవితంపై స్పష్టత

స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా విపరీతంగా వాడుతున్న వారు తమ ప్రయారిటీలు సెట్ చేసుకోవడం విషయంలో విఫలమవుతున్నారు. సోషల్ మీడియా ద్వారా వైరల్ అయిన ఒకటి రెండు రోజుల సెలబ్రిటీలనే ఆదర్శంగా తీసుకుంటూ దీర్ఘకాల లక్ష్యాలను విస్మరిస్తున్నారు. ఏది చేసైనా పది రోజులు సెలబ్రిటీగా ఉంటే చాలు ఇంకేమీ అవసరం లేదు అనే భావన పెరుగుతోంది.దీంతో దీర్ఘకాల లక్ష్యాలు లేక అటకెక్కుతున్నాయి.

పరిష్కారం ఏంటి?

చీటికిమాటికీ ఫోన్ చేతిలోకి తీసుకోవడం తగ్గించాలి. ఫోన్లో నోటిఫికేషన్లు డిసేబుల్ చేసుకోవాలి. అదేపనిగా ఫేస్‌బుక్ న్యూస్‌ఫీడ్ స్క్రోల్ చేసే అలవాటు తగ్గించుకోవాలి. కుదిరినప్పుడల్లా మనుషులతో బయట గడపాలి. మనం చేయాల్సిన పనుల ప్రయారిటీ సెట్ చేసుకోవాలి. వీలైనంతవరకూ రకరకాల వాట్సాప్ గ్రూపుల నుండి బయటకు రావాలి. వారానికి ఐదు రోజుల పాటైనా ఏదైనా ఫిజికల్ యాక్టివిటీ ప్లాన్ చేసుకోవాలి. ఇవన్నీ పెద్ద కష్టమేమీ కాదు. ఒకసారి మనం మన గురించి లోతుగా ఆలోచిస్తే మెల్లగా అన్నీ ఫాలో అవడం మొదలుపెడతాం. అప్పుడు ఫోన్లు, సోషల్ మీడియా విపరీతమైన వాడకం వల్ల ఇంతకాలం ఏం నష్టపోయామో స్పష్టంగా అర్థమవుతుంది.



నల్లమోతు శ్రీధర్
fb.com/nallamothusridhar

తెలుగు సాహిత్యం తిరిగి బతకడానికి విదేశీయుడైన ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ కారణం. మన భాషకి ఆయన చేసిన సేవలో లక్షో వంతయినా మనం చేస్తే చాలు. 19వ శతాబ్ది నాటికి తెలుగు రచనలు అక్కడక్కడ విసిరేసినట్లుండేవి. ఆ తాళపత్రాలకు రాతప్రతులు, ముద్రణలు సమకూర్చాడు సీపీ బ్రౌన్.

తెలుగును వెలిగించినవాడు!

లైఫ్ లెసన్



బ్రౌన్ పుట్టింది కలకత్తాలో, 1798లో. తండ్రి డేవిడ్- ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగి. బెంగాలీయుల మధ్య పెరగడం వల్ల, అప్పటికి భారత్‌లో పర్షియన్లు- అరబిక్ ప్రజలు ఉండటం వల్ల- ఈ మూడు భాషలు బ్రౌన్‌కి బాల్యం నుంచే వచ్చు. మరో వైపు గురువుల దగ్గర సంస్కృతం నేర్చుకొన్నాడు.

బ్రౌన్‌కి 14 ఏళ్ల వయసులో తండ్రి మరణించాడు. ఆయన ఉద్యోగం పిల్లలకు ఇవ్వడం ఆనాటి కంపెనీ నియమం. అందుకోసం బ్రౌన్ కొంత తర్ఫీదు పొందాలి. ఈ నిమిత్తం- తల్లి ఫ్రాన్సిస్ కౌల్‌తో కలిసి 1812లో ఇంగ్లండ్ పయనమయ్యాడు. లండన్‌లోని హెయిలీబరీ కాలేజీలో చదివాడు. తిరిగి 1817లో భారత్‌లో కాలుమోపాడు. అదనపు శిక్షణ కోసం మద్రాస్‌లోని సెయింట్ జార్జి కోట కాలేజీలో చేరాడు. అక్కడ ప్రాంతీయ భాషగా తెలుగును ఎంచుకొన్నాడు. 19 ఏళ్ల వయసులో తొలిసారి తెలుగు అక్షరాల్ని దిద్దాడు. అపురూపంగా అ...ఆలు నేర్చుకొన్నాడు. మురిసిపోయాడు. పులకించిపోయాడు. ఆనాడు బ్రౌన్‌తో అక్షరాభ్యాసం చేయించినవారు- వెలగపూడి కోదండరామయ్య.

కాలేజీ శిక్షణ పూర్తయ్యాక బ్రౌన్‌కి ఉద్యోగం వచ్చింది. తొలి పోస్టింగ్ కడపలో అసిస్టెంట్ కలెక్టర్‌గా, ఆపైన బందరు బదిలీ, ఎక్కడ పనిచేసినా ఆయన దినచర్య ఒకటే. స్థానికులకు బెంగాలీ నేర్పడం, వారి నుంచి తెలుగు నేర్చుకోవడం పుస్తకాలు విపరీతంగా చదవడం. ఇంతే! ఒకసారి ఏకంగా ఆరువారాలు సెలవుపెట్టి మచిలీపట్నం నుంచి చెన్నపట్నం వెళ్లాడు- కేవలం కొత్త పాత పుస్తకాలు తీసుకొందామని. అప్పుడు కొన్న ఓ పుస్తకం- 'హిందువుల మతాచారాలు'. దీని రచయిత ఫ్రెంచి ఉద్యోగి అబే దుబాయ్. అందులోని వేమన గురించి రాసిన విషయాలు బ్రౌన్‌ని ఆలోచింపజేశాయి. వేమన పద్యాల్ని సేకరించాలని నిశ్చయించుకొన్నాడు.

తిప్పాభట్ల వేంకటశివశాస్త్రి తొలిసారి తాళపత్రాల్లో ఉన్న వేమన పద్యాల్ని బ్రౌన్‌కి అందజేశారు. వీటిని బ్రౌన్ చదివి ఆంగ్లంలోకి తానే తర్జుమా చేయాలనుకొన్నాడు. అందుకు తెలుగు- ఆంగ్ల నిఘంటువు అవసరమైంది. అప్పటికి ఎడి క్రాంబెల్ అనే ఆంగ్లేయుడు రూపొందించిన పదకోశం ఉంది. అందులో 14,862 పదాలు మాత్రమే ఉన్నాయి. అనంతమైన తెలుగు పదాల్ని అలవోకగా వాడిన వేమన పద్యాల అనువాదానికి ఇవి సరిపోవు. దాంతో కొత్త పదాలకు ఆంగ్ల అర్థాల్ని ఇస్తూ సమాంతరంగా ఓ డిక్షనరీని రూపొందించాడు.

కొంత అనువాదం చేశాక బ్రౌన్‌కి అసంతృప్తిగా అనిపించింది.

> తిప్పాభట్ల వేంకటశివశాస్త్రి తొలిసారి తాళపత్రాల్లో ఉన్న వేమన పద్యాల్ని బ్రౌన్‌కి అందజేశారు. వీటిని బ్రౌన్ చదివి ఆంగ్లంలోకి తానే తర్జుమా చేయాలనుకొన్నాడు. అందుకు తెలుగు- ఆంగ్ల నిఘంటువు అవసరమైంది.

వేమన పద్యాలున్నది ఆటవెలది ఛందస్సులో. తనకు అప్పటికి ఛందస్సు రాదు. మరి ఎలా? వెంటనే మూడు వారాల పాటు దీక్షగా కూర్చొని తెలుగు ఛందస్సు నేర్చుకొన్నాడు. ఆ తర్వాత వేమన పద్యాల అనువాదాన్ని సంపూర్ణం చేశాడు.

ఆ పై ప్రాచీన తెలుగు కావ్యాల్ని సేకరించడం మొదలుపెట్టాడు. అప్పటికి అన్ని కావ్యాలూ తాళపత్రాల్లోనే ఉండేవి. ఇప్పటిలా జిరాక్స్‌లు, స్కానింగ్‌లూ, ప్రింట్లూ లేవు. అందుకని ఒకరి తాళపత్రం నుంచి మరొకరు నకలు రాసుకొని ఉపయోగించుకొనేవారు. అలా ఒక్కో కావ్యానికి ఒకటికి మించి నకళ్లు ఉండేవి. అయితే ఇలా చేయడం వల్ల మూలం కన్నా భిన్నమైన పాఠాంతరాలు ఉండటం సహజం. ఒక్కో కావ్యానికి ఇలా ఎన్ని నకళ్లు ఉన్నా అన్నిటినీ తెప్పించాలన్న పట్టుదల బ్రౌన్‌ది.

నెల్లూరు దగ్గర గోపరాజు సుబ్బయ్య, చిత్తూరు నుంచి కొండూరి చిదంబరం, కాకినాడ దంతలూరు జగన్నాథరాజు, మచిలీపట్నం మామిడి వెంకయ్య, కడపగజ్జలరెడ్డి, పుంగనూరు రాజా, నగరిలోని రొంపిచర్ల వెంకటరామరాజు..... ఇలా ఒకరా... ఇద్దరా!! ఎంత మందిని అర్థించాడో, అదిలించాడో, కాళ్లా వేళ్లా పడ్డాడో అంతులేదు. అప్పులు చేసి మరీ డబ్బులిచ్చి ఆయా తాళపత్ర గ్రంథాలని సేకరించాడు బ్రౌన్.

ఆ తర్వాత ఒక్కో ప్రతిని ఒక్కో పండితుడికీ ఇచ్చే వాడు. వారంతా వలయాకారంగా కూర్చోవాలి. ఒకరి తర్వాత ఒకరు ఒక్కో పద్యమూ, ఒక్కో పాదమూ చదువుకొంటూ వెళ్లాలి. ఒక్క ప్రతికీ, మరో ప్రతికి ఉన్న భేదాలు గుర్తించాలి. ఒకవేళ అవి గుర్తించలేకపోతే అర్ధరూపాయి జరిమానా. ఈ కసరత్తు పూర్తయ్యాక తుదిప్రతి సిద్ధం అయింది. దీన్ని కనకాద్రి అనే ఉద్యోగి కాగితాలపైకి ఎక్కించడం, ఆ పై ముద్రణ పూర్తి చేయడం. ఇలా 36 తెలుగు కావ్యాలను ముద్రించిన మహానుభావుడు బ్రౌన్.

ఇంకా తెలుగు వ్యాకరణం, నిఘంటువులు, ఆంధ్ర, సంస్కృత భాషల ఛందస్సు, భారతీయ శిల్ప శాస్త్రం.... ఇలా ఎన్నో రచనలు చేశాడు బ్రౌన్. పాశ్చాత్యులకు శివలింగం పట్ల ఉన్న దురభిప్రాయాల్ని తొలగిస్తూ వ్యాసం కూడా రాశాడు. పెళ్లి, పెళ్లాం, పిల్లలు లాంటి బాదరబందీలు లేకుండా రేయింబవళ్లు మన భాష కోసం జీవించిన బ్రౌన్ గురించి తెలుసుకోవడం- నేటి తెలుగువాడి కనీసం ధర్మం. ఒక విదేశీయుడే ఈ జాతికి ఇంత మేలు చేస్తే తెలుగుతల్లి సంతానంగా మనమేం చేయాలో మనకు మనమే ఆత్మవిమర్శ చేసుకొందాం!



● ఆకెళ్ల రాఘవేంద్ర

కౌన్సెలింగ్



నెలరోజులుగా జ్వరం తగ్గడం లేదు!

మా బాబుకు గత నెల రోజులుగా రోజూ జ్వరం వస్తోంది. దగ్గు, జలుబు, మూత్రంలో మంట, గొంతు నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. జ్వరంతో ఉన్నప్పుడు వణుకుతున్నాడు కూడా. శరీరం బరువు కూడా తగ్గుతోంది. ఇప్పటిదాకా స్థానిక ఆర్.ఎమ్.పి డాక్టర్ సూచించిన మందులే వేస్తూ వచ్చాం. కానీ, ప్రయోజనం కనిపించడం లేదు. బాబు సమస్య ఏమై ఉంటుంది? సరియైన పరిష్కారం చెప్పండి.

- బి. శేఖర్, చౌటుప్పల్

శరీరంలో ఇన్‌ఫెక్షన్లు బాగా పెరిగిపోయినప్పుడు, శరీరంలోని బ్యాక్టీరియా విషపదార్థాలను విడుదల చేస్తున్నప్పుడు జ్వరంతో పాటు వణుకు కూడా రావచ్చు. కాలేయం వ్యాధిగ్రస్తమై, జాండిస్ వంటి సమస్యలు మొదలైనప్పుడు కూడా ఈ లక్షణాలు కనిపిస్తాయి. లేదా క్షయ, ఆస్తమా వంటి జబ్బులు మొదలైనప్పుడు కూడా ఈ లక్షణాలు కనిపిస్తాయి. దగ్గు అనేది న్యూమోనియాలోనూ రావచ్చు. ఛాతీలో క్షయ సోకడం వల్ల కూడా ఈ సమస్యలు తలెత్తుతాయి. అయితే క్షయ అనేది శ్వాసకోశాల్లోనే వస్తుందనేమీ కాదు. క్షయ మెదడులో, సర్వైకల్ నోడ్స్‌లోనూ, పొట్టలోనూ, కిడ్నీలోనూ రావచ్చు. క్షయ కొంత మంది వెన్నెముకలోనూ (స్పాట్‌స్పైన్) రావచ్చు. ఏమైనా ఛాతీ ఎక్స్-రే, రక్తపరీక్షలు, మూత్రపరీక్షలతో పాటు కల్చర్ అండ్ సెన్సిటివిటీ పరీక్షలు, అబ్డామినల్ స్కానింగ్, మాంటోస్ పరీక్షలు చేయించాలి. క్లినికల్ పరీక్షల తర్వాత అవసరమైతే, లివర్ ఫంక్షనింగ్, కిడ్నీ ఫంక్షనింగ్ పరీక్షలు కూడా చేయించాల్సి ఉంటుంది. అయితే, మన దేశంలోని పిల్లల్లో చాలామంది న్యూమోనియా బారిన పడుతున్నారు. మీ అబ్బాయి సమస్య అదే అయినా కావచ్చు. ఏమైనా పరీక్షల రిపోర్టులను చూశాక అవసరమైన వైద్య చికిత్సలు తీసుకుంటే మీ బాబు త్వరగానే కోలుకుంటాడు.

- డాక్టర్ పి.వి సాయిప్రసాద్
కన్సల్టెంట్ పీడియాట్రిషియన్
శ్రీకృష్ణా చిల్డ్రన్ క్లినిక్, హైదరాబాద్

అధ్యయనం



మసక వెలుతురుతో మెదడుకు నష్టమే!

కళ్లు మిరుమిట్లు గొలిపే వెలుతురుతో కష్టమే గానీ, అలా అని, మసక వెలుతురుకు పరిమితమైపోతే మరింత ప్రమాదం అంటున్నారు పరిశోధకులు. రోజులో అత్యధిక సమయాన్ని మసక వెలుతురులో ఉండిపోయే ఉద్యోగులు, ఇతర వృత్తికారుల్లోని మెదడు నిర్మాణం దెబ్బతినడంతో పాటు వారి జ్ఞాపకశక్తి, గ్రహణ శక్తి బాగా తగ్గిపోయాయని వీరి పరిశోధనల్లో స్పష్టమయ్యింది. అమెరికానుంచి వచ్చే 'హిప్పో కేంపస్' అనే జర్నల్‌లో ఈ వివరాలు ప్రచురితమయ్యాయి. మానవ శరీర వ్యవస్థకు దగ్గరగా ఉండే నైల్ గ్రాస్ ర్యాట్స్ అనే ఒక ప్రత్యేక జాతికి చెందిన ఎలుకల మీద వీరు పరిశోధనలు చేస్తుంటారు. ఈ ఎలుకలు మనుషులకు మల్లే పగలంత చురుగ్గా ఉండి రాత్రిళ్లు నిద్రిస్తాయి. పరిశోధకులు ఈ ఎలుకలను కొన్ని వారాల పాటు మసక వెలుగులోనూ, కొన్ని వారాలు పూర్తి వెలుగులోనూ ఉంచి చూశారు. అయితే, మసక వెలుగులో ఉంచిన ఎలుకల్లోని జ్ఞాపకశక్తికీ, గ్రహణశక్తికీ ప్రధానమైన మెదడులోని హిప్పోకాంపస్ అనే విభాగం సామర్థ్యం 30 శాతం దాకా తగ్గిపోవడం వారు గుర్తించారు. అదే సమయంలో నిండు వెలుగులో ఉన్న ఎలుకల్లోని మెదడు శక్తి గణనీయంగా పెరిగింది. నాలుగు వారాలుగా మసక వెలుతురులో ఉన్న ఎలుకల్ని, ఆ తర్వాత నిండు వెలుతురులోకి మార్చినప్పుడు కూడా వాటి మెదడు శక్తి పెరిగింది. న్యూరాన్ల మధ్య ఆరోగ్యవంతమైన స్థితిని నిలబెట్టే న్యూరోట్రాఫిక్ ఫ్యాక్టర్లు కూడా మసక వెలుతురులో బాగా దెబ్బ తింటాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అందుకే మెదడు గ్రహణ శక్తి, జ్ఞాపకశక్తి గరిష్టస్థాయిలో ఉండడానికి చాలినంత వెలుగులో ఉండడం తప్పనిసరి అంటున్నారు శాస్త్రవేత్తలు.

నవ జీవనగీతం



నీవు లేక ... నేను లేను!

నిరంతరం జీవన ప్రవాహంలో కొట్టుకుపోతున్న వారికి, చాలాసార్లు జీవితం చాలా చిన్నదన్న విషయమే గుర్తుకు రాదు. అందుకే జీవితంలోని అమూల్యమైన వెన్నో తెలియకుండానే వాళ్ల నుంచి జారిపోతుంటాయి. ఆ తర్వాత ఎప్పుడో తెలుసుకుని 'అయ్యో ఇలా అయిపోయిందేమిటి?' అని వ్యధ చెందడమే మిగిలిపోతుంది. విశేషించి మానవజీవితంలోకెల్లా అపురూపమైన ప్రేమ జీవితం మిగతావాటికన్నా ఇంకా ఇంకా చిన్నది. అది గమనించి హృదయంలో దాన్ని ప్రతిష్ఠించుకోకపోతే అంతిమంగా పశ్చాత్తాపమే మిగులుతుంది. 2007లో విడుదలైన 'ఖోయా ఖోయా చాంద్' సినిమా కోసం స్వానంద్ కిర్కిరే రాసిన ఈ పాట ఈ మాటలే చెబుతుంది. శాంతనూ మొయిత్రా సంగీత దర్శకత్వంలో హన్సికా అయ్యర్ పాడిన తీరు ఈ పాటకు ప్రాణం పోసింది.



● ● ● ● ● ●

ఖుష్బూ సా వో మేరీ సాంసో మే బస్ జాయెగా
ఎక్ నశా సా బన్‌కే మేరీ జిందగీ పే ఛా జాయెగా
కరూఁ ఇంతెజార్, మేరా యార్ కబ్ ఆయెగా
(పరిమళంలా అతడు నా ఊపిరిలో వసిస్తాడు
ఒక మైకమై నా జీవితంలో వ్యాపిస్తాడు
ఎదురు చూస్తా... ఎపుడొస్తాడో నా ప్రియతముడు)

ప్రేమికులు దూరదూరంగా ఉంటేనేమిటి? ఒకరి హృదయంలో ఒకరు ఒక పరిమళంలా ఎప్పుడూ బసచేస్తూనే ఉంటారు. మైకం అనగానే మధువే గుర్తుకొస్తుంది చాలా మందికి. కానీ, భావోద్వేగాల ఉద్విగ్నతలో అంతకన్నా వేయింతల మత్తు ఎగిసిపడుతుంది. ప్రేమికులు ఆ మత్తులా కూడా ఒకరిలో ఒకరు వ్యాపిస్తారు. అయినా, అదేమిటో గానీ, ఒకరినొకరు ఎదురెదురుగా చూసుకుంటే తప్ప ప్రేమికులకు తృప్తి కలుగదు. ఎందుకంటే.., తనువూ... మనసూ ప్రేమ జీవితపు బొమ్మా బొరుసులే కదా!

● ● ● ● ● ●

యాదోఁ మే వో రూఠా థా, ఖ్వాబో మే మాన్ జాయెగా
బుఝ్ గయా హై శమా, ఆకే ఫిర్ జలాయెగా
కబ్ తలక్ మేరే బిన్ కహో ఉసే రహా జాయెగా
హస్నే పే హో యకీఁ తో ఇష్క్ డగ్‌మగాయెగా
కరూఁ ఇంతెజార్.... మేరా యార్ కబ్ ఆయేగా
(జ్ఞాపకాల్లో అతడు అలక బూనినా, స్వప్నాల్లో సమ్మతిస్తాడు
దీపం ఆరిపోయింది - అతడొచ్చి మళ్లీ వెలిగిస్తాడు
చెప్పండి... నేను లేకుండా అతడు ఎన్నాళ్లలా ఉండగలడు?
ప్రేయసి పైన నమ్మకమే కలిగితే ప్రేమ ఎక్కడా నిలవదు
ఎదురు చూస్తా... ఎప్పుడొస్తాడో నా ప్రియతముడు)

తనకు గుర్తున్నంత వరకు అతడు అలిగాడనేది వాస్తవం. కానీ, కలల్లో వచ్చి 'నువ్వు ఏదంటే... అదే సరి!' అంటూ సర్దిచెబుతాడు. నిజమే మరి! అతని మనసేమైనా తనకు తెలియనిదా! అతని కోపతాపాలన్నీ నీటి బుడగల్లాంటివే! నిజానికి, ప్రేమదీపం ఆరిపోవడాన్ని అతడు ఎంత మాత్రం భరించలేడు. అందుకే ప్రేమ తైలం పోసి దాన్ని మళ్లీ వెలిగిస్తాడు. తన కోసం అనే కాదు, తను లేకుండా ఉండిపోవడం అతనితో అయ్యే పనేనా? సౌందర్యం అంటే అదేదో రూపురేఖలకు సంబంధించింది అనుకుంటారు చాలా మంది. కానీ, అసలు సిసలైన సౌందర్యం ప్రేమహృదయంలో ఉంటుంది. ఒకసారి ఆ సౌందర్యాన్ని దర్శించినవాడు రంగూ రూపులకు అతీతమైన ప్రేయసీ హృదయ లోకం కోసం వెతుక్కుంటూ వస్తాడు. కాకపోతే.... వస్తాడులే అనుకుని ఆ ప్రేయసి నిర్లక్ష్యంగా ఉండిపోతుందా? అతని కోసం వేయికళ్లతో ఎదురుచూస్తూనే ఉంటుంది.

● ● ● ● ● ●

వో జుల్మీ సితమ్‌గర్ - కభీ పఛ్‌తాయెగా
యాదోఁ మే వో రూఠా థా వో ఖ్వాబో మే మాన్‌జాయెగా
ఆజా ఆజా వో దీవానే ఆజా - ఎక్ దూజే మే ఖో జాయే హమ్
దునియా మే జిత్‌నే గమ్ హై ప్యారే - హై సబ్‌సే ప్యారా మొహబ్బత్ కా గమ్
జిందగీ బేవఫా ఆజ్ హై కల్ నహీఁ
రాత్ జో ఢల్‌గయీ, తుమ్ నహీ ఔర్ హమ్ భీ నహీఁ /హస్నే పే /
(ఆ అపరాధి ఎపుడో పశ్చాత్తాపపడతాడు
జ్ఞాపకాల్లో అలిగితేనేమిటి? స్వప్నాల్లో సమ్మతిస్తాడు
రా.... ఓ పిచ్చివాడా రా.... ఒకరిలో ఒకరం కలిసిపోదాం రా!
లోకంలో ఎన్ని బాధలు ఉంటేనేమి ప్రేమికా - అన్నిటికన్నా తీయనిది ఈ ప్రేమబాధ
కరుణ లేనిదీ జీవితం, ఇవ్వాళ ఉండి రేపటికి ఉండదు
రేయి వాలిపోయింది... నువ్వు లేకపోతే నేనూ లేను)

అసలే దయలేని జీవిత మిది. ఇప్పుడున్నట్లే ఉంటుంది. రేపటికి శాశ్వతంగా కనుమరుగవుతుంది. ఇలాంటి క్షణభంగురం లాంటి ఈ జీవితంలో ఇంకా అలకలూ, ఎడబాట్లూ ఎందుకు? ఈ వంచన ధోరణి ఇలాగే కొనసాగిస్తే ఏదో ఒక రోజున తీరని పశ్చాత్తాపమే మిగులుతుంది. అందుకే, అలా ఏదీ జరక్కూడదని ఆ ప్రేమ హృదయం ఆకాశం పిక్కటిల్లేలా ఆర్తనాదం చేస్తుంది. ఓ పిచ్చివాడా! ఇక ఎంత మాత్రం కాలాన్ని వృథాచేయకుండా రారమ్మని పిలుస్తుంది. బాధలు లేనిదెక్కడ? ప్రేమలోనూ బాధలు ఉండవచ్చు కానీ, ప్రపంచంలోకెల్లా అత్యంత ప్రియమైనది, తీయనైనది ప్రేమ బాధే. ఈ మధురమైన బాధను మనమెందుకు వదులుకోవాలి? అందుకే రా రమ్మని నమ్ముకున్న రసహృదయం వేనోళ్ల స్వాగతిస్తుంది!! 'నువ్వు లేకపోతే నేనూ లేను' అంటూ మనసులోని మాట చెప్పేస్తుంది.

● బమ్మెర

మీకు మీరే డాక్టర్



గరిక... ఎంతో ఘనాపాఠి

- గరికను మెత్తగా నూరి, ఒక స్పూను మోతాదులో రోజూ రెండు పూటలా సేవిస్తే, అర్థాంతరంగా ఆగిపోయిన బహిష్టు మళ్లీ మొదలవుతుంది.
- గరిక వేళ్లను మెత్తగా నూరి, అందులో కొంచెం పసుపు కలిపి లేపనంగా వేస్తే, ఎలర్జీ, దద్దుర్లు, దురదలు, ఎగ్జిమా వంటి పలు చర్మ వ్యాధులు తగ్గిపోతాయి.
- గరిక ఆకు రసాన్ని పై పూతగా వేస్తే, గాయాలనుంచి వచ్చే రక్తస్రావం ఆగుతుంది.
- మెత్తగా నూరిన గరికె గడ్డి ముద్దను ఒక స్పూను మోతాదులో రెండు పూటలా సేవిస్తే, అర్శమొలల నుంచి వచ్చే రక్తస్రావం ఆగిపోతుంది.
- గరిక ఆకులను నీడన ఎండించి పొడిచేసి, ఒక స్పూను పొడిని అరకప్పు నీటిలో కలిపి రోజూ రెండు పూటలా సేవిస్తే కడుపులోని అల్సర్లు మానిపోతాయి.
- రెండు లీటర్ల ఆకు రసాన్ని, ఒక లీటరు కొబ్బరి నూనెలో మరిగించి ఆ నూనెను రోజూ తల మీద మర్దన చేస్తే చుండ్రు సమస్య తొలగిపోతుంది.
- గరిక ఆకును నూరి పచ్చడిగా చేసుకుని, భోజనంతో రోజూ తింటూ ఉంటే, ఒళ్లు నొప్పులు తగ్గుతాయి.
- గరిక గడ్డి కషాయంతో నోరు పుక్కిలిస్తూ ఉంటే, నోటి అల్సర్లు తగ్గిపోతాయి.
- 50 మి.లీ. గరిక గడ్డి కషాయాన్ని గానీ, 10 గ్రాముల నూరిన గరిక వేళ్ల ముద్దను గానీ, రోజూ సేవిస్తే, తెల్లబట్ట, జననాంగ సంబంధిత ఇతర వ్యాధులు నయమవుతాయి.

పేరెంటిచ్

పిల్లల శక్తి పెంచాలి!

రెక్కలు ముక్కలు చేసుకుంటేనే అని కాదు, చదవడానికీ, రాయడానికీ ఖర్చయ్యే శక్తి కూడా తక్కువేమీ కాదు. మామూలు రోజుల్లోకన్నా పరీక్షల వేళల్లో ఈ ప్రక్రియలు చాలా ఎక్కువగా ఉంటాయి. అందుకే పిల్లలు రోజురోజుకీ బాగా బలహీనపడిపోతుంటారు. అయితే ఈ వేళల్లో ఎక్కువగా చదవడం, రాయడమే కాదు, వీటి వెనుక దిగులూ, ఆందోళనలు కూడా ఎక్కువగానే ఉంటాయి. ఇవన్నీ కలిసి శారీరకంగా మానసికంగా పిల్లల్ని బాగా కుంగదీస్తుంటాయి. పరీక్షల వేళల్లో నిద్ర బాగా తగ్గిపోతుంది కాబట్టి సహజంగానే ఆకలి కూడా తగ్గిపోతుంది. శరీరం బాగా నీరసించిపోయి, తినే విషయంలో శ్రద్ధా ఉండదు, ఆసక్తీ ఉండదు, కొంత మంది పిల్లలకు తినాలంటేనే ఒక విసుగు మొదలవుతుంది. మరింత ఎక్కువ శక్తి అవసరమైన రోజుల్లో మామూలు రోజుల్లో కన్నా ఇంకా తగ్గిస్తే ఎలా ఉంటుంది? ఫలితంగా, మొదటి పరీక్ష రాసిన రోజున ఉన్నంత చలాకీగా, రెండవ పరీక్ష రాసే నాటికి ఉండరు. ఇలా పరీక్షకీ పరీక్షకీ మధ్య వాళ్ల శక్తి, ఉత్సాహం తగ్గిపోతూ ఉంటాయి. ఆ తేడాలను ఎప్పటికప్పుడు గమనించకపోతే, అందుకు అవసరమైన చర్యలు చేపట్టలేం. ఈ స్థితిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచే మాటలు చెప్పడంతో పాటు, వాళ్లకు ఎక్కువ శక్తినిచ్చే ఆహారపానీయాలు తరుచూ ఇస్తూ ఉండాలి. అయితే, శారీరకంగా, మానసికంగా బాగా కుంగిపోయిన పిల్లలు ఘనాహారం తినడం పట్ల ఆసక్తి చూపరు. అందుకే ఈ దశలో ద్రవపదార్థాలే ఎక్కువగా ఇవ్వాలి. పండ్లరసాలు, పాలు, మజ్జిగ లాంటివే ఎక్కువగా ఇవ్వాలి. ద్రవాహారంలోని విశేషం ఏమిటంటే, చాలా తొందరగా జీర్ణమై, తొందరగా శక్తినిస్తాయి. ఒకరకంగా, శారీరక, మానసిక విషయాలు వేరువేరే అయినా, శారీరక బలాన్ని పెంచడం ద్వారా మనోబలాన్నీ, మేధోబలాన్నీ పెంచవచ్చు. ఒకవేళ ఘనాహారమే ఇచ్చినా పిల్లలు అమితంగా ఇష్టపడేవి ఇవ్వాలి. స్వీట్స్ అనగానే చాలా మందికి నెగెటివ్‌గా చూసే తత్వం ఉంటుంది. కానీ, స్వీట్స్‌లో మెదడు చురుకుదనాన్ని పెంచే అంశాలు ఉన్నాయి. అందుకే రోజుకు ఒకటి రెండుసార్లు ఒకటి రెండు పీసెస్ ఇవ్వడం మంచిదే. ఏమైనా, పిల్లల మార్కుల స్కోర్ పెరగాలంటే, వాళ్ల ఎనర్జీ లెవెల్స్ పెంచడం తప్పనిసరి!!



డైలీ సుడోకు - 136

1					6			
9	6			3			8	
3		4	9		8	7		6
	2		6					
				4				
					5		3	
2		5	3		7	9		8
	4			2			5	7
			4					1

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 135 సమాధానం


7	6	8	5	2	4	9	1	3
1	4	9	6	8	3	5	2	7
3	5	2	1	9	7	8	4	6
5	9	1	3	7	6	2	8	4
4	2	3	8	1	5	6	7	9
8	7	6	2	4	9	1	3	5
2	3	7	9	5	8	4	6	1
6	8	5	4	3	1	7	9	2
9	1	4	7	6	2	3	5	8


'రంగస్థలం' ప్రీరిలీజ్ వేడుకలో ఓ దృశ్యం

నటుడిగా ఈర్ష్యపడుతున్నా... తండ్రిగా గర్వపడుతున్నా!

- చిరంజీవి

"ఇది స్వచ్ఛమైన పల్లెటూరి నేపథ్యం ఉన్న సినిమా. నాకు 'ఖైదీ' ఎలాగో... రామ్‌చరణ్‌కి ఈ సినిమా అలాగ తన స్టార్ స్టేటస్‌ని పెంచే సినిమా. నటుడిగా తను ఒక మెట్టు ఎక్కే సినిమా అవుతుందని అందరూ చెప్పారు. ఇది సత్యం. అలాంటి అవకాశం సుకుమార్ రామ్‌చరణ్‌కి ఇచ్చినందుకు అర్థిస్తూగా ఈర్ష్య పడుతున్నా... తండ్రిగా గర్వపడుతున్నా" అన్నారు చిరంజీవి. రామ్‌చరణ్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, చెరుకూరి మోహన్ నిర్మించిన చిత్రం 'రంగస్థలం'. సమంత హీరోయిన్. దేవిశ్రీ ప్రసాద్ స్వరకర్త. ఆదివారం సాయంత్రం విశాఖలో జరిగిన ప్రీ-రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన చిరంజీవి మాట్లాడుతూ "సుకుమార్ గ్రామీణ వాతావరణంలో పుట్టి పెరగడం వల్ల అలవోకగా తీశాడు. నేపథ్య సంగీతం లేకుండా చూసిన సినిమా గుండెలను పిండేసింది. హీరోకి వినికిడి లోపం ఉంటే ప్రేక్షకులు, ఫ్యాన్స్ ఎలా రిసీవ్ చేసుకుంటారో అనుకున్నా. చెప్పినట్టుగా వినోదాత్మకంగా, భావోద్వేగభరితంగా ఆ పాత్రను మలిచాడు సుకుమార్. దేవి బాణీలకు అంతే ధీటుగా సాహిత్యమైన రచయిత చంద్రబోస్ పాటలు రాశాడు. తెలంగాణ బిడ్డ అయ్యుండి గోదావరి గడ్డ మీదుండే పల్లె పదాలను ఎంత బాగా రాశాడో! ఆయన పెన్నుకి వెన్ను వంచి నమస్కరిస్తున్నా. అవార్డుల కోసం సినిమాలు తీయరు. కానీ, ఈ సినిమా అవార్డులను సొంతం చేసుకుంటుంది. జాతీయస్థాయిలో అవార్డు రావలసిందే... అన్యాయం జరిగినట్టే" అన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ "ఈ ఉగాది మెగా అభిమానులకే... కుటుంబసభ్యులతో జరుపుకోవడం ఆనందంగా ఉంది. నా చిన్నతనంలో తాతగారు నెల్లూరులో పని చేసేటప్పుడు నాన్నగారు రెండు మూడుసార్లు తీసుకువెళ్లారు. 'ఆపద్బాంధవుడు' చిత్రీకరణకు ఒక్కసారి పూడిపల్లి వెళ్లా. మావాళ్ళు (పూర్వీకులు) పల్లెటూళ్ళ నుంచి వచ్చారని తెలిసినా వెళ్లడం కుదరలేదు. ఈ సినిమాతో మన ఊళ్లను పరిచయం చేసిన సుకుమార్‌కి థ్యాంక్స్. ఎందుకు సిటీల్లో ఉంటున్నామా? అనిపిస్తుంది. పల్లె మనుషులు, వాతావరణం అంత బాగుంటుంది. నాకు ఒక కొత్త దర్శకుడ్ని సుకుమార్‌గారు పరిచయం చేశారు. నా మీద నాకు గౌరవం పెరిగింది. ఇది సినిమా కాదు... ఒక ఎక్స్‌పీరియన్స్ అన్నారు. అభిమానులు గర్వపడే సినిమా ఇచ్చాడు" అన్నారు. సుకుమార్ మాట్లాడుతూ "నా అభిమాన నటుడు చిరంజీవిగారు రాజకీయాల్లోకి వెళ్లాలనుకున్నప్పుడు 'ముఖ్యమంత్రి పదవికన్నా చిరంజీవి పదవే గొప్పది కదా! ఆయన ఎందుకు రాజకీయాల్లోకి వస్తున్నారు' అని దేవిశ్రీ అన్నాడు. ఎంతమందికి ఎన్ని పదవులు అయినా ఉండొచ్చు, కానీ, చిరంజీవి పదవి ప్రత్యేకం. అది ఎవరూ ఒక్కరికే సాధ్యం. అలాంటి ఆయన సినిమా చూసి నన్ను ఇంటికి పిలిచి... మెచ్చుకున్నారు" అన్నారు. "సినిమాలో రామ్‌చరణ్‌గారి విశ్వరూపం చూస్తారు"ని నవీన్ ఎర్నేని అన్నారు. "సుకుమార్‌గారి సలహాలు, సూచనలు, పరిశోధనతో చరణ్ లుక్‌ను డిజైన్ చేశా. తన పల్లెటూరి లుక్‌తో బావుంటాను. నాన్నగారు (చిరు), తమ్ముడు (చరణ్) వర్క్ విషయంలో కాంప్రమైజ్ కారు" అన్నారు సుస్మిత కొణిదెల. "చిన్నతనంనుంచీ గ్రామీణ నేపథ్యంలో జానపద సంగీతం ఉన్న సినిమా చేయాలనేది నా కోరిక 'రంగస్థలం'తో తీరింది" అని దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. "23 ఏళ్ళ నా సినిమా సాహిత్య ప్రస్థానంలో చిరంజీవిగారి మాటలతో ఈరోజు నా జన్మ ధన్యమైంది" అని చంద్రబోస్ అన్నారు. ఈ వేడుకలో నిర్మాత అల్లు అరవింద్, నటీనటులు సమంత, పూజా హెగ్డే, అనసూయ, ఆది పినిశెట్టి, బ్రహ్మాజీ, ఫైట్ మాస్టర్స్ రామ్-లక్ష్మణ్, కళా దర్శకుడు రామకృష్ణ-మౌనిక, చిరంజీవి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


మోహన్‌బాబు

పువ్వులు వద్దు.. మొక్కలు ముద్దు..!

"పుట్టినరోజున శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చేవారు పుష్పగుచ్ఛాలు, పువ్వుల దండలు తీసుకుని రావొద్దు. ఏదైనా కానుక ఇవ్వాలనిపిస్తే పువ్వులకు బదులు మొక్కలు తీసుకుని రండి. అవి నాకు ఆనందాన్ని పంచుతాయి" అని డా. మంచు మోహన్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం చేసిన ట్వీట్ అందరి దృష్టినీ ఆకట్టుకుంది.


మహేష్‌బాబు

పంచెకట్టులో మహేశ్

మహేష్‌బాబు కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'భరత్ అనే నేను'. డి.వి.వి. దానయ్య నిర్మిస్తున్న ఈ చిత్రంలో కైరా అద్వాణీ కథానాయిక. ఏప్రిల్ 20న ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేస్తున్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పంచె కట్టులో ఉన్న మహేష్ పోస్టర్‌ను విడుదల చేశారు. సూటుబూటులోనే కాదు పంచెకట్టులో కూడా మహేష్ అదరగొట్టాడని సోషల్ మీడియా వేదికగా అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాత దానయ్య మాట్లాడుతూ "తెలుగు సంవత్సరాది పండగ కళ ఉట్టిపడే పంచె కట్టులో ఉన్న మహేష్ పోస్టర్‌ను విడుదల చేశాం. ప్రేక్షకులకు, అభిమానులకు మహేష్ కొత్త లుక్ కనువిందు చేస్తోంది. ప్రస్తుతం రాజు సుందరం నేతృత్వంలో భారీ టెంపుల్ సెట్‌లో వందమంది డాన్సర్లు, 1000 మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులతో ఓ పాటను చిత్రీకరిస్తున్నాం. ఈ నెల 25 నుంచి స్పెయిన్‌లో షెడ్యూల్ ఉంటుంది. అన్ని కార్యక్రమాల్ని పూర్తి చేసి ఏప్రిల్ 20న సినిమాను విడుదల చేస్తాం" అని అన్నారు.


అల్లు అర్జున్
ఎలీ అవరమ్

సూర్యతో అవరమ్... సందేశ గీతమ్!

అల్లు అర్జున్ సినిమాలో నేను చేయబోయేది ఐటమ్ పాట కాదండోయ్ అంటోంది ఎలీ అవరమ్! మరేంటి? అంటే... 'సందేశ గీతమ్' అని సెలవిచ్చారు. అసలు, ఎవరీ సుందరి? అంటే... హిందీ 'బిగ్ బాస్'తో అక్కడి బుల్లితెర ప్రేక్షకులకు పరిచమయ్యారు. తర్వాత టీవీ షోలు, రెండు మూడు సినిమాలు చేశారు. అల్లు అర్జున్ హీరోగా వక్కంతం వంశీ దర్శకత్వంలో లగడపాటి శిరీషా శ్రీధర్, 'బన్నీ' వాసు నిర్మిస్తున్న 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'తో తెలుగు తెరకు పరిచయం కాబోతున్నారు. మే 4న విడుదల కానున్న ఈ చిత్రంలోని ప్రత్యేక గీతంలో సూర్యతో కలిసి స్టెప్పులు వేయనున్నారు. "అల్లు అర్జున్ డ్యాన్స్‌కి నేను పెద్ద ఫ్యాన్. ఆయనతో అవకాశం రాగానే వెంటనే అంగీకరించా. పాట సాహిత్యంలో గొప్ప సందేశం ఉంది. ప్రతి ఒక్కరి జీవితాలకు సూటయ్యే సాహిత్యాన్ని రాశారు" అని ఎలీ అవరమ్ పేర్కొన్నారు. అనూ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి విశాల్-శేఖర్ స్వరకర్తలు.


కీర్తి సురేష్

మేలో 'మహానటి'

సీనియర్ నటి సావిత్రి జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతోన్న 'మహానటి' చిత్రం మే 9న ప్రేక్షకుల ముందుకురానుంది. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి నాగ్ అశ్విన్ దర్శకుడు. ప్రియాంక దత్ నిర్మాత. సావిత్రి పాత్రలో కీర్తి సురేష్ నటిస్తోంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఉగాది సందర్భంగా సినిమా విడుదల తేదీని చిత్రబృందం ఆదివారం ప్రకటించింది. "1990 మే 9న... వైజయంతీ మూవీస్ సంస్థ నుంచి వచ్చిన 'జగదేకవీరుడు అతిలోక సుందరి' టాలీవుడ్ రికార్డుల్ని తిరగరాస్తూ కొత్త చరిత్ర సృష్టించింది. సరిగ్గా అదే రోజున 'మహానటి' విడుదల అవుతుండడం విశేషం. టాలీవుడ్‌లోని ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపిస్తున్న ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు ఇది వరకు చూడని వినోదాన్ని పంచబోతుందనీ, మహానటి సావిత్రి కథని వెండి తెరపై దర్శకుడు ఆవిష్కరించిన తీరు.. తెలుగు ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా చిలిచిపోయేలా ఉంటుందని నిర్మాత తెలిపారు.


అఖిల్

హాట్ సమ్మర్‌లో షురూ!

ఉగాదిని పురస్కరించుకుని అఖిల్ కొత్త సినిమాను ప్రకటించారు. బీవీయస్‌యన్ ప్రసాద్, బాపినీడు నిర్మించనున్న ఈ సినిమాకు 'తొలిప్రేమ' ఫేమ్ వెంకీ అట్లూరి దర్శకుడు. మేలో చిత్రీకరణ మొదలుకానుంది. "ఆదివారాలు ఎప్పుడూ అందంగానే ఉంటాయి కదా? ఈ అందమైన ఆదివారం రోజు నా తదుపరి చిత్రం గురించి ప్రకటించబోతున్నాను" అని ట్వీట్ చేశారు అఖిల్.

'నేల టిక్కెట్' 420 కథేంటి?


రవితేజ

రవితేజ హీరోగా ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్న చిత్రానికి 'నేల టిక్కెట్' టైటిల్ ఖరారు చేశారు. కల్యాణ్‌కృష్ణ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. మాళవిక శర్మ కథానాయిక. ఉగాది సందర్భంగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను రవితేజ ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు. ఫస్ట్ లుక్‌లో టిక్కెట్ ఖరీదు పది రూపాయలని , టిక్కెట్ నంబర్ 420 అని ఉంది. మరి 420 వెనకున్న కథేంటో తెలియాలంటే సమ్మర్ వరకూ ఆగాల్సిందే. క్లాసు, మాసు మేళవింపుతో ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రం 60% చిత్రీకరణ పూర్తి చేసుకుంది. మే 24న విడుదల చెయ్యడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.


కల్యాణ్‌రామ్

నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా 'ఉయ్యాల జంపాల', 'మజ్ను' సినిమాల ఫేమ్ విరించి వర్మ దర్శకత్వంలో ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్ పతాకంపై 'జెమిని' కిరణ్ ఓ చిత్రాన్ని నిర్మించనున్నారు. హీరోగా కల్యాణ్‌రామ్ కి ఇది 16వ చిత్రం

కల్యాణ్‌రామ్16 @ ఆనంది15

కాగా, ఆనంది ఆర్ట్స్‌లో 15వ ప్రొడక్షన్! "ఉగాది సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రకటిస్తున్నాం. చక్కటి కుటుంబ కథను విరించి వర్మ సిద్ధం చేశారు. ఈ ఏడాది ద్వితీయార్థంలో చిత్రం ప్రారంభమవుతుంది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో తెలియజేస్తాం" అని 'జెమిని' కిరణ్ తెలిపారు.

అమరావతిలో శబ్దం


నారా రోహిత్

నారా రోహిత్ హీరోగా నటిస్తున్న చిత్రం 'శబ్దం'. 'హిజ్ సైలెన్స్ ఈజ్ హిస్ వెపన్' అనేది ఉపశీర్షిక. పి.బి.మంజునాథ్ దర్శకుడు. శ్రీవైష్ణవి క్రియేషన్స్ పతాకంపై నారాయణరావు అట్లూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం అమరావతిలో ఆదివారం జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి పెదకూరపాడు ఎమ్మెల్యే కొమ్మలపాటి శ్రీధర్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఏపీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు క్లాప్ కొట్టారు. "అమరావతిలో ప్రారంభోత్సవం జరగడం ఆనందంగా ఉంది. మా పెదనాన్నగారు నారా చంద్రబాబునాయుడుగారు రాష్ట్రాన్ని ఎంతగానో డెవలప్ చేస్తున్నారు. ఇక్కడే ఆడియో వేడుక కూడా నిర్వహిస్తాం" అని నారా రోహిత్ అన్నారు. ప్రేక్షకులను అలరించే చిత్రమని నిర్మాత తెలిపారు. "కథ వినగానే నమ్మి చేసిన రోహిత్‌గారికి ధన్యవాదాలు. ఏప్రిల్ చివరి వారం నుంచి వైజాగ్, కాకినాడ, హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది" అని దర్శకుడు తెలిపారు. హైదరాబాద్‌లో మీటింగ్ ఉన్నందువల్ల నారా లోకేశ్ కార్యక్రమానికి రాలేకపోయారని, అమరావతిలో మరిన్ని సినీ వేడుకలు జరగాలని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ చిత్రానికి కథ-మాటలు: వంశీ రాజేశ్, సంగీతం: వికాస్ కురిమెళ్ల, ఎడిటర్: నవీన్ నూలి, కెమెరా: రిచర్డ్ ప్రసాద్, సమర్పణ: డా. సౌజన్య అట్లూరి.



సుబ్రహ్మణ్యపురంలో...


నాగచైతన్య, ఈషా, సుమంత్

సుమంత్ హీరోగా నటిస్తున్న 25వ చిత్రం 'సుబ్రహ్మణ్యపురం'. ఈషా రెబ్బా హీరోయిన్. సంతోష్ జాగర్లపూడిని దర్శకుడిగా పరిచయం చేస్తూ ధీరజ్ బొగ్గరం, బీరం సుధాకర్‌రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ఉగాది సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు ప్రశాంత్ వర్మ కెమెరా స్విచ్చాన్ చేయగా, హీరో నాగచైతన్య క్లాప్‌నిచ్చారు. చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించారు. టైటిల్ లోగోను ఎంపి జేసీ దివాకర్‌రెడ్డి, రాజశేఖర్, జీవిత ఆవిష్కరించారు. సుమంత్ మాట్లాడుతూ "ఈ సినిమా ఓ సూపర్ నేచురల్ మిస్టరీ థ్రిల్లర్. నేను కొంచెం భయస్తుణ్ణి. నేనింతవరకూ ఇటువంటి చిత్రం చేయలేదు. సంతోష్ కథ చెప్తున్నంత సేపూ తర్వాత ఏం జరుగుతుందోనని ఉత్కంఠతో విన్నా. వెంటనే అంగీకరించా. సాధారణంగా నా చిత్రాలకు హడావిడి చేయడం ఇష్టం ఉండదు. నా 25వ చిత్రమని నిర్మాతలు హంగామా చేశారు" అన్నారు. "దర్శకుడిగా తొలి చిత్రమిది. మూడు షార్ట్ ఫిలిమ్స్ తీశా. అవి చూసి నిర్మాతలు అవకాశం ఇచ్చారు. ఏప్రిల్ మూడో వారంలో రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది" అన్నారు సంతోష్ జాగర్లపూడి. ఈ కార్యక్రమంలో ఈషా, చిత్రసంగీత దర్శకుడు శేఖర్ చంద్ర, కళా దర్శకులు లక్ష్మీ సింధూజ, కాస్ట్యూమ్ డిజైనర్ సుమ త్రిపురాన తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ నేనే హీరోగా...

- నాగశౌర్య



"ఛలో' ఘన విజయం తర్వాత మా 'ఐరా క్రియేషన్స్' సంస్థలో నిర్మిస్తున్న చిత్రమిది. మా మంచి అమ్మ! మళ్లీ నన్నే హీరోగా పెట్టి సినిమా తీస్తుంది. '@నర్తనశాల' టైటిల్ విని ఇదేదో పౌరాణిక చిత్రమని లేదా పాత 'నర్తనశాల'కు రీమేక్ అని అనుకోవద్దు. అందరూ హాయిగా నవ్వుకునే చిత్రమిది" అన్నారు నాగశౌర్య. ఆయన హీరోగా శ్రీనివాస్ చక్రవర్తిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, శంకర్‌ప్రసాద్ ముల్పూరి సమర్పణలో ఉషా ముల్పూరి నిర్మిస్తున్న '@నర్తనశాల' ఉగాది సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి వంశీ పైడిపల్లి క్లాప్ ఇచ్చారు. నిర్మాత 'భవ్య' ఆనందప్రసాద్, దర్శకులు నందినీరెడ్డి, అవసరాల శ్రీనివాస్, వెంకీ కుడుముల, నటుడు అజయ్, రచయిత అబ్బూరి రవి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం నాగశౌర్య మాట్లాడుతూ "కృష్ణవంశీగారి శిష్యుడు శ్రీనివాస చక్రవర్తి. నేను నమ్మిన కథను మా అమ్మ నమ్మింది. నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అందరం కష్టపడి పని చేస్తాం. ఈ సినిమా 'ఛలో'కి మించిన విజయం సాధిస్తుందని ఆశిస్తున్నా" అన్నారు. దర్శకుడు శ్రీనివాస్ చక్రవర్తి మాట్లాడుతూ "చైత్రమాసంలో సినిమా మొదలైంది. ఐరా సంస్థలో సినిమా చేయడం బాధ్యతగా భావిస్తున్నా" అన్నారు. ఈ చిత్రానికి కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు (చంటి), తమ్మిరాజు, ఛాయాగ్రహణం: విజయ్ సి కుమార్, సంగీతం: మహతి స్వరసాగర్.

జర కొత్తగా...


శ్రీనివాస్‌రెడ్డి

శ్రీనివాస్‌రెడ్డి, సిద్ధి ఇద్నాని జంటగా శివం సెల్యూలాయిడ్స్, మెయిన్ లైన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తోన్న చిత్రం 'జంబలకిడి పంబ'. జె.బి.మురళీ కృష్ణ దర్శకుడు. రవి, జో జో జోస్, శ్రీనివాస్ రెడ్డి.ఎన్ నిర్మాతలు. ఉగాది సందర్భంగా ఈ సినిమా లోగోను అల్లరి నరేశ్ విడుదల చేశారు. సినిమా నిర్మాణ దశలో ఉందని నిర్మాత రవి చెప్పారు. "కల్ట్ మూవీ ఈవీవీగారి 'జంబలకిడి పంబ' చిత్రానికీ, మా చిత్రానికీ సంబంధం లేదు. ఆ టైటిల్‌కి ఉన్న గౌరవాన్ని ఏమాత్రం తగ్గించం. ప్రస్తుతం హైదరాబాద్ పరిసరాల్లో షూటింగ్ చేస్తున్నాం" అని దర్శకుడు అన్నారు. ఈ కథ తనకు తెలుసని, పెద్ద హిట్ అవుతుందని అల్లరి నరేశ్ చెప్పారు. అందరినీ మెప్పించే చిత్రమవుతుందని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: బి.సురేశ్ రెడ్డి.




తెలంగాణ రాష్ట్ర సినీ కార్మిక సంఘ్ ప్రతినిధి బృందం

బీఎంఎస్ కు అనుబంధంగా
టీఎస్ సినీ కార్మిక సంఘ్

రాష్ట్రంలో సినీ రంగంలో పని చేస్తున్నవారి సమస్యల పరిష్కారం కోసం భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) అనుబంధంగా 'తెలంగాణ స్టేట్ సినీ కార్మిక సంఘ్'ను ఏర్పాటు చేసినట్టు బీఎంఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎ.రవిశంకర్ తెలిపారు. రాజకీయాలకు అతీతంగా సినీ రంగం సంక్షేమంకోసం పోరాడేందుకు బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో తెలంగాణ స్టేట్ సినిమా కార్మిక్ సంఘ్ ఆవిర్భవించిందని ఆయన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ "నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీంగా ఎన్నుకున్నాం. అధ్యక్షుడుగా మోహన్ రాజ్, ఉపాధ్యక్షులుగా శేఖర్ యాదవ్, కుమార్ నాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఈగ సాంబయ్య, సంఘటన కార్యదర్శిగా సాయి ప్రదీప్, కార్యదర్శిగా చైత్ర, కోశాధికారిగా శివాజీ ఎంపికయ్యారు. సీవీఎల్ .నర్సింహారావు, ఎ.రవిశంకర్ సలహాదారులుగా వ్యవహరిస్తారు" అని తెలిపారు. ఈసందర్భంగా బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బీ.రవీంద్రరాజు మాట్లాడుతూ "సినీ కార్మికులు, ఉద్యోగులు, కళాకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా బోర్డును ఏర్పాటు చేయాలి. బీపీఎల్ కుటుంబాలకు వర్తించే సంక్షేమ, అభివృద్ధి పథకాలను సినీ కార్మికుల కుటుంబాలకు వర్తింప చేయాలి" అని డిమాండ్ చేశారు.

భారత ఈక్విటీలపై మళ్లీ ఎఫ్‌పిఐల ప్రేమ

ముంబై : విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లకు భారత మార్కెట్‌పై ఆసక్తి మరోసారి పెరిగింది. అంతర్జాతీయ విపణిలో ఆయిల్ ధరల ఒత్తిడులు తగ్గడంతో పాటు కార్పొరేట్ ఆదాయాలు పుంజుకుంటాయన్న ఆశల నడుమ ఈ నెలలో ఇప్పటి వరకు ఎఫ్‌పిఐలు భారత ఈక్విటీల్లో 6,400 కోట్ల రూపాయలు ఇన్వెస్ట్ చేశారు. ఇదే సమయంలో వారు డెట్ మార్కెట్ల నుంచి 10,600 కోట్ల రూపాయలు ఉపసంహరించారు. మార్చి 1-16 తేదీల మధ్య కాలంలో భారత మార్కెట్లో ఎఫ్‌పిఐల నికర పెట్టుబడులు 6,380 కోట్ల రూపాయలు. ఫిబ్రవరి నెలలో ఎఫ్‌పిఐలు భారీ ఎత్తున నిధులు ఉపసంహరించిన తర్వాత (ఈక్విటీల నుంచి 11 వేల కోట్ల రూపాయలు) ఇది ఊరట ఇచ్చింది.

వచ్చేస్తున్నాయ్..
కొత్త కూలర్లు, ఏసీలు



న్యూఢిల్లీ : మార్చి నెలలోనే ఎండలు మండిపోతున్నాయి. ఈ ఏడాది వేసవి వడగాలులు తీవ్రంగా ఉంటాయని, ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా పై స్థాయిలోనే ఉంటాయని వాతావరణ శాఖ ఇప్పటికే అంచనాలు వెలువరించడంతో జనం భీతిల్లిపోతున్నారు. వేసవి తాపాన్ని తీర్చి వారందరికీ చల్లగాలులు అందించేందుకు వివిధ సంస్థలు రకరకాల ఆఫర్లు, తక్కువ ఇంధనం ఉపయోగించుకుని ఎక్కువ సౌకర్యం అందించే ఏసీలు, ఫ్యాన్లు, కూలర్లతో మార్కెట్లో హల్‌చల్ సృష్టించేందుకు వ్యూహాలు సిద్ధం చేసుకున్నారు. పానాసోనిక్ ఇండియా గత వారంలోనే కొత్త శ్రేణి ఇన్వర్టర్ ఏసీలను విడుదల చేసింది. నానో టెక్నాలజీ పేరిట ఈ ఎసిల్లో కొత్త రకం ప్యూరిఫికేషన్ వ్యవస్థ ఉంది. ఇది గాలి నుంచి వచ్చే సూక్ష్మ మూలకాలను 99 శాతం ఆటోమేటిక్‌గా తొలగించి స్వచ్ఛమైన గాలిని కస్టమర్లకు అందిస్తుందని కంపెనీ ప్రకటించింది. ఇప్పటికే వేసవి తాపంతో తల్లడిల్లిపోతున్న ప్రజలు ఎసిలు, కూలర్ల కొనుగోలు కోసం ఇప్పటికే క్యూ కడుతున్నారని తయారీదారులు, రిటైలర్లు చెబుతున్నారు.

కొత్త ఉత్పత్తుల ఆవిష్కారంలో తాము ఎప్పుడూ ముందుంటామని, కస్టమర్ల అవసరాలను చురుగ్గా అధ్యయనం చేస్తున్నామని ఉషా ఇంటర్నేషనల్ ఫ్యాన్స్ విభాగం ప్రెసిడెంట్ రోహిత్ మాథుర్ చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం నెలకొన్నందు వల్ల ఈ సీజన్‌లో డిమాండు ఎక్కువగానే ఉంటుందని ఆయన అంచనా వేశారు.

అన్ని బ్రాండ్ల తయారీదారులు 5 స్టార్ రేటింగ్ కలిగి ఉన్న ఇంధనం ఆదా చేసే ఇన్వర్టర్ ఏసీల తయారీపై ప్రధానంగా దృష్టి సారించారని క్రోమా బిజినెస్ మేనేజర్ (అప్లయెన్సెస్) ఫరీద్ సారంగ్ అన్నారు. ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో ఇప్పటికే డిమాండు 20 నుంచి 30 శాతం పెరిగిందని ఆయన చెప్పారు.

ఈ సీజన్‌లో తాము 3 స్టార్ నుంచి 5 స్టార్ గల 40 కొత్త మోడళ్లు ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేశామని ఎయిర్ కండిషనింగ్ దిగ్గజం బ్లూస్టార్ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఈ ఏడాది ఫ్యాన్లకు డిమాండు 20 శాతం కన్నా పైబడే పెరుగుతుందని ఆశిస్తున్నామని బజాజ్ ఎలక్ట్రికల్స్ సిఎండి శేఖర్ బజాజ్ చెప్పారు. తాము 450 జిల్లాల్లో పంపిణీ నెట్‌వర్క్‌ను శక్తివంతం చేయడంతో పాటు దేశవ్యాప్తంగా 1.6 లక్షల రిటైలర్ల అవసరాలు తీర్చేందుకు సర్వీసింగ్ విభాగం పూర్తి స్థాయిలో సిద్ధమైందని ఆయన తెలిపారు. ఈ వేసవిలో ఆన్‌లైన్ అమ్మకాలు గణనీయంగా పెరుగుతాయని భావిస్తున్నట్టు టాటా క్లిక్ సిఒఒ వికాస్ పురోహిత్ చెప్పారు.

కొత్త కార్లపై టాటా మోటార్స్ దృష్టి

మార్కెట్ వాటా పెంచుకోవడమే లక్ష్యం.. టియాగోలోనూ ఎలక్ట్రిక్ వెర్షన్

» 2020 నాటికి 1,500 డీలర్‌షిప్‌లు

» టాటా మోటార్స్ ప్రెసిడెంట్ మయాంక్ పరీక్

జెనీవా : దేశీయ మార్కెట్లో వాటాను పెంచుకునేందుకు పెద్ద ఎత్తున కొత్త కార్లను మార్కెట్లోకి తీసుకురావాలని టాటా మోటార్స్ యోచిస్తోంది. 2020 నాటికి భారత ప్యాసింజర్ వెహికిల్స్ మార్కెట్లో 95 శాతాన్ని కవర్ చేయాలనుకుంటోంది. ఇదే సమయంలో ఎలక్ట్రిక్ వాహనాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని కంపెనీ నిర్ణయించుకుంది. ప్రస్తుతం టాటా మోటార్స్ హ్యాచ్‌బ్యాక్ నుంచి ఎస్‌యువి వరకు విభిన్న వాహనాలను వ వా రె క ట్లో విక్రయిస్తోంది. వీటి ద్వారా దాదాపు 70 శాతం భారత మార్కెట్లో తన కార్యకలాపాలు సాగిస్తోంది. 2020 నాటికి వివిధ కొత్త వాహనాలతో 95 శాతం మార్కెట్‌ను కవర్ చేయాలనుకుంటున్నామని టాటా మోటార్స్ ప్రెసిడెంట్ (ప్యాసింజర్ వాహనాల బిజినెస్ యూనిట్) మయాంక్ పరీక్ తెలిపారు. జెనీవా మోటార్ షోలో పాల్గొన్న సందర్భంగా మయాంక్ కంపెనీ భవిష్యత్ వ్యూహాలను వెల్లడించారు. కొత్త వాహనాలు తీసుకురావడం వల్ల మార్కెట్ వాటాను మరింతగా పెంచుకునే అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. ప్రస్తుతం కంపెనీ మార్కెట్ వాటా ఏడు శాతంగా ఉందని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాల (ఇవి) గురించి మాట్లాడుతూ.. ఇలాంటి వాహనాల అవసరం భారత మార్కెట్లో అధికంగా ఉందని చెప్పారు. ఇంధనాల వినియోగం భారత్‌లో అధికంగా ఉందని, కాలుష్యం కూడా ఎక్కువగా ఉంటోందన్నారు. రానున్న కాలంలో తాము అధిక ప్రాధాన్యతతో ఎలక్ట్రిక్ వాహనాలు తీసుకువచ్చేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ప్రస్తుతం ప్యాసింజర్ సెగ్మెంట్లో టిగోర్ మోడల్‌లో ఎలక్ట్రిక్ వేరియంట్‌ను అందిస్తున్నామని తెలిపారు. కాంపాక్ట్ హ్యాచ్‌బ్యాక్ టియాగోలో కూడా ఎలక్ట్రిక్ వెర్షన్‌ను తెస్తామని చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో తమ కంపెనీ పరిశ్రమకన్నా మెరుగైన వృద్ధిని సాధిస్తుందన్న విశ్వాసంతో ఉన్నామన్నారు. తమ అంచనాల ప్రకారం పరిశ్రమలోని ప్యాసింజర్ వెహికిల్ సెగ్మెంట్ 7-9 శాతం వృద్ధి చెందే అవకాశం ఉందని, ఇంతకన్నా ఎక్కువ వృద్ధినే తాము నమోదు చేసుకునే ఆస్కారం ఉందని చెప్పారు.



2016-17 సంవత్సరంతో పోల్చితే 2017-18 సంవత్సరంలో తాము మెరుగైన అమ్మకాలను నమోదు చేయగలిగామన్నారు. 2020 నాటికి సేల్స్ ఔట్‌లెట్ల (డీలర్‌షిప్స్) సంఖ్యను రెండింతలకు పెంచుకోనున్నట్టు పరీక్ తెలిపారు. మూడేళ్ల క్రితం ఔట్‌లెట్ల సంఖ్య 400 ఉండేదని, ఇప్పుడది 800కు పెరిగిందన్నారు. 2020 నాటికి వీటి సంఖ్య 1,500కు చేరుకునే అవకాశం ఉందన్నారు. ఎక్కువ మంది కస్టమర్లను ఆకర్షించేందుకుగాను డీలర్ నెట్‌వర్క్‌లో మార్పులు చేర్పులు చేస్తున్నామన్నారు.

భారీ పెట్టుబడులకు జెఎల్‌ఆర్ సిద్ధం

టాటా మోటార్స్‌కు చెందిన జాగ్వార్ లాండ్ రోవర్ (జెఎల్‌ఆర్) కొత్త కార్లు, టెక్నాలజీలు, సదుపాయాల కోసం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టే యోచనలో ఉంది. ఇతర లగ్జరీ కార్ల కంపెనీల నుంచి పోటీ పెరుగుతున్న నేపథ్యంలో జెఎల్‌ఆర్ తన వ్యూహాలకు పదును పెడుతోంది. కొత్త ఇంజన్లు, టెక్నాలజీల కోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 430 కోట్ల పౌండ్ల పెట్టుబడులు పెట్టనున్నట్టు కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాఫ్ స్పెత్ జెనీవా మోటార్ షోలో భాగంగా తెలిపారు. గత కొన్నేళ్ల నుంచి ఏటా 250-350 కోట్ల పౌండ్ల పెట్టుబడులు పెడుతున్నట్టు ఆయన చెప్పారు.

'ఆర్థిక' అభివృద్ధే సార్క్ ప్రధాన అజెండా

అన్ని దేశాలూ ఒకే మార్కెట్‌గా ఏర్పడాలి

సార్క్ బిజినెస్ లీడర్ల సదస్సు

ఖాట్మండు : రాజకీయ సవాళ్లు, ఒత్తిళ్లు ఉన్నా సార్క్ దేశాలకు ఆర్థిక అభివృద్ధే ప్రధాన అజెండా కావాలని ఈ ప్రాంతానికి చెందిన పారిశ్రామిక, వాణిజ్య సంఘాలు కోరాయి. ప్రపంచ వ్యాప్తంగా స్వీయ వాణిజ్య రక్షణ విధానాలు పెరుగుతున్నందున, ఈ ప్రాంత దేశాలన్నీ ఒకే సమగ్ర మార్కెట్‌గా ఏర్పడాలని పిలుపు ఇచ్చాయి. నేపాల్ రాజధాని ఖాట్మండులో జరిగిన సార్క్ సిఐఐ సదస్సులో వారు ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే దురదృష్టవశాత్తూ రాజకీయ కారణాలతో ఈ ప్రాంతంలో ఈ ఆలోచన లోపించిందని ఎఫ్ఎన్‌సిసిఐ (నేపాల్) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్ గొల్చా విచారం వ్యక్తం చేశారు.

వృద్ధికి ఢోకా లేదు : శోభన కామినేని

సార్క్ ప్రాంతంలో అభివృద్ధికి ఢోకా ఉండదని సదస్సులో పాల్గొన్న సిఐఐ అధ్యక్షురాలు శోభన కామినేని ధీమా వ్యక్తం చేశారు. 'ప్రపంచంలో మరెక్కడా లేనంత మంది యువతరం మన ప్రాంతంలో ఉంది. ఈ ప్రాంతంలో మరో 20-25 సంవత్సరాల వరకు అభివృద్ధికి ఢోకా లేదు. అయితే వీరంతా ఆరో మరో పాతికేళ్ల వరకు గ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. అర్హతలు సాధించిన ఈ యువకులు తమ దేశాల్లోనే గాక, ఈ ప్రాంతమంతటా ఉద్యోగాలు చేసేలా ఉండాలి' అన్నారు. సార్క్ ప్రాంత జనాభాలో 30-35 శాతం యువతరం ఉంటే, భారత జనాభాలో మాత్రం 60 శాతం మంది 35 సంవత్సరాల లోపు వారేనని శోభన కామినేని చెప్పారు.



శోభన కామినేని

రూ.17,000 కోట్లతో ఎఎఐ విస్తరణ కార్యక్రమాలు

» విజయవాడ ఎయిర్ పోర్టులో కొత్త టెర్మినల్ బిల్డింగ్

న్యూఢిల్లీ : ప్రభుత్వ నిర్వహణలోని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) తన నిర్వహణలోని విమానాశ్రయాలను పెద్ద ఎత్తున విస్తరించి ఆధునీకరించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం వచ్చే మూడేళ్లలో రూ.15,000 కోట్ల నుంచి రూ.17,000 కోట్లు ఖర్చు చేయనున్నట్టు కంపెనీ చైర్మన్ గురుప్రసాద్ మహాపాత్ర చెప్పారు. ఆధునీకరణలో భాగంగా వచ్చే ఆర్థిక సంవత్సరం రూ.15,000 కోట్ల ఖర్చుతో విజయవాడతో సహా 15 ఎయిర్‌పోర్టుల్లో కొత్త టెర్మినల్ భవనాల నిర్మాణం ప్రారంభిస్తామని తెలిపారు. ఈ విస్తరణ కోసం అవసరమైన నిధుల్లో రూ.1,500 కోట్లు రుణాల ద్వారా సేకరించాలని కంపెనీ నిర్ణయించింది. ఎఎఐ రుణాల ద్వారా నిధుల సమీకరణకు సిద్ధమవడం ఇదే మొదటిసారి. ఇక నుంచి చేపట్టే అన్ని ప్రాజెక్టులను 60 శాతం రుణాలు, 40 శాతం ఈక్విటీ ద్వారా చేపట్టాలని కంపెనీ భావిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2016-17) ఎఎఐ రికార్డు స్థాయిలో రూ.3,115 కోట్ల నికర లాభం ఆర్జించింది. కంపెనీ లాభాల్లో ఉన్నందున రుణ సేకరణ ద్వారా నిధులు సమీకరించడం పెద్ద కష్టం కాదని కంపెనీ చైర్మన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఐఒసి, బిపిసిఎల్ చేతికి
గెయిల్‌లో మెజారిటీ వాటా

రెండు సంస్థలకు చెరో 26 శాతం దక్కే అవకాశం.. ఒప్పందం విలువ రూ.40 వేల కోట్ల పైమాటే..!

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇంధన సంస్థల మధ్య త్వరలో మరో ఒప్పందం కుదిరే అవకాశం ఉంది. సహజ వాయువు సరఫరా సంస్థ గెయిల్ ఇండియా లిమిటెడ్‌లో వాటా కొనుగోలుపై ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఒసి), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) ఆసక్తిగా ఉన్నాయి. ఈ రెండు సంస్థలు గెయిల్‌లో చెరో 26 శాతం వాటాను కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఇందుకోసం ఈ రెండు సంస్థలు రూ.20 వేల కోట్ల చొప్పున పెట్టుబడులు పెట్టాల్సి రావచ్చు. అంటే, గెయిల్‌లో మెజారిటీ వాటా విక్రయం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి రూ.40 వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. గెయిల్‌లో ప్రభుత్వానికున్న 54.89 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు ఐఒసి, బిపిసిఎల్‌లు విడివిడిగా ఆసక్తి వ్యక్తీకరణ దరఖాస్తులు సమర్పించాయి. ఈ నేపథ్యంలో గెయిల్‌లోని ప్రభుత్వ వాటాను ఐఒసి, బిపిసిఎల్‌లకు చెరి సమానంగా బదిలీ చేయాలనుకుంటున్నట్టు ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. శుక్రవారం బిఎస్ఇలో ట్రేడింగ్ ముగిసేసరికి గెయిల్ షేరు ధర రూ.440.85 వద్ద స్థిరపడింది. ఈ లెక్కన సంస్థలో ప్రభుత్వ వాటా విలువ రూ.41,000 కోట్లు.

ప్రభుత్వ రంగ ఇంధన సంస్థల విలీనాల ద్వారా ప్రపంచ స్థాయి దిగ్గజాలను ఏర్పాటు చేయాలని ఫిబ్రవరి 2017లో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రతిపాదించారు. ఆ దిశగా ఇప్పటికే తొలి అడుగు పడింది. హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పిసిఎల్)లో ప్రభుత్వానికి చెందిన 51.11 శాతం వాటాను ఇంధన ఉత్పత్తి సంస్థ ఒఎన్‌జిసి రూ.36,915 కోట్లకు కొనుగోలు చేసింది. అయితే, హెచ్‌పిసిఎల్ ఒఎన్‌జిసిలో విలీనం కాలేదు. అనుబంధ సంస్థగా స్వతంత్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తోంది.

కంపెనీ డైరెక్టర్ల నుంచీ
పాస్‌పోర్ట్ వివరాల సేకరణ

» ఎగవేతదారులు విదేశాలకు పారిపోకుండా నిరోధించేందుకు కేంద్రం మరో ప్రయత్నం

న్యూఢిల్లీ: నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ, విజయ్ మాల్యా తరహాలో ఇంకెవరూ బ్యాంకులకు రుణాలు ఎగవేసి విదేశాలకు పారిపోకుండా నిరోధించేందుకు కేంద్రం మరో ఆలోచన చేస్తోంది. కంపెనీ డైరెక్టర్ల నుంచి పాస్‌పోర్ట్ వివరాలు సేకరించాలని కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ భావిస్తోంది. ఒకవేళ డైరెక్టర్ గుర్తింపు నంబర్ (డిఐఎన్) కలిగిన వ్యక్తికి పాస్‌పోర్ట్ లేని పక్షంలో, ఇందుకు సంబంధించి డిక్లరేషన్ పత్రం సమర్పించాల్సి రావచ్చు. కొత్తగా డిఐఎన్ కోసం దరఖాస్తు చేసుకునే వారు తమ దరఖాస్తులో పాస్‌పోర్ట్ వివరాలనూ పొందుపర్చాల్సి ఉంటుంది. ఇందుకు అనుగుణంగా డిఐఎన్ అప్లికేషన్‌లో తగిన మార్పులు చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

డేటాబేస్‌లో డైరెక్టర్ల పాస్‌పోర్ట్ వివరాలను సైతం కలిగి ఉండటం ద్వారా సకాలంలో చర్యలు చేపట్టడంతోపాటు మోసగాళ్లు దేశం విడిచి పారిపోకుండా అడ్డుకునేందుకు వీలుంటుందని అధికారులంటున్నారు. పాస్‌పోర్ట్ నంబర్, ఇతర వివరాలు లేకపోవడంతో ఉద్దేశపూర్వక రుణ ఎగవేతదారులు దేశం విడిచి వెళ్లకుండా అధికారులు అడ్డుకోలేకపోతున్నారు.

ఈ నెలారంభంలో కేంద్ర ప్రభుత్వం రూ.50 కోట్లు అంతకు పైగా రుణాలు తీసుకున్నవారికి పాస్‌పోర్ట్ వివరాలు సమర్పించడం తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. అంతే కాదు, పరారీ నేరగాళ్ల నుంచి బకాయిలు రికవరీ చేసేందుకు వారి ఆస్తులను జప్తు చేసి, వేలం వేసేందుకు వీలుగా ప్రత్యేక చట్టం తీసుకురాబోతోంది. ఇందుకు సంబంధించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం గత వారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. రూ.100 కోట్లు లేదా అంతకుమించి రుణాలు ఎగవేసి పరారైన వారి నుంచి బకాయిలు రాబట్టేందుకు కేంద్రం ఈ చట్టాన్ని ప్రయోగించనుంది.

రద్దయిన పెద్ద నోట్లతో
కాగితం దిమ్మల తయారీ

» ఆర్‌బిఐ వెల్లడి

న్యూఢిల్లీ: బ్యాంకుల్లో జమ చేసిన రద్దయిన పెద్ద నోట్లను ప్రాసెసింగ్ చేశాక వాటిని చిన్న ముక్కలుగా కోసి కాగితం దిమ్మలను తయారు చేస్తున్నట్లు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) వెల్లడించింది. ఆ దిమ్మలను టెండర్ ప్రక్రియ ద్వారా విక్రయిస్తున్నట్లు తెలిపింది. సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆర్‌బిఐ ఈ విషయం చెప్పింది. 2016, నవంబరు 8న మోదీ సర్కారు రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. 2017, జూన్ 30 వరకు రూ.15.28 లక్షల కోట్ల విలువైన రద్దయిన పెద్ద నోట్లు బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగి వచ్చినట్లు గతంలో ఆర్‌బిఐ అంచనా వేసింది. "బ్యాంకుల్లో జమ చేసిన రూ.500, రూ.1000తో పాటు పాత నోట్లన్నింటినీ ఆధునిక కరెన్సీ తనిఖీ యంత్రాల సాయంతో లెక్కించి, ప్రాసెసింగ్ చేయడం జరుగుతుంది. ఆ తర్వాత వాటిని మెషీన్ల ద్వారా తుక్కుగా చించేసి, ఆపై కాగితం దిమ్మలుగా తయారు చేస్తున్నాం" అని ఆర్‌బిఐ తెలిపింది. ఆర్‌బిఐకి చెందిన పలు శాఖల్లో 59 అధునాతన కరెన్సీ వెరిఫికేషన్ అండ్ ప్రాసెసింగ్ మెషీన్ల ద్వారా రద్దయిన పెద్ద నోట్లను లెక్కిస్తున్నారు.

ఈ వారం పెరిగే ఆస్కారం

(మార్చి 19-23 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ఆస్ట్రో గైడ్

గత వారం నిఫ్టీ : 10195 (-32)

నిఫ్టీ గత వారం 10479-10180 నడుమ సంచరించి 32 పాయింట్ల నష్టంతో కనిష్ఠ స్థాయికి చేరువలో నెగిటివ్ ధోరణిలో క్లోజయింది. ఇలా జరగడం వరుసగా ఇది మూడో వారం కావడం వల్ల ఈ వారం ఎగువకు పయనించే ఆస్కారం కనిపిస్తోంది.

- చంద్రుడు కుంభ, మీనరాశుల సంచార సమయంలో నిఫ్టీ 10420-10180 పాయింట్ల పరిధి ఏర్పడింది. గత సోమవారంనాడు గరిష్ఠ స్థాయిని ఛేదించినా నిలదొక్కుకోలేకపోయింది. ఈ వారంలో మరింత పైకి కదులుతుందా లేక కనిష్ఠ స్థాయి కన్నా దిగజారుతుందా వేచిచూడాలి.
- స్వల్పకాలిక ట్రెండ్ చాలా బేరిష్‌గా మారింది. మధ్యకాలిక ధోరణిలో తటస్థంగాను, దీర్ఘకాలిక ధోరణిలో బుల్లిష్‌గాను ఉంది. 10400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలంలో కూడా బుల్లిష్ అవుతుంది.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 10386, 10600, 10474, 10160 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- ప్రస్తుతం నిఫ్టీ ఒక్క 200 డిఎంఎ కన్నా పైన ట్రేడవుతోంది. నిఫ్టీ 200 డిఎంఎ కన్నా పైన ఉండడం 50 డిఎంఎ 200 డిఎంఎ కన్నా పైకి రావడం (గోల్డెన్ క్రాస్) దీర్ఘకాలిక ట్రెండ్ బుల్లిష్‌గా ఉందనేందుకు సంకేతం.

గ్రహగతులివే..

- మీనంలోని రేవతి పాదం 3 నుంచి వృషభంలోని రోహిణి పాదం 3 మధ్యలో చంద్ర సంచారం
- మీనంలోని ఉత్తరాభాద్ర పాదం 1-2 మధ్యలో రవి సంచారం
- మీనంలోని రేవతి పాదం 2లో బుధ సంచారం
- మీనంలోని రేవతి పాదం 2-3 మధ్యలో శుక్ర సంచారం
- ధనుస్సులోని మూల పాదం 3లో కుజ సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 1లో సింహ నవాంశలో శని సంచారం
- తులలోని విశాఖ పాదం 3లో మిథున నవాంశలో బృహస్పతి వక్రగతి సంచారం
- కర్కాటకంలో రాహువు, మకరంలో కేతువు ధనుస్సు, మిథున నవాంశల్లో సంచారం.

బ్రేకౌట్ స్థాయి : 10400
బ్రేక్‌డౌన్ స్థాయి : 10050
నిరోధ స్థాయిలు : 10345, 10425, 10500 (10270 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 10050, 9975 (10125 దిగువన బేరిష్)

ఇన్వెస్టర్లకు సూచన

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

మిడ్‌సెషన్ మెరుగు (సోమవారానికి)

తిథి : చైత్ర శుద్ధ విదియ **నక్షత్రం :** రేవతి

కృత్తిక, ఉత్తర, ఉత్తరాషాఢ నక్షత్ర జాతకులు, మేష, సింహ రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 2.10

ధోరణి : గ్రహగతులను బట్టి నిస్తేజంగా ప్రారంభమై 10.25 నుంచి 2.40 వరకు మెరుగ్గా ఉండి తదుపరి చివరి వరకు నిస్తేజంగా ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ 10.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 2.40 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2.45 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపులో క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం : 10235, 10270
మద్దతు స్థాయిలు : 10155, 10120

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

సముద్ర రవాణా రంగంలోకి
మహీంద్రా లాజిస్టిక్స్

ముంబై : మహీంద్రా లాజిస్టిక్స్ సముద్ర రవాణా రంగంలోకి ప్రవేశించే సన్నాహాల్లో ఉంది. ఇందుకు సంబంధించిన భాగస్వామ్యాల కోసం రెండు యూరోపియన్ కంపెనీలతో చర్చలు జరుపుతున్నట్టు కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ పిరోజ్‌షా సర్కారీ తెలిపారు. దేశంలోని కోస్తా తీరాల్లో విదేశాలకు చెందిన నౌకలు కార్యకలాపాలు సాగించేందుకు ప్రభుత్వం అనుమతిస్తున్న నేపథ్యంలో విదేశీ కంపెనీలతో జట్టు కట్టేందుకు సిద్ధమవుతున్నట్టు సర్కారీ చెప్పారు. ఇప్పటికే తమ కంపెనీ రోడ్డు, రైలు రవాణా రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తోందని, ఇప్పుడు సముద్ర రవాణా రంగంపై ఆసక్తి చూపుతున్నట్టు పిరోజ్‌షా సర్కారీ తెలిపారు.

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 3.90 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	330.00	చిత్తూరు	363.00
వరంగల్	332.00	చెన్నై	370.00
విజయవాడ	317.00	నమక్కల్	360.00
గోదావరి	317.00	బెంగళూరు	365.00
విశాఖపట్నం	325.00	ముంబై	370.00

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	70.00	విజయవాడ	71.00
కరీంనగర్	71.00	గుంటూరు	71.00
వరంగల్	70.00	ఒంగోలు	73.00
మహబూబ్‌నగర్	70.00	చిత్తూరు	73.00
కర్నూలు	70.00	నెల్లూరు	73.00
విశాఖపట్నం	74.00	అనంతపురం	72.00
గోదావరి	71.00		

మద్దతు జోన్ 9950-10000



వి. సుందర్ రాజా



నిఫ్టీ మైనర్ రికవరీతో ప్రారంభమై ప్రధాన నిరోధం 10500 వరకు వెళ్లినా నిలదొక్కుకోలేక వారంలో చివరి రెండు రోజుల్లో బలమైన రియాక్షన్ సాధించింది. చివరికి బలహీనంగా క్లోజ్ కావడమే కాకుండా వీక్లీ చార్టుల్లో కూడా బలహీనతను నమోదు చేయడం మరింత బలహీనత ఉండవచ్చుననేందుకు సంకేతం. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 10300 వద్ద బ్రేక్‌డౌన్ కావడం కూడా మరింత బలహీనతను సూచిస్తోంది. టెక్నికల్‌గా ఇప్పటికీ స్వల్పకాలిక కరెక్షన్ కొనసాగుతోంది. మరోసారి ప్రధాన మద్దతు జోన్ 10000-9950 చేరువకు వచ్చింది. మరింత డౌన్ ట్రెండ్ ఏర్పడితే మార్కెట్ స్వల్పకాలిక ఓవర్‌సోల్డ్ స్థితిలో ప్రవేశిస్తుంది. ఇప్పుడు ఈ కీలక స్థాయిలో బలమైన కన్సాలిడేషన్ సాధిస్తుందో లేదో వేచి చూడాలి.

సోమవారం స్థాయిలివే...
నిరోధం : 10240, 10300
మద్దతు : 10140, 10100

బుల్లిష్ స్థాయిలు..

ప్రధాన నిరోధం 10300. ఆ పైన బలంగా క్లోజయినప్పుడే మైనర్ అప్‌ట్రెండ్ మరింతగా కొనసాగుతుంది. ప్రధాన నిరోధం, టార్గెట్ 10500. ఇదే స్వల్పకాలిక ట్రెండ్‌ను నిర్ణయించే స్థాయి కావడం వల్ల రానున్న కొద్ది రోజుల్లో ఇక్కడ బలమైన కన్సాలిడేషన్ తప్పనిసరి.

బేరిష్ స్థాయిలు..

ప్రధాన మద్దతు స్థాయి 10100. ఇక్కడ విఫలమైతే మరింత అప్రమత్తతను సూచిస్తుంది. ప్రధాన మద్దతు జోన్ 10000-9950. ఇక్కడ రికవరీ ఏర్పడవచ్చు.

- బ్యాంక్ నిఫ్టీ గత కొద్ది రోజుల్లో కీలక నిరోధం, గత వారంలో ఏర్పడిన టాప్, ప్రధాన గరిష్ఠ స్థాయి 25000 వద్ద నిలదొక్కుకోలేకపోతోంది. ప్రధాన మద్దతు స్థాయి 24000కి చేరువయింది.

స్వల్పకాలిక వ్యూహం : 10000 వద్ద బలమైన కన్సాలిడేషన్ ఏర్పడినప్పుడు మాత్రమే గట్టి స్టాప్‌లాస్‌తో స్వల్పకాలిక బై పొజిషన్లపై దృష్టి పెట్టవచ్చు.

పాటర్న్ : నవంబరు, డిసెంబరు నెలల్లో ఏర్పడిన వీక్లీ చార్టుల్లో రెండు బాటమ్‌లను నిఫ్టీ నమోదు చేసింది. గత వారంలో "ఏటవాలుగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్ లైన్" కన్నా దిగజారడం మరింత అప్రమత్త సంకేతం. 10500 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" దగ్గర నిరోధం ఉంది. గత వారం 20, 50 డిఎంఎల వద్ద విఫలం కావడం కూడా బలహీనత సంకేతం. ఇప్పుడు ఇండెక్స్ 200 డిఎంఎకి చేరువవుతోంది. ఇక్కడ రికవరీ తప్పనిసరి.

టైమ్ : ఈ సూచిక ప్రకారం మంగళవారంనాడు తదుపరి రివర్సల్ ఉంది.

సూచన : స్వల్పకాలిక ట్రేడర్లు/ఇన్వెస్టర్లు బై పొజిషన్లు హోల్డ్ చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

■ వి.సుందర్ రాజా,
www.sundartrends.in






తల్లిదండ్రులు ఇచ్చే పాకెట్ మనీతో జల్సా చేస్తున్నారా? అయితే ఒక్కసారి ఆలోచించండి. పాకెట్ మనీలో నెలకు రూ.500 చొప్పున ఆదా చేస్తూ కూడా స్టాక్ మార్కెట్లో మదుపు చేసి చిన్న వయసు నుంచే లాభాలు కళ్లజూడవచ్చు. అనవసరంగా ఖర్చులు చేయకుండా పద్ధతి ప్రకారం పెట్టుబడులు పెడుతూ వెళితే ఒక వయస్సు వచ్చేసరికి కుబేరులైపోవచ్చు. అలాంటి అసక్తి ఉన్న నవ యువత అనుసరించాల్సిన వ్యూహాన్ని రిలయన్స్ సెక్యూరిటీస్ సిఇఒ బి గోప కుమార్ వివరిస్తున్నారు..

పాకెట్ మనీతో ట్రేడింగ్

కుర్రకారుకు భలే అవకాశం

బిందువు బిందువు చేరి సింధువు అవుతుంది. పైసా పైసా కూడబెడితేనే వందలు, వేలు అవుతాయి. అదృష్టం కలిసొస్తే కోట్లు కూడా అవుతాయి. కొద్దిపాటి రిస్కుకు సిద్ధపడి మంచి లాభాలు ఆర్జించాలనుకునే వారికి స్టాక్ మార్కెట్‌ను మించిన పెట్టుబడి మార్గం లేదు. నిజానికి ఇదో సుదీర్ఘ పరుగు పందెం. ఎంత త్వరగా ఈ పరుగు ప్రారంభిస్తే అంత త్వరగా మన లక్ష్యాన్ని చేరుకుంటాం. ఇక్కడ పదేళ్ల తేడా కూడా పెట్టుబడుల విలువలో పెద్ద మార్పును తీసుకొస్తుంది. అందుకే కాలేజీ రోజుల నుంచే పాకెట్ మనీ నుంచి కొంత సొమ్మును పొదుపు చేస్తూ పెట్టుబడులకు సిద్ధంకావడం మంచిది. ఇలా నెలకు రూ.500, రూ.1,000 పొదుపు చేసి ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ ద్వారా లేదా నేరుగా కూడా స్టాక్ మార్కెట్లో పెట్టుబడులకు దిగొచ్చు.



మ్యూచువల్ ఫండ్స్

ఈకాలం యువతలో చాలా మంది తల్లిదండ్రుల నుంచి పెద్ద మొత్తంలోనే పాకెట్ మనీ తీసుకుంటున్నారు. ఈ మొత్తాన్ని స్నేహితులతో సరదాల కోసమే ఖర్చు చేస్తున్నారు. ప్రతి నెలా పిజ్జాలు, సినిమాలు, షికార్లు, దురలవాట్లకు చేసే మొత్తం లెక్కేస్తే పెద్దమొత్తమే ఉంటుంది. ఉన్నత కుటుంబాలకు చెందిన యువత అయితే నెలకు ఎంత లేదన్నా రూ.5,000 వరకు వీటి కోసం తగలేస్తున్నారు. ఇందులో కనీసం 10 శాతం పొదుపు చేసినా, నెలకు రూ.500 చొప్పున సిప్ ద్వారా ఈక్విటీ ఆధారిత మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసి దీర్ఘకాలంలో మంచి లాభాలు ఆర్జించవచ్చు.

రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా, వారెన్ బఫెట్‌లాంటి ఇన్వెస్ట్‌మెంట్ మాంత్రికులు.. ఇలా చిన్నప్పటి నుంచే మార్కెట్లో కొద్దిపాటి పెట్టుబడులతోనే తమ ఆస్తుల విలువను వేల కోట్లకు పెంచుకున్నారు. గత ఐదేళ్లలో మన దేశంలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పథకాలు ఇన్వెస్టర్లకు సగటున ఏటా 15-20 శాతం చొప్పున రాబడులు పంచాయి. సగటున ఏటా 20 శాతం రాబడులు ఉన్నా నాలుగేళ్లలోనే పెట్టిన పెట్టుబడులు రెట్టింపవుతాయి. నెలకు ఒక వీకెండ్‌లో ఫ్రెండ్స్‌తో రెస్టారెంట్‌కు వెళ్లి పిజ్జా తినడం మానుకున్నా, నెలకు రూ.500 పొదుపు చేసి, సిప్ పద్ధతిలో ఈ పథకాల్లో ఇన్వెస్ట్ చేయడం పెద్ద కష్టమేం కాదు.

సిప్ పద్ధతిలో షేర్ల కొనుగోలు



ప్రస్తుతం చాలా కుటుంబాల్లో పెద్దలు స్టాక్ మార్కెట్లో పెట్టుబడుల గురించి చర్చిస్తుంటారు. ఆ ఇళ్లలో ఉండే కుర్రకారు కూడా ఈ చర్చల్లో పాల్గొనాలి. లేదా కనీసం ఆ చర్చల్ని శ్రద్ధగా అయినా వినాలి. ఇలా స్టాక్ మార్కెట్‌పై అవగాహన ఏర్పడిన తర్వాత చాలా మంది యువకులు ఇటీవల సిప్ పద్ధతిలో నేరుగా షేర్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేస్తున్నారు. పాకెట్ మనీలో కొంత మిగుల్చుకుని మంచి కంపెనీల షేర్లను ఎప్పటికప్పుడు పోర్టుఫోలియోలో చేర్చుకుంటుంటే దీర్ఘకాలంలో మంచి రాబడులు కళ్లజూడవచ్చు. ఇలాంటి పెట్టుబడులతో కాలం కలిసొస్తే మీరూ మరో వారెన్ బఫెట్ లేదా రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా కూడా కావచ్చు.

స్టాక్స్‌లో ట్రేడింగ్


రిస్కుకు సిద్ధమైతే పాకెట్ మనీలోంచి మిగిల్చిన సొమ్ముతో స్టాక్స్‌లో ట్రేడింగ్ కూడా చేయవచ్చు. కాకపోతే రోజూ గంటల తరబడి మొబైల్ ఫోన్లకు అతుక్కుపోయి ఉబుసుపోని బాతాఖానీలకు గుడ్‌బై చెప్పాలి. రోజూ మార్కెట్ గురించి, కంపెనీల తాజా ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకుంటూ ఉండాలి. రోజులో కనీసం పావు గంట నుంచి అరగంటసేపైనా ట్రేడింగ్ కోసం కేటాయించాలి. ఇప్పుడు మొబైల్ ఫోన్ ద్వారా కూడా స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ లావాదేవీలు పూర్తి చేయవచ్చు. మైనారిటీ తీరిన దగ్గరి నుంచి ఎంత త్వరగా ఈ ట్రేడింగ్ ప్రారంభిస్తే మార్కెట్‌పైనా, పెట్టుబడులపైనా అంత అవగాహన ఏర్పడుతుంది.



వాళ్లు ఇ-తరం పిల్లలు

మిలీనియల్స్ అనగానే భవిష్యత్ గురించి ఎంత మాత్రం ఆలోచించకుండా స్మార్ట్‌ఫోన్లు, సరదాల కోసం ఇష్టారాజ్యంగా ఖర్చు చేస్తారన్న భావన చాలా మందిలో ఉంటుంది. కానీ నేటి తరం మిలీనియల్స్ (22-30 ఏళ్ల వయసున్న వారు) ఇందుకు భిన్నంగా ఉన్నట్టు తాజా సర్వేలో వెల్లడైంది.

తమ అభిరుచులకు ప్రాధాన్యం ఇస్తూనే సంపద సృష్టి కోసం తాము సంపాదించే సొమ్ములో కొంత మొత్తాన్ని కొత్తతరం యువత పొదుపు చేస్తున్నారు. నెలకు 25,000 రూపాయలకన్నా తక్కువగా సంపాదించే వారు ఇందులో కనీసం 11 శాతం (రూ.2,750) పొదుపు చేస్తున్నట్టు ఫిన్‌టెక్ స్టార్టప్ సేవ్‌అభి సర్వేలో వెల్లడైంది. ఇక నెలవారీగా 25,000-50,000 సంపాదించే మిలీనియల్స్ పొదుపు 7.9 శాతం ఉండగా.. 50,000 రూపాయలకు మించి సంపాదించే వారి పొదుపు 8.1 శాతంగా ఉంది. ఈ మూడు కేటగిరీల్లోని మిలీనియల్స్ ఇంటి అద్దె, సొంత ఇంటి కోసం వరుసగా 35 శాతం, 21.5 శాతం, 33.5 శాతం మేర ఖర్చు చేస్తున్నారు. అదేవిధంగా భోజనానికి, బయటకు వెళ్లేందుకు ఖర్చు చేస్తున్నది వరుసగా 12.3 శాతం, 21 శాతం, 11 శాతంగా ఉంది. 5,000 మంది మిలీనియల్స్ నుంచి తీసుకున్న సమాచారం ఆధారంగా ఈ సర్వే నివేదికను రూపొందించారు. మిలీనియల్ ఇన్వెస్టర్లలో 97 శాతం మంది పురుషులే కావడం విశేషం. కాగా పొదుపు చేసే ఆసక్తి ఉన్న మిలీనియల్స్‌ను దృష్టిలో ఉంచుకుని పలు ఫిన్‌టెక్ స్టార్టప్‌లు ఇన్నోవేటివ్ కాన్సెప్ట్‌లను అందుబాటులోకి తెస్తున్నాయి. ఉదాహరణకు.. సేవ్ ది చేంజ్ పేరుతో సేవ్ అభి కొత్త కాన్సెప్ట్‌ను తెచ్చింది. దీని ప్రకారం.. ఆటోమెటిక్‌గా పొదుపు చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ సొమ్మును మ్యూచువల్ ఫండ్స్ ఇతర పెట్టుబడి సాధనల్లో పెట్టుబడి పెట్టేందుకు వీలు కల్పిస్తోంది. ఈ రోజుల్లో నెలకు కనీసం 500 రూపాయలతో కూడా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో చాలా మంది మిలీనియల్స్ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. మొబైల్ ఫోన్ల కొనుగోలు, రీచార్జ్‌లు, సరదాల కోసం వెచ్చించే మొత్తంతో పోల్చితే మిలీనియల్స్ పొదుపు చేసేది చాలా తక్కువగానే ఉంటున్నప్పటికీ.. రానున్న కాలంలో వీరి పొదుపు మొత్తాలు పెరిగేందుకు దోహదపడవచ్చని పరిశీలకులు అంటున్నారు. ఆర్థిక క్రమశిక్షణను పెంచుకోవడం వల్ల మిలీనియల్స్ పొదుపు మొత్తాలు పెరిగి భవిష్యత్‌లో మరింత అధికంగా సంపద సృష్టికి ఆస్కారం ఉంటుందని చెబుతున్నారు.



పిడిలైట్ ఇండస్ట్రీస్

ఫెవిక్విక్, ఫెవికాల్ తదితర బ్రాండ్లతో అధెసివ్స్, సీలెంట్స్, వాటర్ ప్రూఫింగ్, కన్‌స్ట్రక్షన్ కెమికల్స్, ఇండస్ట్రియల్ రెసిన్స్, పాలిమర్స్ తదితర ఉత్పత్తులను తయారు చేస్తున్న కంపెనీ పిడిలైట్ ఇండస్ట్రీస్. అధెసివ్స్, సీలెంట్స్ విక్రయాల ద్వారా 55 శాతం రాబడి వస్తుండగా, కన్‌స్ట్రక్షన్, పెయింట్ కెమికల్స్ ద్వారా 19 శాతం, ఆర్ట్, క్రాఫ్ట్ మెటీరియల్స్ ద్వారా 10 శాతం రాబడి వస్తోంది. ఇండస్ట్రియల్ ఉత్పత్తుల ద్వారా మరో 15 శాతం ఆదాయం వస్తోంది. ఇందులో ఇండస్ట్రియల్ అధెసివ్స్ ద్వారా 5 శాతం, రెసిన్స్ ద్వారా 5 శాతం, పిగ్మెంట్స్ ద్వారా 5 శాతం ఆదాయం లభిస్తోంది. దాదాపు అన్ని విభాగాల్లోనూ మార్కెట్లో అగ్రగామిగా ఉంది. డాక్టర్ ఫిక్సిట్, ఎంసీల్, స్టీల్ గ్రిప్ తదితర బ్రాండ్లను విస్తృతమమైన నెట్‌వర్క్‌తో దేశవ్యాప్తంగా విక్రయిస్తోంది. పిగ్మెంట్ వయలెట్ ఉత్పత్తిని దేశంలో చేపట్టిన తొలి కంపెనీ ఇది. స్పెషాలిటీ పాలిమర్స్, నాన్ వూవెన్, ఫ్లోక్డ్ ఫ్యాబ్రిక్స్, కన్‌స్ట్రక్షన్ కెమికల్స్ విభాగాల్లో కూడా మార్కెట్ లీడర్‌గా ఉంది. దాదాపు 80 దేశాలకు తన ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది.

అమెరికా, యూరప్, ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాలకు అధికంగా ఎగుమతులున్నాయి. 2016-17లో ఎగుమతుల ద్వారా 484.2 కోట్ల రూపాయల టర్నోవర్‌ను సాధించింది. అమెరికా, బ్రెజిల్, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, ఈజిప్ట్, దుబాయ్, శ్రీలంకల్లో ప్లాంట్లను కలిగి ఉంది. కొత్తగా ఇథియోపియా, శ్రీలంక ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. విదేశాల్లో 17 అనుబంధ కంపెనీలను కలిగి ఉంది. రెసిన్ ఫ్లోరింగ్, ఫ్లోర్ కోటింగ్ మార్కెట్లో రూ.110.40 కోట్ల టర్నోవర్‌ను కలిగిన సిఐపివై పాలియురెథిన్ కంపెనీలో 70 శాతం వాటాలను ఈ మధ్యనే కొనుగోలు చేసింది. గత వారమే షేర్ల బైబ్యాక్‌ను పూర్తి చేసింది. రూ.1,000 వద్ద దాదాపు రూ.500 కోట్ల విలువైన షేర్లను బైబ్యాక్ చేసింది. ఇటీవలి ఆర్థిక ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో పాటు వాల్యూమ్స్ పెరుగుదల, కొత్త మార్కెట్లలోకి ప్రవేశం, వినూత్న మార్కెటింగ్ వ్యూహాలు, అడ్వర్‌టైజింగ్‌తో దేశీయ అధెసివ్స్ మార్కెట్లో 70 శాతం వాటాను కలిగి ఉంది. చైనా, అమెరికా దేశాలతో అధెసివ్స్ తలసరి వినియోగం చాలా తక్కువ. అమెరికాలో 9.1 కిలోల అధెసివ్స్ వినియోగిస్తుండగా భారత్‌లో కేవలం 1.5 కిలోల అధెసివ్స్‌ను మాత్రమే వినియోగిస్తున్నాం. దీంతో భవిష్యత్ వాల్యూమ్స్ వృద్ధిపై కంపెనీ ఆశావహ దృక్పథంతో ఉంది.



ఫండమెంటల్స్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తృతీయ త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన విక్రయాలు 17.3 శాతం వృద్ధి చెంది రూ.1,533 కోట్లకు చేరుకున్నాయి. స్థూల లాభం 28 శాతం పెరుగుదలతో రూ.372 కోట్లకు చేరుకుంది. కాగా నికర లాభం 18 శాతం వృద్ధితో రూ.239 కోట్లకు చేరుకుంది. ఇందులో అమెరికా అనుబంధ కంపెనీల ఫలితాలను చేర్చలేదు. రిటర్న్ ఆన్ ఈక్విటీ 25 శాతంగా ఉంది. ఇపిఎస్ 18 శాతం వృద్ధి చెంది రూ.4.68కి చేరుకుంది. ఇటీవల వివిధ ఉత్పత్తుల ధరలను 5 నుంచి 10 శాతం మేర పెంచింది. వ్యయాలను తగ్గించుకునేందుకు థర్డ్ పార్టీని నియమించింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి ఇపిఎస్ రూ.19.2గా అంచనా వేస్తున్నారు. అలాగే 2018-19 ఆర్థిక సంవత్సరానికి ఇపిఎస్ రూ.20 సాధించగలదని అంచనా. ఆర్ఒసిఇ కూడా గరిష్ఠంగా 35 శాతం పైగా ఉంది. దీంతో ఇటీవలి కాలంలో సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా కూడా పెరిగింది. 2017, డిసెంబరు నాటికి సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా 19.44 శాతానికి పెరిగింది. ఎఫ్ఐఐల వాటా 10.99 శాతం కాగా, మ్యూచువల్ ఫండ్స్ వాటా 3.76 శాతం. మిగిలిన వాటా ఆర్థిక సంస్థల చేతుల్లో ఉంది. కంపెనీలో ప్రమోటర్ల వాటా 69.59 శాతం.

టెక్నికల్స్

ప్రస్తుత బేర్ మార్కెట్ పరిస్థితుల్లో గరిష్ఠ స్థాయిల్లో పటిష్ఠంగా ట్రేడవుతున్న షేర్లలో ఇది ఒకటి. జీవిత కాల గరిష్ఠ స్థాయికి అతి దగ్గరగా ట్రేడవుతోంది. అలాగే 13 వారాల ఫ్లాట్ బేస్‌ను ఏర్పాటు చేసింది. శుక్రవారం నాడు ఇన్వర్టెడ్‌హెడ్ అండ్ షోల్డర్ ప్యాట్రన్ బ్రేకౌట్ భారీ వాల్యూమ్స్ జరిగింది. స్వల్ప, దీర్ఘకాలిక చలన సగటులకు చాలా ఎగువన ట్రేడవుతోంది. అలాగే ఇండికేటర్లన్నీ బుల్లిష్ ధోరణిని ధ్రువీకరిస్తున్నాయి. గత పది రోజులుగా వ్యాల్యూమ్స్ పెరుగుదల కనిపిస్తోంది. ఇందులో అక్యుములేషన్ జరుగుతోంది. విలియం ఓ నీల్ రిలేటివ్ ప్రైస్ స్ట్రెంత్ 64తో మెరుగుపడుతూ ఉంది. ఈ షేరు వచ్చే వారం రూ.911 కు ఎగువన ట్రేడవుతూ ఉంటే కొనుగోలు చేయవచ్చు. టెక్నికల్ స్టాప్‌లాస్ రూ.880. స్వల్పకాలిక లక్ష్యం రూ.980 నుంచి రూ.1,050. వచ్చే ఆర్థిక సంవత్సర లక్ష్యం రూ.1.240.

- టి బ్రహ్మాచారి
హెడ్, అసోసియేషన్ ఆఫ్ టెక్నికల్ మార్కెట్ ఎనలిస్ట్, హైదరాబాద్ చాప్టర్
tbchary@gmail.com

ఫండ్ బజార్

యుటిఐ మ్యూచువల్ ఫండ్

UTI Mutual Fund

యుటిఐ ఎఫ్‌టిఫ్ సీరిస్ XXVIII-XIII (1134 రోజులు) పేరుతో సరికొత్త స్కీమ్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెట్టి మంచి రిటర్నులు వచ్చే విధంగా చూడాలన్నది ఈ స్కీమ్ ఉద్దేశం. ఆదాయం కేటగిరీలో వచ్చిన క్లోజ్ ఎండెడ్ స్కీమ్ ఇది. మార్చి 12న ప్రారంభమైన ఈ నూతన ఫండ్ ఆఫర్ 26వ తేదీన ముగుస్తుంది. ఎంట్రీ, ఎగ్జిట్ లోడ్ ఏమీ లేదు. కనీసం 5,000 రూపాయల పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది.

ఐడిఎఫ్‌సి మ్యూచువల్ ఫండ్

IDFC MUTUAL FUND

ఐడిఎఫ్‌సి ఫిక్స్‌డ్ టర్మ్ సీరిస్ -143 (1133 రోజులు) పేరుతో ఈ స్కీమ్‌ను తెచ్చారు. డెట్, మనీ మార్కెట్ సాధనాల్లో పెట్టుబడులు పెట్టి ఇన్వెస్టర్ల రాబడులను పెంచాలన్నది ఈ స్కీమ్ ఉద్దేశం. ఆదాయం కేటగిరీలో వచ్చిన క్లోజ్ ఎండెడ్ స్కీమ్ ఇది. మార్చి 15న ప్రారంభమైన ఈ నూతన ఫండ్ ఆఫర్ 19వ తేదీన ముగుస్తుంది. ఇందులో కనీస పెట్టుబడి.

రిలయన్స్ మ్యూచువల్ ఫండ్

RELIANCE Mutual Fund

రిలయన్స్ క్యాపిటల్ బిల్డర్ ఫండ్ 4- సీరిస్ ఇ పేరుతో ఈ స్కీమ్‌ను ప్రారంభించారు. ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సాధనాల్లో పెట్టుబడులు పెట్టి ఇన్వెస్టర్ల దీర్ఘకాలిక పొదుపు లక్ష్యాలకు అనుగుణంగా మూలధనాన్ని పెంచాలన్నది ఈ పథకం ఉద్దేశం. ఈ స్కీమ్‌లోని కొంత మొత్తాన్ని ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సెక్యూరిటీలకు మళ్లించనున్నారు. నికరంగా ఇన్వెస్టర్ల రిటర్నులను పెంచాలన్న లక్ష్యంతో స్కీమ్‌ను ప్రారంభించినట్టు సంస్థ చెబుతోంది. గ్రోత్ కేటగిరీలో వచ్చిన క్లోజ్ ఎండెడ్ స్కీమ్ ఇది. మార్చి 13న ప్రారంభమైన ఈ నూతన ఫండ్ ఆఫర్ 27వ తేదీన ముగియనుంది. కనీస పెట్టుబడి 5,000 రూపాయలు.

ఆదిత్య బిర్లా నుంచి యాక్టివ్ అష్యూర్

ADITYA BIRLA HEALTH

ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్.. యాక్టివ్ అష్యూర్ పేరుతో హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకువచ్చింది. ఇది ఇండివిడ్యువల్, ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీ. ఇండివిడ్యువల్ పాలసీకి సంబంధించి కనీస వయోపరిమితి ఐదేళ్లు. గరిష్ఠ వయోపరిమితి లేదు. ఫ్యామిలీ ఫ్లోటర్ పాలసీలో ఆరుగురు సభ్యులకు బీమాను తీసుకోవచ్చు (ఇద్దరు పెద్దలు, నలుగురు చిన్నారులు). సింగిల్ పాలసీలో 25 ఏళ్ల వయసు వారిని కూడా చిన్నారులుగా గుర్తించటం దీని ప్రత్యేకత. వాల్యూ యాడెడ్ సేవలను కూడా ఈ పాలసీల ద్వారా ఆదిత్య బిర్లా ఆఫర్ చేస్తోంది. ఆయుర్వేద, యునాని, సిద్ధ, యోగ, నేచురోపతి, హోమియోపతి చికిత్సలు కూడా ఈ పాలసీ కవర్ చేస్తోంది.

ఇన్‌పుట్ టాక్స్ ప్రయోజనం వినియోగదారులకు చేరాల్సిందే..



రాంబాబు గొండాల

పరోక్ష పన్ను వ్యవస్థలో వ్యాపారస్తుడు జవాబుదారీ అయినప్పటికీ అంతిమ భారం పడేది వినియోగదారుని మీదనే. దీన్ని దృష్టిలో పెట్టుకుని జిఎస్‌టిలో కూడా పన్ను రేట్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రేట్లను సవరిస్తూ వచ్చారు. అలాగే ఇంతకుముందు సెన్‌వ్యాట్ సదుపాయం లేని కొన్ని రకాల సరఫరాలపై ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ సౌలభ్యం కల్పించటం జరిగింది. దీని ముఖ్య ఉద్దేశం.. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ సౌకర్యం ద్వారా తయారీదారునికి లేదా వ్యాపారస్తుడికి చాలా వరకు ఖర్చు తగ్గుతుంది. దీంతో అతను తక్కువ ధరకే తన వస్తువును వినియోగదారుడికి అందించటానికి అవకాశం ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని తగ్గించిన రేట్లు లేదా అందించిన ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ ద్వారా ఒక వ్యాపారస్తునికి ఎంత మేర లాభం జరుగుతుందో ఆ మొత్తం కచ్చితంగా వినియోగదారునికి అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఈ విధంగా అపార్ట్‌మెంట్స్ నిర్మాణం చేపట్టే బిల్డర్స్‌కు కూడా కొత్తగా ఇన్‌పుట్ టాక్స్ సౌకర్యాన్ని కల్పించటం జరిగింది. ఒకప్పుడు నగరాలకే పరిమితమైన అపార్ట్‌మెంట్ సంస్కృతి చిన్న, మధ్య తరహా పట్టణాలకు పాకింది. గేటెడ్ కమ్యూనిటీస్ రూపంలో బిల్డర్లు వీటిల్లో సకల సదుపాయాలను కల్పిస్తుండటంతో మధ్య, ఎగువ మధ్య తరగతి వర్గమేకాకుండా సంపన్నవర్గాలు ఈ అపార్ట్‌మెంట్లను కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నాయి.

మరి ఈ అపార్ట్‌మెంట్స్‌కు సంబంధించి జిఎస్‌టిలో పన్ను ఎలా ఉంటుందో చూద్దాం. వస్తు సేవల పన్ను చట్టం రావటానికి పూర్వం అపార్ట్‌మెంట్స్‌కు సంబంధించి 4.5 సర్వీస్ టాక్స్ ఉండగా, వ్యాట్ 1 నుంచి 4 శాతం మేర (ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా) ఉంది. తెలుగు రాష్ట్రాల్లో చూస్తే ఈ రెండు కలిపి దాదాపు 6 శాతంగా ఉంది. ఇప్పుడు జిఎస్‌టిలో దీన్ని 12 శాతం చేయటం జరిగింది. అంటే దాదాపు 6 శాతం పెరిగింది. కాని, ఇక్కడ కొత్తగా ఇన్‌పుట్ టాక్స్ సౌకర్యం బిల్డర్స్‌కు అందుబాటులోకి వచ్చిందన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. అంటే, బిల్డర్స్ కొనే సిమెంట్, స్టీల్, మార్బుల్ లేదా గ్రానైట్, పెయింట్స్ మొదలైన వాటి మీద ఇంతకు పూర్వం ఎలాంటి ఇన్‌పుట్ టాక్స్ వచ్చేది కాదు. అలాగే ఇంజనీర్స్, ఆర్కిటెక్ట్, ఇతర సేవలకు సంబంధించి తాను కట్టే సర్వీస్ టాక్స్ మీద బిల్డర్ ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ లేదా సెన్‌వ్యాట్ తీసుకునే అవకాశం ఉండేది కాదు. ఇప్పుడు ఇన్‌పుట్ టాక్స్ సౌకర్యంతో బిల్డర్‌కు దాదాపు 7 శాతం నుంచి 8 శాతం మేర లాభం చేకూరనుందని అంచనా. దీనివల్ల అతని ఖర్చు తగ్గుతుంది. ఆ మేరకు వినియోగదారుడు లాభపడతాడు. అప్పుడు తగ్గిన ధరపైన 12 శాతం పన్ను కట్టినా అతనికి మొత్తం మీద చూస్తే ఖరీదు తగ్గుతుంది. ఒకవేళ తక్కువలో తక్కువగా 6 శాతం ఇన్‌పుట్ టాక్స్ వస్తుందని అనుకున్నా వినియోగదారుడికి అదనపు భారం ఉండదు.



ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే ఒక అపార్ట్‌మెంట్ ధరలో భూమి విలువ (అన్ డివైడెడ్ లాండ్) కలిసి ఉంటేనే ఈ 12 శాతం పన్ను వర్తిస్తుంది. లేకుంటే 18 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా అపార్ట్‌మెంట్‌తోపాటు అన్‌డివైడెడ్ లాండ్ కూడా కలుపుకునే బిల్డర్ విక్రయిస్తాడు కాబట్టి ఈ సమస్య దాదాపుగా ఉత్పన్నం కాదు.

మరొక ముఖ్య విషయం ఏమిటంటే బిల్డర్ ఏదైనా అపార్ట్‌మెంట్‌ను ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వచ్చిన తర్వాత అమ్మినట్లయితే.. అంటే ఆ అపార్ట్‌మెంట్‌కు సంబంధించిన మొత్తం సొమ్ము అడ్వాన్స్‌తో సహా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వచ్చిన తరువాతే బిల్డర్ పొందినట్లయితే ఆ అపార్ట్‌మెంట్స్‌కు ఎలాంటి పన్ను ఉండదు. అదే సమయంలో బిల్డర్స్ గుర్తుంచుకోవాల్సిన మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే వస్తు సేవల పన్ను చట్టం రావటానికి ముందు కట్టిన అపార్ట్‌మెంట్స్‌లో జిఎస్‌టి అమల్లోకి వచ్చిన తర్వాత అమ్మినా లేదా ముందు కొంత మొత్తం, తర్వాత కొంత మొత్తం కొనుగోలుదారుని నుంచి తీసుకున్నా పన్ను ఎలా చెల్లించాలి? కొనుగోలుదారుడు పైకం చెల్లించిన సమయంలో ఏ పన్ను అమలులో ఉంటే దాని ప్రకారమే పన్ను చెల్లించాలి. అంటే ఒక బిల్డర్ ఒక అపార్ట్‌మెంట్‌ను 2017, జూన్‌లో ఒక వ్యక్తికి 50 లక్షల రూపాయలకు విక్రయించాడనుకుందాం. ఇందులో 10



లక్షల రూపాయలు జూలై 1 కంటే ముందు అంటే జిఎస్‌టి అమల్లోకి రావటానికి ముందు ఆ వ్యక్తి చెల్లించాడు. మిగతా రూ.40 లక్షలు జూలై 1 తర్వాత చెల్లించాడనుకుంటే రూ.10 లక్షలపై సర్వీస్ టాక్స్ చెల్లించాలి. అలాగే రూ.40 లక్షలపై జిఎస్‌టి చెల్లించాలి.

జిఎస్‌టికి సంబంధించిన వీడియోలను https://goo.gl/bzX8s1 ద్వారా వీక్షించవచ్చు.



కాశీ విశాలాక్షి.. ఇక్కడ సాక్షి

చేతిలో ఖడ్గం.. కోరల మీసాలు... పెద్ద కళ్లు... భీకరమైన విగ్రహ రూపం! కానీ... భక్తులకు మాత్రం ఆమె వరాలు ఇచ్చే చల్లటి తల్లి. ఆమే... నందవరం చౌడేశ్వరీ దేవి! కర్నూలు జిల్లా బనగానపల్లె మండలం నందవరంలో వెలిసిన దేవత! వెయ్యేళ్లకుపైగా చరిత్ర ఉన్న ఈ ఆలయం చుట్టూ అనేక పౌరాణిక కథలు అల్లుకున్నాయి. నందవరం కేంద్రంగా ఈ ప్రాంతాన్ని నందన చక్రవర్తి పరిపాలన సాగించే వాడు. ఆయన దత్తాత్రేయ స్వామి ఇచ్చిన వరంతో మంత్ర పాదుకల ద్వారా ప్రతిరోజూ కాశీకి వెళ్లి, గంగా స్నానం చేసి, విశాలాక్షిని దర్శించుకుని వచ్చేవాడని చెబుతారు. మహారాజు రహస్యంగా ఎక్కడికో వెళ్లి వస్తున్నట్లు రాణి అనుమానిస్తుంది. నిజం నిరూపించేందుకు రాజు ఆమెను కూడా కాశీ తీసుకెళతాడు. అక్కడ మహారాణికి రుతుక్రమం కావడంతో పాదుకల మహిమ పోతుంది. రాజు అక్కడున్న బ్రాహ్మణులు, రుషుల సహకారంతో నందవరం చేరుకుంటాడు. వారికి ఏం కావాలో కోరుకోవాలని నందన చక్రవర్తి అడగగా... అవసరమైనప్పుడు సహాయం పొందుతామని బదులిస్తారు. కొన్నాళ్లకు కాశీలో కరువు తాండవించడంతో బ్రాహ్మణులు నందవరం చక్రవర్తి సహాయం కోరతారు. 'మీకు మాట ఇచ్చినట్లు సాక్ష్యం ఉందా?' అని రాజు ప్రశ్నించడంతో... 'ఆ కాశీ విశాలాక్షియే సాక్షి' అని బ్రాహ్మణులు బదులిస్తారు. అమ్మవారినే రప్పించి సాక్ష్యం చెప్పిస్తారు. ఆ తల్లిని రప్పించేందుకే ఇలా చేసినట్లు చక్రవర్తి తెలిపి... బ్రాహ్మణులకు క్షమాపణలు చెబుతాడు. నందవరంలో కొలువుతీరాలని విశాలాక్షిని వేడుకుంటాడు. చక్రవర్తి కోరిక మేరకు నందవరంలో వెలసిన కాశీ విశాలాక్షినే చౌడేశ్వరి మాతగా భక్తులు కొలుస్తున్నారు. ఈ ఆలయాన్ని నందన చక్రవర్తి నిర్మించినట్లు ఆధారాలు ఉన్నాయి. నందవరం చౌడేశ్వరిదేవి ఆలయం నుంచి కాశీకి వెళ్లేందుకు గుహ ఉందని చెబుతారు. చౌడేశ్వరి గర్భాలయం పక్కనే ఉన్న కలి చెట్టుకు ఓ ప్రత్యేకత ఉంది. కాశీ విశాలక్షి అమ్మవారి కొంగుకు తగులుకుని వచ్చిన కలి విత్తనమే అక్కడ చెట్టుగా మారిందని చెబుతారు. దాదాపు 11 వందల ఏళ్లుగా ఉన్న ఈ వృక్షం ఏ కాలంలోనైనా పచ్చగా కళకళలాడుతూ కనిపిస్తుంది. – బనగానపల్లె రూరల్

ని-దర్శనం
Nidarshanam



సేకరించిన వీర్యం లేదా కణజాలల ద్వారా వివిధ రకాల జంతువులను పుట్టించవచ్చా? అనేది ఒక ప్రశ్న. లాకోన్స్ శాస్త్రవేత్తలు ఈ దిశగా కూడా ప్రయత్నాలు చేశారు. 'దీనిని రెండు రకాలుగా చేయవచ్చు. ప్రపంచంలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఉండే జంతువులకు కృత్రిమ గర్భధారణ పద్ధతుల ద్వారా జన్మను ఇవ్వటానికి ప్రయత్నించడం. రెండోది సేకరించిన వీర్యకణాలను అదే జాతి జంతువులో ప్రవేశపెట్టి సంఖ్యను పెంచేందుకు ప్రయత్నించటం. ఈ రెండింటికీ అనేక పరిస్థితులు సహకరించాలి. ఉదాహరణకు ఇరాన్ నుంచి చిరుతలను తీసుకువచ్చి.. వాటి సంఖ్యను అభివృద్ధి చేయాలని ప్రయత్నించినా విఫలమయ్యాం. అలాగే, మనం భద్రపరచిన కుందేలు వీర్యం ద్వారా పిల్లలు పుట్టాయిగానీ ఎక్కువ కాలం బతకలేదు. దీనిపై ఇంకా పరిశోధనలు జరగాలి' అని డాక్టర్ కార్తికేయన్ చెబుతున్నారు.

హైదరాబాద్‌లో ఫ్రోజెన్ జూ

ఆసియాలో మొట్టమొదటిది.. అంతరిస్తున్న జంతుజాతుల వీర్యం, కణాలు ఇక్కడ భద్రం

అందుబాటులో పరిశోధనశాల.. పునఃసృష్టిపై పరిశోధనలు జరగాలి: లాకోన్స్ శాస్త్రవేత్తలు


ఎప్పుడో అంతరించిన డైనోసార్లను తిరిగి భూమి మీద ప్రవేశపెడితే ఏమవుతుందనే ఆసక్తికరమైన ఊహకు ప్రతిరూపం జురాసిక్ పార్క్ సినిమా. దీనిని చూసిన తర్వాత అంతరించిపోయిన జంతువులను మళ్లీ పుట్టించవచ్చా? అనే అనుమానం అందరిలోనూ కలిగి ఉండవచ్చు. శాస్త్రరీత్యా ఇది అసాధ్యమేమీ కాదని, జంతువుల వీర్యం లేదా కణాలను భద్రపర్చగలిగితే వాటి ద్వారా ఆ జాతిని మళ్లీ పుట్టించవచ్చని శాస్త్రవేత్తలు ఇప్పటికే రుజువు చేశారు. ఇప్పుడు లాకోన్స్‌కు చెందిన శాస్త్రవేత్తలు మరో అడుగు ముందుకు వేసి అంతరించే ముప్పు ఎదుర్కొంటున్న జంతు జాతుల వీర్యాన్ని, కణాలను భద్రపరచటానికి ప్రయత్నిస్తున్నారు. దీనికి ఫ్రోజెన్ జూ అని పేరు పెట్టారు. ఇందులో.. జంతువుల వీర్యాన్ని, కణాలను భవిష్యత్ కోసం భద్రపరుస్తారు. అంతరించిపోతున్న జంతుజాతులను పరిరక్షించడానికి హైదరాబాద్‌లోని లేబరేటరీ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ ఎండేజర్డ్ స్పిసెస్ (లాకోన్స్)లో దీనిని ఏర్పాటు చేశారు. ఇప్పటికే 29 జంతుజాతుల వీర్యాన్ని.. కణజాలాలను ఇందులో భద్రపరిచారు.

- స్పెషల్ డెస్క్



అత్యాధునిక వసతులతో కూడిన ఆపరేషన్ థియేటర్

ఆసియాలో ఫస్ట్..



ప్రపంచవ్యాప్తంగా అంతరించిపోతున్న జంతువుల జాబితాను వరల్డ్ వైల్డ్‌లైఫ్ ఫండ్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) ఏటా ప్రకటిస్తుంటుంది. 'ఆ జాబితాలో ఉన్న జంతువుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి. సాధ్యం కాని పక్షంలో ఇవి అంతరించిపోయేలోపు వాటికి సంబంధించిన వీర్యాన్ని, కణజాలాలను సేకరించి భద్రపరచాలి. ఇప్పుడు అదే చేస్తున్నాం. అందులో భాగంగానే ఇప్పటి దాకా 29 జంతుజాతులను ఈ విధంగా భద్రపరిచాం..' అని లాకోన్స్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కార్తికేయన్ వివరించారు. ప్రపంచంలో ఈ తరహా జూలు ఒకటి రెండు చోట్ల ఉన్నా.. ఆసియాలో మాత్రం ఇదే మొదటిదని పేర్కొన్నారు. 'జంతువుల వీర్యాన్ని సేకరించటానికి ప్రత్యేకమైన ఏర్పాట్లు ఉన్నాయి. వీటి ద్వారా సేకరించిన వీర్యాన్ని మైనస్ 180 డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద లిక్విడ్ నైట్రోజన్‌లో భద్రపరుస్తాం. ఇదేవిధంగా వివిధ జంతువుల నుంచి కణజాలాన్ని సేకరించి వాటిని కూడా భద్రపరుస్తున్నాం. దీనికి అవసరమైన అత్యాధునికమైన పరిశోధనశాల మా దగ్గర ఉంది..' అని ఫ్రోజెన్ జూకు నేతృత్వం వహిస్తున్న డాక్టర్ సాంబశివ రావు వివరించారు.


సేకరణ సమస్య..

'**జం**తువు చనిపోయినప్పుడు ఎంత త్వరగా కణాలను సేకరించగలిగితే అంత మంచిది. మాకు సమాచారం అందిన వెంటనే అక్కడకు వెళ్లి కణజాలాలను సేకరిస్తూ ఉంటాం. చాలా సందర్భాలలో సమాచారం లేక వెళ్లలేపోతున్నాం. ఈ లోపు కణజాలాలు నిర్వీర్యం అయిపోతూ ఉంటాయి. ఉదాహరణకు మన జూలో ఒక జంతువు రాత్రి చనిపోయిందనుకుందాం. సమాచారం తెలిసి అక్కడకు వెళ్లి చర్మకణాలను సేకరించే సమయానికి మధ్యాహ్నం అయిపోతుంది. దీని వల్ల కణజాలాల పునఃనిర్మాణ సామర్థ్యం తగ్గుతుంది..' అని డాక్టర్ సాంబశివరావు విశ్లేషించారు. ఇతర దేశాల్లో అయితే ప్రతి జూలోనూ ఒక కూల్ రూమ్ ఉంటుంది. ఏదైనా జంతువు చనిపోతే దానిని వెంటనే ఆ రూమ్‌లోకి తరలిస్తారు. దీని వల్ల కణజాలల పునఃనిర్మాణ సామర్థ్యం పెరుగుతుంది. అమెరికాలో ఎక్కడ ఏ జంతువు చనిపోయినా కాలిఫోర్నియాలోని ఫ్రోజెన్ జూ వారు అ క్కడికి వెళ్లి ఆ జంతువు కణజాలాన్ని సేకరిస్తారు. హైదరాబాద్‌లోని జూలో కూల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదన పంపాం' అని డాక్టర్ సాంబశివరావు వివరించారు.

కోడి కోసం కొట్లాట

▸ **కడక్‌నాథ్ కోడికి జీఐ గుర్తింపు కోసం మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ దరఖాస్తులు**

కడక్‌నాథ్.. నల్లగా నిగనిగలాడిపోతూ, బోలెడన్ని పోషకాలు కలిగిన కోడి! కడక్‌నాథ్ కోడిలో మాంసకృత్తులు ఎక్కువ. కొవ్వు తక్కువ. ఇప్పుడు ఈ కోడి కోసం మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ కొట్టుకుంటున్నాయి. దాని మూలాలు తమ రాష్ట్రానివంటే తమ రాష్ట్రంలో ఉన్నాయంటూ వాదించుకుంటున్నాయి. ఆ కోడికి జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) గుర్తింపు పొందేందుకు రెండు రాష్ట్రాలూ చెన్నైలోని జీఐ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాయి. ఈ గుర్తింపు తమకే దక్కుతుందని మధ్యప్రదేశ్ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే.. దేశంలో తొలిసారి 1978లో మధ్యప్రదేశ్‌లోనే కడక్‌నాథ్ కోళ్ల ఉత్పత్తి కోసం ఒక ప్రత్యేక ఫామ్ ఏర్పాటయింది. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో ఏటా 2.5 లక్షల కడక్‌నాథ్ కోళ్లు ఉత్పత్తి అవుతాయి. అయితే, ఆలస్యంగా మొదలైనా ఛత్తీస్‌గఢ్ ఈ కోళ్ల ఉత్పత్తిలో (ఏడాదికి 4 లక్షలు) మధ్యప్రదేశ్‌ను మించిపోయింది. దీనికి కారణం వాటిని దంతెవాడలో ప్రత్యేక పద్ధతుల్లో పెంచడమేనని.. ఆ రాష్ట్రానికి చెందిన గ్లోబల్ బిజినెస్ ఇంక్యుబేటర్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ శ్రీనివాస్ గోగినేని చెబుతున్నారు.





▸ 113 ఏళ్ల పొగబండి.. గొప్ప అనుభూతండీ!

ఆవిరి యంత్రంతో నడిచే రైలు ఇది! అప్పుడెప్పుడో బ్రిటిష్‌వారి హయాంలో 1906లో తొలిసారిగా పట్టాలెక్కింది. 1970 వరకు నడిచింది. డీజిల్ యంత్రాలు రావడంతో 1971లో దీన్ని పక్కనబెట్టేశారు. 113 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్న ఇంజన్‌తో కూడిన రైల్లో ప్రయాణిస్తే.. ఆ అనుభూతే వేరు కదూ! ఈ భాగ్యం దక్కాలంటే హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాకు వెళ్లాల్సిందే! అక్కడ అంతే పురాతనమైన రైల్వే లైన్ అయిన షిమ్లా-కల్కా మధ్య దీన్ని నడుపుతున్నారు. ఈ లైన్లు 1903లో బ్రిటిషర్లు వేశారు. దీన్ని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. ఈ రైలు ఇంజన్‌కు మూడు బోగీలు బిగించారు. సినిమాల్లో తప్ప వినే భాగ్యం దక్కని పాత రైలు కూతలు వింటూ.. కొండాకోనల మధ్య ప్రకృతి అందాలను తిలకిస్తూ.. డజను దాకా ఉన్న సొరంగాలను దాటుకుంటూ ఈ రైల్లో షిమ్లా నుంచి కల్కా వెళితే.. టైమ్ మెషిన్‌లో వెనక్కి వెళ్లిన ఫీలింగే కలుగుతుందని పర్యాటకులు అంటున్నారు.

నిద్రను పాడుచేస్తున్న టెక్నాలజీ



భారతీయుల నిద్రకు టెక్నాలజీ భంగం కలిగిస్తోందని ఒక సర్వే చెబుతోంది. ఫిలిప్స్ అనే సంస్థ నిద్రపై అమెరికా, యూకే, జర్మనీ, పోలండ్, ఫ్రాన్స్, చైనా, భారత్ తదితర దేశాల్లో సర్వే చేసింది. టెక్నాలజీ కారణంగా సరిగా నిద్రపోవడం లేదని 32 శాతం మంది భారతీయులు పేర్కొన్నారు. తరచూ మారే షిఫ్టులు (పనివేళలు) మంచి నిద్రకు అవరోధం కలిగిస్తున్నాయని 19 శాతం మంది చెప్పారని సర్వే తెలిపింది. నిద్ర కన్నా వ్యాయామమే ముఖ్యమని, ఆరోగ్యంపై వ్యాయామం ప్రభావం చూపుతుందని, వ్యాయామం చేస్తే మంచినిద్ర పడుతుందని 66 శాతం మంది వెల్లడించారు. బాగా నిద్రపోవడానికి 24 శాతం మంది ధ్యానం చేస్తున్నారు. నిద్రపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెరుగుతున్నా.. భారతీయులు మాత్రం నిద్రకు తగినంత ప్రాధాన్యం ఇవ్వడం లేదని సర్వే తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా 26 శాతం మంది నిద్రలేమితో బాధపడుతున్నారని, గురక వల్ల సరిగా నిద్రపట్టడం లేదని 21 శాతం చెప్పారు. ఆందోళన, టెక్నాలజీ ప్రభావం తదితర కారణాలు కూడా మంచినిద్రకు అవరోధంగా మారుతున్నాయి. మనసుకు హాయినిచ్చే సంగీతం వినడం ద్వారా 36 శాతం, ఒకే వేళకు పడుకోవడం, లేవడం కారణంగా 32 శాతం మంది బాగా నిద్రపోతున్నారు. చాలినంత నిద్ర లేకపోవడం వల్ల అలసటకు గురవుతున్నామని, చికాకు పడుతున్నామని, చురుకుదనం, ఏకాగ్రత లోపిస్తున్నాయని సర్వేలో పాల్గొన్నవారు తెలిపారు. 13 దేశాల్లోని 15 వేల మందిపై సర్వే చేశారు.



మాకొద్దీ జవాన్ జాబ్

మూడేళ్లలో 27,862 మంది గుడ్ బై.. ఎక్కువ మందివి మంచి హోదాలే



ఆర్మీ, ఇతర భద్రతా దళాల్లో ఉద్యోగమంటే ఎగిరి గంతేసే రోజులు పోయాయి. ఆర్మీ, పారామిలటరీ దళాల్లో భద్రంగా ఉన్న ఉద్యోగాలకు రాజీనామా చేసి వెళ్లిపోతున్న వారి సంఖ్య ఏటికేడాదీ పెరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం లోక్‌సభకు ఇటీవల లిఖితపూర్వకంగా ఇచ్చిన ఓ సమాధానంలో ఈ విషయం బయటపడింది. దాని ప్రకారం.. ఒక్క 2015లోనే 3422 మంది జవాన్లు ఆర్మీని వీడారు. 2016లో 8,912 మంది.. 2017లో 14,587 మంది సైన్యంలో కొలువులను వదులుకుని బయటికొచ్చేశారు. ఈ ఏడాదిలో సైతం జనవరి 1 నుంచి 31 దాకా రాజీనామాలు చేసినవారితో కలిపితే ఆ సంఖ్య 27,862కు చేరింది.

గెజిటెడ్ ఆఫీసర్ ర్యాంకు వారే..

నిరుడు జాబ్ వదులుకున్న వారంతా సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, అస్సాం రైఫిల్స్, సీఐఎస్ఎఫ్‌కు చెందిన గెజిటెడ్ ఆఫీసరు ర్యాంకు వారు, జవాన్లే. మంచి జీతం, పర్మినెంట్ ఉద్యోగం అయినప్పటికీ ఒత్తిళ్లు, ట్రాన్స్‌ఫర్లు, ఎక్కడికి పడితే అక్కడికి రోజుల తరబడి పంపడం, అసలు డ్యూటీ కన్నా ఇతర విధులు ఎక్కువ కావడం వంటి కారణాలతో వారు ఉద్యోగాలు వదులుకున్నారు. ఇంతకంటే చిన్న ఉద్యోగమైనా ఫరవా లేదు, కుటుంబానికి దగ్గరగా, సొంతవూర్లో లేదా సొంత రాష్ట్రంలో బతకడం మేలు.. అని భావిస్తున్న వారూ ఉన్నారని బీఎస్ఎఫ్ రిటైర్డ్ అధికారులంటున్నారు. ప్రైవేటు రంగంలో, సెక్యూరిటీ సంస్థల్లో మంచి జీతాలు పొందే అవకాశాలున్నట్లు తెలుసుకొని వారు బయటికి వెళ్లిపోతున్నారని ఆయనన్నారు. 2015 లో కేవలం 2256 మంది సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుళ్లు రాజీనామా చేస్తే - 2017 నాటికి ఆ సంఖ్య దాదాపు 5000 కు పెరిగింది.

నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్న సూ జింగ్జీ, గుయో యూటింగ్ మూడు రోజుల క్రితమే ఒక్కటయ్యారు. ఈ జంటకో ప్రత్యేకత ఉంది. 27 ఏళ్ల క్రితం వారిద్దరూ ఒకే రోజు, ఒకే నెలలో జన్మించారు. అంతే కాదు.. వారు పుట్టింది కూడా ఒకే ఆస్పత్రిలో! అప్పుడు ఆ ఆస్పత్రి యాజమాన్యం తీసిన ఫొటోల్లో వారు ఎంత ముద్దుగా ఉన్నారో కదూ?



ఉపయోగపడే పుస్తకాలు

- పియర్సన్ గైడ్ టు ఎస్ఎస్‌సి ఎస్ఐ సిఏపిఎఫ్ఎస్ ఎగ్జామ్
- కిరణ్ ప్రకాశణ్ ఎస్ఎస్‌సి ఎస్ఐ సిఏపిఎఫ్ఎస్ ఎగ్జామ్ ప్రాక్టీస్ బుక్
- మోడ్రన్ అప్రోచ్ టు వెర్బల్ - నాన్ వెర్బల్ రీజనింగ్ - ఆర్ఎస్ అగర్వాల్
- ఫాస్ట్ ట్రాక్ ఆబ్జెక్టివ్ అర్థమెటిక్ - అర్హింత్ పబ్లికేషన్స్
- ఎస్ఎస్‌సి మ్యాథమెటిక్స్ 1999 - 2016: రాకేశ్ యాదవ్
- వర్డ్ పవర్ మేడ్ ఈజీ - నార్మన్ లూయిస్
- ఆబ్జెక్టివ్ ఇంగ్లిష్ - ఎస్‌పి బక్షి

సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగార్థుల కోసం స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) భారీ నోటిఫికేషన్ వెలువరించింది. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సిఎపిఎఫ్ఎస్), ఢిల్లీ పోలీస్ విభాగాల్లో వెయ్యికిపైగా సబ్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీ కోసం ప్రకటన విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల్లోని పోలీసు విభాగాల్లో నియామకాలు చేపట్టనున్న తరుణంలో అందుకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ నోటిఫికేషన్ చక్కని అవకాశం. ఎస్ఎస్‌సీ నియామకం ద్వారా ఎంపికైతే కేంద్ర భద్రత దళాల్లో గ్రూప్ - బి, గ్రూప్ - సి అధికారులుగా ఆకర్షణీయమైన వేతనంతో మెరుగైన కెరీర్‌ను ప్రారంభించవచ్చు. దీనికి సంబంధించిన విధి విధానాలు తెలుసుకుందాం..

ఎస్ఐ ఉద్యోగాలకు



ఎస్ఎస్‌సీ ప్రస్తుత నోటిఫికేషన్ ద్వారా మొత్తం 1,223 పోస్టులను భర్తీ చేయనుంది. పురుషుల తోపాటు మహిళా అభ్యర్థులు కూడా ఆయా పోస్టుల కోసం పోటీపడొచ్చు. విభాగాల వారీగా ఖాళీలు..

ఢిల్లీ పోలీస్	150
బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్	508
ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్	85
సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్	274
సశస్త్ర సీమా బల్	206

ఢిల్లీ పోలీస్ విభాగంలో 10 శాతం పోస్టులను ఎక్స్ సర్వీస్‌మెన్‌కు కేటాయించారు. ఢిల్లీ పోలీస్ మినహా మిగతా ఫోర్సెస్‌ను సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌తో కలిపి)గా వ్యవహరిస్తారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ ఖాళీలను తరవాత ప్రకటిస్తారు. ఢిల్లీ పోలీస్ విభాగానికి ఎంపికైన అభ్యర్థులకు ఢిల్లీ పరిధిలో, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్‌కు ఎంపికైన అభ్యర్థులకు దేశవ్యాప్తంగా ఎక్కడైనా పోస్టింగ్ ఇస్తారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే పోస్టింగ్‌కు సంబంధించిన ఆర్డర్ ఆఫ్ ప్రిఫరెన్స్‌ను పేర్కొనాల్సి ఉంటుంది.

ఎంపిక విధానం: ఎంపిక విధానంలో రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, మెడికల్ టెస్ట్‌లు ఉంటాయి.

రాత పరీక్ష

రాత పరీక్షను ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్)లో నిర్వహిస్తారు. ఇందులో మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్ / హిందీ భాషల్లో ఉంటుంది. రాత పరీక్ష పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు పేపర్ల కలయికగా ఉంటుంది. ఈ రెండు పేపర్లకు కలిపి కేటాయించిన మొత్తం మార్కులు 400. నెగిటివ్ మార్కింగ్ కూడా ఉంది. ప్రతి తప్పునకు 0.25 మార్కు కోత విధిస్తారు.

పేపర్-1

పేపర్-1కు 200 మార్కులు కేటాయించారు. ఇందులో నాలుగు విభాగాలు ఉంటాయి. వీటి నుంచి మొత్తం 200 ప్రశ్నలు అడుగుతారు. వీటికి 120 నిమిషాల్లో (2 గంటలు) సమాధానాలను గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున కేటాయించిన మొత్తం మార్కులు 200.

విభాగం	ప్రశ్నలు	మార్కులు
పార్ట్-ఎ జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్	50	50
పార్ట్-బి జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్	50	50
పార్ట్-సి క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్	50	50
పార్ట్-డి ఇంగ్లిష్ కాంప్రెహెన్షన్	50	50

పేపర్ - 2

ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు మెడికల్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో ఫిట్‌గా నిలిచిన వారికి మాత్రమే రాత పరీక్షలో భాగమైన పేపర్ - 2కు హాజరయ్యే అవకాశం ఉంటుంది. పేపర్ - 2 పూర్తిగా ఇంగ్లిష్ భాష సామర్థ్యాన్ని పరీక్షించే విభాగం. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రెహెన్షన్ నుంచి 200 ప్రశ్నలు అడుగుతారు. వీటికి 120 నిమిషాల్లో (2 గంటలు) సమాధానాలను గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున కేటాయించిన మొత్తం మార్కులు 200. చివరగా పేపర్ - 1, పేపర్ - 2లలో చూపిన ప్రతిభ ఆధారంగా పోస్టింగ్‌ను ఖరారు చేస్తారు.

ఫిజికల్ స్టాండర్డ్ / ఎఫిషియెన్సీ టెస్ట్

పేపర్ - 1లో చూపిన ప్రతిభ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు మాత్రమే ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్ / ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో అభ్యర్థుల శారీరక ప్రమాణాలను పరిశీలిస్తారు. దాంతోపాటు కొన్ని రకాల ఈవెంట్స్ ఉంటాయి. అయితే ఈ దశకు ఎటువంటి మార్కులు కేటాయించలేదు. కాకపోతే నిర్దేశించిన విధంగా అర్హత సాధించడం మాత్రం తప్పనిసరి. ఇందులో ఉండే ఈవెంట్స్..

ఈవెంట్	పురుషులు	మహిళలు
100 మీటర్ల పరుగు	16 సెకన్లు	18 సెకన్లు
1.6 కి.మీ. పరుగు	6.5 నిమిషాలు	
800 మీటర్ల పరుగు	-	4 నిమిషాలు
లాంగ్ జంప్	3.65 మీటర్లు (3 ప్రయత్నాలు)	2.7 మీటర్లు (3 ప్రయత్నాలు)
హై జంప్	1.2 మీటర్లు (3 ప్రయత్నాలు)	0.9 మీటర్లు (3 ప్రయత్నాలు)
షాట్‌పుట్ (16 పౌండ్లు)	4.5 మీటర్లు (3 ప్రయత్నాలు)	

విభాగాల వారీగా ప్రిపరేషన్

- **జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్:** అభ్యర్థుల తార్కిక శక్తిని పరీక్షించే విభాగం. ముఖ్యంగా సందర్భానుసారం సమయస్ఫూర్తిగా ఎలా వ్యవహరిస్తారో తెలుసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తారు. ఈ క్రమంలో వెర్బల్, నాన్ వెర్బల్, క్రిటికల్ థింకింగ్, సోషల్ ఇంటెలిజెన్స్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ సంబంధిత అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అనాలజీ, ప్రాబ్లమ్ సాల్వింగ్, బ్లడ్ రిలేషన్స్, రీజనింగ్, అర్థమెటిక్, నెంబర్ సిరీస్, కోడింగ్ - డీకోడింగ్, డేటా సఫిషియెన్సీ, డైరెక్షన్ సెన్స్, ర్యాంకింగ్స్, సీట్ అరేంజ్‌మెంట్స్, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రామ్స్, స్పేస్ విజువలైజేషన్, మ్యాచింగ్ వంటి టాపిక్స్‌పై దృష్టి సారించాలి.
- ఈ విభాగం కోసం బేసిక్ మ్యాథమెటిక్స్, అల్ఫాబెట్ టెస్ట్ అంశాలను బాగా ప్రాక్టీస్ చేయాలి. తద్వారా సిలబస్‌పై ఒక అవగాహన వస్తుంది. ప్రిపరేషన్‌లో ఒక టాపిక్‌ను తీసుకుంటే.. దానికి సంబంధించి ఎన్ని రకాలుగా ప్రశ్నలు అడిగే అవకాశం ఉందో ముందే ఊహించుకొని ప్రాక్టీస్ చేయాలి. ఇందుకోసం మాక్ టెస్టులు, ప్రీవియస్ పేపర్లను కూడా ఉపయోగించుకోవచ్చు. ఈ విభాగంలో ఎక్కువ స్కోర్ చేయాలంటే వేగంతోపాటు కచ్చితత్వం కూడా అవసరం. కాబట్టి సమయాన్ని నిర్దేశించుకొని ప్రాబ్లమ్స్‌ను సాల్వ్ చేయడం నేర్చుకోవాలి.
- **జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్:** ప్రపంచవ్యాప్తంగా సామాజికంగా, రాజకీయంగా, శాస్త్ర - సాంకేతిక తదితర రంగాల్లో చోటు చేసుకుంటున్న పరిమాణాలపై అభ్యర్థుల అవగాహనను ఈ విభాగంలో పరీక్షిస్తారు. ఈ విభాగం కోసం జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలను నిశితంగా గమనించాలి. ముఖ్యంగా ఇతర దేశాలతో భారత్ చేసుకుంటున్న ఒప్పందాలు, ప్రధాని పర్యటనలు, అవార్డులు, క్రీడలు, శాస్త్ర - సాంకేతిక పరిశోధనలు, ఎన్నికలు, ప్రభుత్వ విధానాల్లో మార్పులు, చట్టాలు, వార్తల్లో వ్యక్తులు, నియామకాలను సమగ్రంగా ఫాలో కావాలి. పరీక్ష తేదీకి ముందు 6 నుంచి 8 నెలల కాలంలో చోటు చేసుకున్న పరిణమాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.
- **క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్:** ఈ విభాగాన్ని అభ్యర్థులు క్లిష్టమైనదిగా భావిస్తారు. కానీ ఇందులో అడిగే అంశాలు 10వ తరగతి స్థాయిలో మాత్రమే ఉంటాయి. కాబట్టి పాజిటివ్ మైండ్‌తో ఈ విభాగానికి ప్రిపేర్ కావాలి. ఇందులో భిన్నాలు, దశాంశాలు, శాతాలు, లాభ - నష్టాలు, నిష్పత్తి, డిస్కౌంట్, పార్ట్‌నర్‌షిప్, వ్యాపార గణితం (వడ్డీ), కాలం - దూరం, కాలం - పని, గ్రాఫ్స్, త్రిభుజాలు, సర్కిల్స్, స్థూపాలు, చతురస్రం, దీర్ఘచతురస్రం, పిరమిడ్, ఎత్తు - దూరం, కోణాలు, బార్ - చార్ట్ డయాగ్రామ్ వంటి అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. ఈ విభాగంలో ఎక్కువ స్కోరింగ్ చేయాలంటే టేబుల్స్, స్క్వేర్స్, క్యూబ్స్, స్క్వేర్ రూట్స్‌పై అవగాహన చేసుకోవాలి. తద్వారా కాలిక్యులేషన్స్ చేయడం సులభమవుతుంది. అదే విధంగా టాపిక్స్‌కు సంబంధించిన ఫార్ములాలను గుర్తు పెట్టుకోవాలి. ప్రాబ్లమ్ సాల్వింగ్‌కు షార్ట్‌కట్ మెథడ్స్‌ను ఉపయోగించడం నేర్చుకోవాలి. తద్వారా సమాధానాన్ని గుర్తించడంలో వేగం, కచ్చితత్వం అలవడతాయి. మాక్ టెస్టులు రాయడం, ప్రీవియస్ పేపర్ల ప్రాక్టీస్ తప్పనిసరి.
- **ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రెహెన్షన్:** ఇది కీలక విభాగం. రెండు పేపర్లలో ఈ విభాగం ఉంది. 62 శాతం మార్కులు (250 / 400) దీనికే కేటాయించారు. తక్కువ సమయంలో ఎక్కువ స్కోర్ చేసే అవకాశం ఉన్న విభాగం. ఇందులో సాధించిన మార్కులే అంతిమ ఫలితాల్లో కీలకంగా మారే అవకాశం ఉంది. కాబట్టి ప్రిపరేషన్‌లో ఇంగ్లిష్ టాపిక్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఇందులో ఎర్రర్ స్పాటింగ్, ఫిల్ ఇన్ ది బ్లాంక్స్, వొకాబ్యులరీ, స్పెల్లింగ్, బేసిక్ గ్రామర్, సెంటెన్స్ స్ట్రక్చర్, ఫ్రేజెస్, యాంటోనిమ్స్ - సినానిమ్స్, కాంప్రెహెన్షన్ వంటి వాటి నుంచి ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నలు ఇంటర్మీడియెట్ స్థాయిలో ఉంటాయి. ప్రీవియస్ పేపర్లను ప్రాక్టీస్ చేయడం మంచిది.

నోటిఫికేషన్ సమాచారం

- అర్హత: ఏదైనా డిగ్రీ / తత్సమానం. ఢిల్లీ పోలీస్ విభాగాన్ని ఎంచుకున్న పురుష అభ్యర్థులకు కారు లేదా మోటార్ సైకిల్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి.
- శారీరక ప్రమాణాలు: పురుషులు ఎత్తు: 170 సెం.మీ. ఛాతీ - 80 సెం.మీ (గాలి పీల్చితే ఛాతీ వ్యాసం 5 సెం.మీ. పెరగాలి). మహిళలు ఎత్తు - 157 సెం.మీ.
- వయసు: జనవరి 1, 2018 నాటికి 20 - 25 ఏళ్లు.
- రాత పరీక్ష తేదీలు: పేపర్ - 1 జూన్ 4 నుంచి జూన్ 10 వరకు. పేపర్-2 డిసెంబర్ 1.
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 2, 2018.
- వెబ్‌సైట్: www.ssc.nic.in

జాబ్ కార్నర్

ప్రొఫెసర్లు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని పి.వి. నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ - ప్రొఫెసర్ల నియామకానికి ప్రకటన విడుదల చేసింది.

- మొత్తం ఖాళీలు: **83**
- అసిస్టెంట్ ప్రొఫెసర్లు 47 (వెటర్నరీ సైన్స్ 43, డెయిరీ సైన్స్ 1, అగ్రికల్చరల్ సైన్స్ 1, లైబ్రరీ సైన్స్ 2), అసోసియేట్ ప్రొఫెసర్స్ 36 (వెటర్నరీ సైన్స్ 33, ఫిషరీ సైన్స్ 1, డెయిరీ సైన్స్ 2)
- అర్హత: సంబంధిత విభాగంలో 70 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణతతోపాటు నెట్ / స్లెట్ / సెట్/పీహెచ్‌డీ చేసి ఉండాలి.
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 9, 2018.
- వెబ్‌సైట్: http://tsvu.nic.in

సైంటిస్టులు

నేషనల్ టెక్నికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఎన్‌టీఆర్ఓ), సైంటిస్ట్ (గ్రేడ్-బి) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **62**
- విభాగాల వారీగా ఖాళీలు: ఎలక్ట్రానిక్స్ 21, కంప్యూటర్ సైన్స్ 35, జియోఇన్ఫర్మాటిక్స్ 6
- అర్హత: మొదటి శ్రేణి మార్కులతో బీఈ / బీటెక్ (ఎలక్ట్రానిక్స్ / ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ / ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ / ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ / టెలి కమ్యూనికేషన్ / ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ / ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ / కమ్యూనికేషన్ / ఆప్టిక్స్ అండ్ ఆప్టో ఎలక్ట్రానిక్స్ / కంప్యూటర్ సైన్స్ / కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ / ఇన్ఫర్మేషన్ ఇంజనీరింగ్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ / జియోఇన్ఫర్మాటిక్స్ / జియో ఇన్ఫర్మాటిక్స్ అండ్ రిమోట్ సెన్సింగ్) / ఎమ్మెస్సీ (ఎలక్ట్రానిక్స్ / ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్ / అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ / రేడియో ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ / జియో ఇన్ఫర్మాటిక్స్ / రిమోట్ సెన్సింగ్ అండ్ జియో ఇన్ఫర్మాటిక్స్) పూర్తిచేసి ఉండాలి. ఆయా విభాగాలకు నిర్దేశించిన గేట్ పేపర్‌లో అర్హత స్కోరు సాధించి ఉండాలి.
- వయసు: 30 ఏళ్లు
- ఎంపిక: ప్రతి విభాగంలో గేట్ స్కోరును 100 మార్కులకు లెక్కిస్తారు. దాని ఆధారంగా 1:5 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకి ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూకు 100 మార్కులు కేటాయించారు. సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ అసెస్‌మెంట్, పర్సనాలిటీ అసెస్‌మెంట్‌లకు సంబంధించి ఇంటర్వ్యూ ఉంటుంది. రెంటిలో జనరల్ అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు తెచ్చుకోవాలి. రిజర్వుడు వర్గాల వారికి 30 శాతం వస్తే చాలు. తదుపరి మెడికల్ ఎగ్జామినేషన్ ఉంటుంది.
- వెయిటేజీ వివరాలు: గేట్ మార్కులకు 60 శాతం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ అసెస్‌మెంట్‌కి 30 శాతం పర్సనాలిటీ అసెస్‌మెంట్‌కు 10 శాతం వెయిటేజీ ఇస్తారు.
- ఇంటర్వ్యూ కేంద్రం: న్యూఢిల్లీ
- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: మార్చి 24, 2018
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 14, 2018
- వెబ్‌సైట్: https://ntrorectt.in

స్టెనోగ్రాఫర్లు

డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆటమిక్ ఎనర్జీ ఆధ్వర్యంలోని బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) - డైరెక్టరేట్ ఆఫ్ పర్చేజ్ అండ్ స్టోర్స్ (డీపీఎస్) పలు ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఖాళీలు: **11**
- ఉద్యోగాలు: స్టెనోగ్రాఫర్ (గ్రూప్ బి 1, గ్రూప్ సి 5), జూనియర్ పర్చేజ్ అసిస్టెంట్ / జూనియర్ స్టోర్ కీపర్ (గ్రూప్ సి) 5
- అర్హత: స్టెనోగ్రాఫర్ పోస్టులకు పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. గ్రూప్-బి పోస్టులకు నిముషానికి 100 ఇంగ్లీషు పదాల షార్ట్‌హ్యాండ్ వేగం, నిమిషానికి 45 ఇంగ్లీషు పదాల టైపింగ్ వేగం ఉండాలి. గ్రూప్-సి పోస్టులకు షార్ట్‌హ్యాండ్‌లో నిమిషానికి 80 పదాల వేగం, టైపింగ్‌లో 30 పదాల వేగం ఉండాలి. పర్చేజ్ అసిస్టెంట్ పోస్టులకు 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు డిప్లొమా (మెటీరియల్స్ మేనేజ్‌మెంట్) పూర్తి చేసి ఉండాలి.
- వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక: టయర్ 1 (రాత పరీక్ష - ఆబ్జెక్టివ్ టైప్/ డిస్క్రిప్టివ్ టైప్), టయర్ 2 (స్కిల్ టెస్ట్) ద్వారా
- పరీక్ష కేంద్రం: ముంబై
- దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 16, 2018
- వెబ్‌సైట్: https://recruit.barc.gov.in

ప్రతిభను ప్రోత్సహిస్తూ..

ట్రిపుల్ ఐటీ ప్రవేశాల్లో మార్పులు

బోధన, కరిక్యులం, ప్లేస్‌మెంట్స్ పరంగా అత్యున్నత ప్రమాణాలతో ఇంజనీరింగ్ విద్యను అందిస్తున్న సంస్థ.. ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) - హైదరాబాద్. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఈ ఇన్‌స్టిట్యూట్ ఎప్పుడూ ముందంజలో ఉంటుంది. 2018-19 విద్యా సంవత్సరం నుంచి పరిశోధనలపై ఆసక్తి ఉన్న ప్రతిభావంతులను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రవేశ విధానంలో కొన్ని మార్పులు చేసింది. అభ్యర్థుల సౌలభ్యార్థం దరఖాస్తు గడువును కూడా పెంచింది. వాటి గురించి తెలుసుకుందాం.

ఐఐఐటీ - హైదరాబాద్ ఈ ఏడాది నుంచి స్పెషల్ చానెల్ ఆఫ్ అడ్మిషన్ అనే విధానాన్ని నూతనంగా ప్రవేశపెట్టింది. అంతేకాకుండా అన్ని రకాల డ్యూయల్ కోర్సుల్లో ప్రవేశానికి (ఈసీడీ, సీఎస్‌డీ, సీఎన్‌డీ, సీఎల్‌డీ) యూజీఈఈని ఆధారంగా తీసుకోవాలని నిర్ణయించింది. బీటెక్ సీఎస్ఈ, ఈసీఈ కోర్సులకు గతంలో మాదిరిగానే జేఈఈ మెయిన్స్ ద్వారా ప్రవేశం కల్పిస్తారు.

- **యూజీఈఈ (అండర్‌గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్):** ఈ విధానంలో డ్యూయల్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు.
- **అర్హత:** మ్యాథ్, ఫిజిక్స్, కెమిస్ట్రీలలో 60 శాతం మార్కులతో 12వ తరగతి / తత్సమానం లేదా నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్‌లో రెండో లెవర్ వరకు చేరుకున్న విద్యార్థులు లేదా హయ్యర్ సెకండరీ / 12వ తరగతి / తత్సమాన తరగతులతో సైన్స్ స్ట్రీమ్‌లో కిశోర్ వైజ్ఞానిక్ ప్రోత్సాహన్ యోజనకు ఎంపికైన విద్యార్థులు అర్హులు.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష ద్వారా షార్ట్‌లిస్ట్ చేసిన విద్యార్థులకు ఇంటర్వ్యూ నిర్వహించి సీటు కేటాయిస్తారు. కంప్యూటర్ బేస్డ్ విధానంలో రాత పరీక్షను ఏప్రిల్ 18న నిర్వహిస్తారు. రాత పరీక్షలో రెండు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో సబ్జెక్ట్ ప్రశ్నలు, రెండో విభాగంలో రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఉంటుంది. వీటిల్లో సీబీఎస్ఈ సిలబస్ ఆధారంగా మ్యాథ్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- **ఎస్‌పీఈసీ (స్పెషల్ చానెల్ ఆఫ్ అడ్మిషన్):** కొత్తగా ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. అత్యంత ప్రతిభగల విద్యార్థులను ఎంపిక చేయడమే దీని లక్ష్యం. ఈ విధానంలో సింగిల్ డిగ్రీ బీటెక్ (ఈసీఈ / సీఎస్ఈ) కోర్సులో ప్రవేశం కల్పిస్తారు. ప్రతి బ్రాంచ్‌లో 10 సీట్ల చొప్పున మొత్తం 20 సీట్లు ఉంటాయి. అర్హత: మ్యాథ్, ఫిజిక్స్, కెమిస్ట్రీలతో 12వ తరగతి / తత్సమానం పూర్తి చేసి ఉండాలి. దీంతోపాటు సీబీఎస్ఈ - ఉడాన్ స్కీమ్‌లో అర్హత సాధించాలి లేదా 10వ తరగతి తరవాత 12 + బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొంది ఉండాలి.



- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్ చేసిన విద్యార్థులకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో రాత పరీక్ష నిర్వహించి దాని ఆధారంగా ఇంటర్వ్యూ చేసి ప్రవేశం కల్పిస్తారు. రాత పరీక్షను ఏప్రిల్ 18న నిర్వహిస్తారు. రాత పరీక్షలో రెండు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో సబ్జెక్ట్ ప్రశ్నలు, రెండో విభాగంలో రీసెర్చ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఉంటుంది. వీటిల్లో సీబీఎస్ఈ సిలబస్ ఆధారంగా మ్యాథ్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- **ఒలింపియాడ్ విధానం:** 11 లేదా 12వ తరగతిలో వివిధ సబ్జెక్ట్‌లలో (మ్యాథమెటిక్స్, ఇన్ఫర్మాటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఆస్ట్రానమీ) అంతర్జాతీయ ఒలింపియాడ్‌లలో పాల్గొనడానికి అర్హత సాధించి అందులో పోటీపడటానికి ప్రత్యేక శిక్షణకు ఎంపికైన విద్యార్థుల కోసం ఈ విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ పద్ధతిలో డ్యూయల్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. వీరికి జూన్‌లో ఇంటర్వ్యూ మాత్రమే నిర్వహించి అడ్మిషన్ కేటాయిస్తారు.

డ్యూయల్ డిగ్రీ కోర్సులు

- సీఎస్‌డీ (బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ బై రీసెర్చ్).
- ఈసీడీ (బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ బై రీసెర్చ్).
- సీఎల్‌డీ (బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ ఇన్ కంప్యూటర్ సైన్స్, మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్ బై రీసెర్చ్)
- సీఎన్‌డీ (బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ ఇన్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ కంప్యూటేషనల్ నేచురల్ సైన్సెస్ బై రీసెర్చ్).
- దరఖాస్తు గడువు: మార్చి 26, 2018.
- వెబ్‌సైట్: https://www.iiit.ac.in/

లేటరల్ ఎంట్రీ కూడా...

ఈ పద్ధతిలో డ్యూయల్ డిగ్రీ (సీఎస్‌డీ, ఈసీడీ) కోర్సుల్లో ప్రవేశం కల్పిస్తారు. ఏ కాలేజీ నుంచైనా జూలై 2018 నాటికి 8 సీజీపీఏ లేదా సమాన శాతం మార్కులతో బీఈ / బీటెక్ కోర్సుల్లో మొదటి రెండు సంవత్సరాలను విజయవంతంగా పూర్తి చేసి, పరిశోధనలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు.

- **అర్హత:** సీఎస్‌డీ కోర్సుకు బీఈ / బీటెక్ (సీఎస్ఈ / ఐటీ), ఈసీడీ కోర్సుకు బీఈ / బీటెక్ (ఈసీఈ / ఈటీఈ / ఈఐఈ / ఈఈఈ). ప్రతి బ్రాంచ్‌లో 15 సీట్ల చొప్పున మొత్తం 30 సీట్లు ఉంటాయి. కంప్యూటర్ బేస్డ్ విధానంలో రాత పరీక్ష నిర్వహించి దాని ఆధారంగా ఇంటర్వ్యూ చేసి ప్రవేశం కల్పిస్తారు. రాత పరీక్షను ఏప్రిల్ 21న నిర్వహిస్తారు.
- రాత పరీక్షలో కంప్యూటర్ సైన్స్ / ఐటీ విద్యార్థులకు జనరల్ ఆప్టిట్యూడ్, డిస్క్రీట్ మ్యాథమెటిక్స్, డిజిటల్ లాజిక్, కంప్యూటర్ ఆర్గనైజేషన్, డేటా స్ట్రక్చర్స్, సీ-ప్రోగ్రామింగ్ అనే అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఈసీఈ విద్యార్థులకు జనరల్ ఆప్టిట్యూడ్, డిజిటల్ లాజిక్, సర్క్యూట్ థియరీ అండ్ నెట్‌వర్క్స్, ఎలక్ట్రానిక్ డివైజెస్ అండ్ సర్క్యూట్స్ అనే అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. సమాధానాలను గుర్తించడానికి 180 నిమిషాల సమయం ఉంటుంది.



తై జుదే ఆల్ ఇంగ్లండ్ ఓపెన్

బర్మింగ్‌హామ్: ప్రపంచ బ్యాడ్మింటన్ మహిళల నంబర్‌వన్ తై జు యింగ్ ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో తనకు తిరుగులేదని చాటుకుంది. ఈ చైనీస్ తైపీ షట్లర్ డిఫెండింగ్ చాంపియన్ హోదాలో సింగిల్స్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. సెమీస్‌లో భారత స్టార్ పీవీ సింధుపై అద్భుత విజయం సాధించిన జపాన్‌కు చెందిన ప్రపంచ రెండో ర్యాంకర్ అకానె యమగుచి ఫైనల్లో టాప్‌సీడ్ తై జు ధాటికి నిలవలేకపోయింది. నలభైఐదు నిమిషాలపాటు సాగిన ఏకపక్ష పోరులో తై జు 22-20, 21-13తో యమగుచిని ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో ఏడోసారి ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ నెగ్గాలనుకున్న చైనా స్టార్ లిన్ డాన్ ఆశలు ఫలించలేదు. ఫైనల్లో చైనాకే చెందిన షి యుకి 21-19, 16-21, 21-9తో డాన్‌ను చిత్తుచేసి విజేతగా నిలిచాడు.

షమిపై విచారణ షురూ..



లక్నో: పేసర్ మహ్మద్ షమిపై అతడి భార్య హసీన్ జహా పెట్టిన గృహ హింస, శారీరక మానసిక వేధింపుల కేసులో పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈనేపథ్యంలో ఆదివారం ఉత్తరప్రదేశ్‌లోని షమి సొంత పట్టణం అమ్రోహకు పోలీసులు వెళ్లారు. ఈ సందర్భంగా షమితో పాటు అతడి కుటుంబసభ్యులు పోలీసులకు పూర్తిగా సహకరించినట్టు సమాచారం. 'నాపై చేసిన ఆరోపణల్లో సగం కూడా ఆమె నిరూపించలేకపోయింది. వారంరోజులుగా సమస్య పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నా, అయినా నా భార్య ఖాతరు చేయడం లేదు. న్యాయపరంగా ముందుకెళ్లడం తప్ప నాకు మరోదారి లేదు. నా కెరీర్‌ను నాశనం చేయడానికి జరుగుతున్న కుట్ర ఇది. వీలైనంత త్వరగా ఫిక్సింగ్ ఆరోపణలపై విచారణ ప్రారంభించాలని బీసీసీఐని కోరాను' అని షమి తెలిపాడు. కాగా, షమిపై మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో అతడి భార్య హసీన్‌ను బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం అధికారులు శనివారం కోల్‌కతాలో విచారించారు. స్థానిక లాల్‌బజార్‌లోని సిటీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జరిగిన ఈ విచారణ మూడు గంటలకు పైగా సాగినట్టు ఆమె లాయర్ జకీర్ హుస్సేన్ తెలిపారు.

గంగూలీకి అందరికంటే ముందే తెలుసు..

షమి వ్యవహారంపై అందరికన్నా ముందే తాను మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీకి తెలిపినట్టు పేసర్ భార్య హసీన్ జహా తెలిపింది.

విక్రమ్ ఇన్వెస్ట్‌మెంట్‌పై ద్రావిడ్ ఫిర్యాదు



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): విక్రమ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ తనను రూ. 4 కోట్లకు మోసం చేసిందని లెజెండరీ క్రికెటర్ రాహుల్ ద్రావిడ్ బెంగళూరులో ఫిర్యాదు చేశాడు. విక్రమ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీపై పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదై విచారణ సాగుతున్న తరుణంలోనే ద్రావిడ్ ఫిర్యాదు చేయడం గమనార్హం. సినీతారలు, క్రీడాకారుల నుంచి విక్రమ్ కంపెనీ కోట్లాది రూపాయలు మోసం చేసినట్టు తెలుస్తోంది. తాను కంపెనీలో రూ. 20 కోట్లు పెట్టుబడి పెట్టానని, ఇందులో రూ. 16 కోట్లు తిరిగి చెల్లించారని, మిగిలిన రూ. 4 కోట్లకు మోసం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పరిచయస్తుడు సురేశ్ ద్వారా పెట్టుబడి పెట్టినట్టు ఫిర్యాదులో ప్రస్తావించారు. విక్రమ్ కంపెనీ సూత్రధారి రాఘవేంద్ర శ్రీనాథ్ మోసం వెలుగులోకి వచ్చిన మేరకు ద్రావిడ్ ఈ ఫిర్యాదు చేశారు.

ఆసీస్ క్లీన్‌స్వీప్

మూడో వన్డేలోనూ ఓడిన భారత మహిళలు



వడోదరా: ఇటీవలి కాలంలో మెరుగైన ఆటతో విజయాలు సాధిస్తున్న భారత మహిళల జట్టుకు సొంతగడ్డపై ఘోర ఓటమి ఎదురైంది. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో భారత జట్టు క్లీన్‌స్వీప్‌నకు గురైంది. ఆదివారం జరిగిన ఆఖరిదైన మూడో వన్డేలో 97 పరుగుల తేడాతో ఓడింది. ఆసీస్ నిర్దేశించిన 333 పరుగుల ఛేదనలో టీమిండియా 44.4 ఓవర్లలో 235 రన్స్‌కే కుప్పకూలింది. ఓపెనర్లు జెమీమా రోడ్రిగ్స్(42), స్మృతి మంధానా(52) రాణించగా.. దీప్తి 36, మిథాలీ 21, హర్మన్‌ప్రీత్ 25 రన్స్ చేశారు. అంతకుముందు ఆసీస్.. వికెట్‌కీపర్ అలెస్సా హీలే(133) కెరీర్‌లో తొలి శతకంతో చెలరేగడంతో నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 332 పరుగుల భారీస్కోరు చేసింది. ఓ పర్యాటక జట్టుకు భారత్‌పై ఇదే అత్యధిక స్కోరు. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆసీస్ 3-0తో కైవసం చేసుకుంది.



ప్రాణం లేచి రావడం అంటే ఇదేనేమో..!
ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించడం అంటే ఇదేనేమో!
8 బంతులు.. రెండు ఫోర్లు... మూడు సిక్సర్లు.. 29 పరుగులు..!
ఇది కలయా లేక కార్తీక్ మాయా..!
12 బంతుల్లో 34 పరుగులు కావాల్సిన దశలో.. ఉత్కంఠ ఊపేస్తున్న సమయాన.. ఒత్తిడికి తలొగ్గిన యువ ఆటగాడు విజయ్ శంకర్ బంతిని కనీసం టచ్ చేయలేక నిట్టూరుస్తుండగా.. అభిమానులు అతనిపై కన్నెర్రజేస్తుండగా..
ఇక విజయం మనదే అని బంగ్లా పులులు గర్జించడానికి సిద్ధమవుతుండగా..
వెటరన్ ఆటగాడు దినేశ్ కార్తీక్ చేసిన మాయను నమ్మగలమా..!
6, 4, 6, 0, 2, 4... తానెదుర్కొన్న తొలి ఆరు బంతుల్లో డీకే రెచ్చిపోయిన తీరిది..! ధోనీని తలపించే ఆటతో చెలరేగిన డీకే ఆఖరి బంతికి సిక్సర్‌తో కూల్‌గా మ్యాచ్‌ను గెలిపించి హీరోగా మారాడు..! బంగ్లా ఆశలను చిదిమేస్తూ.. టీమిండియాకు అవమానాన్ని తప్పిస్తూ.. అభిమానులకు నిదహాస్ ట్రోఫీని ఉగాది కానుకగా ఇచ్చాడు..!

కిల్లర్ కార్తీక్



దినేశ్ కార్తీక్ (8 బంతుల్లో 29 నాటౌట్)

- భారత్‌ను గెలిపించిన దినేశ్ కార్తీక్
- ఫైనల్లో బంగ్లాపై ఉత్కంఠ విజయం
- టీమిండియాదే నిదహాస్ ట్రోఫీ

కొలంబో: ఫేవరెట్‌గా బరిలోకి దిగిన టీమిండియా ముక్కోణపు సిరీస్‌కు అసాధారణ ముగింపునిచ్చింది. దినేశ్ కార్తీక్ (8 బంతుల్లో 29 నాటౌట్) హీరోచిత బ్యాటింగ్‌తో నిదహాస్ ట్రోఫీని గెలుచుకుంది. ఆదివారం రాత్రి ఆఖరి బంతి వరకూ అత్యంత హోరాహోరీగా సాగిన తుదిపోరులో భారత్ 4 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. బంగ్లా నిర్దేశించిన 167 పరుగుల లక్ష్యాన్ని రోహిత్ సేన ఆరు వికెట్లు కోల్పోయి ఆఖరి బంతికి ఛేదించింది. రోహిత్ (42 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 56) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా.. మనీష్ పాండే (28), లోకేశ్ రాహుల్ (24) సత్తా చాటారు. బంగ్లా బౌలర్లలో ముస్తాఫిజూర్ (4-1-21-1) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు. అంతకుముందు బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 166 పరుగులు చేసింది. షబ్బీర్ రహ్మాన్ (50 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 77) ఒక్కడే చెలరేగి ఆడాడు. చాహల్ (3/18), ఉనాద్కట్ (2/33) సత్తా చాటారు. దినేశ్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలవగా.. వాషింగ్టన్ సుందర్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు గెలుచుకున్నాడు.

రోహిత్ మెరుపులు..: సవాల్ విసిరే లక్ష్య ఛేదనను భారత్ మెరుగ్గానే ఆరంభించినా.. వెంటవెంటనే రెండు వికెట్లు కోల్పోయింది. ఇన్నింగ్స్ మూడో బంతినే బౌండ్రీకి పంపి ఖాతా తెరిచిన రోహిత్.. ఆపై మెహ్దీ హసన్ వేసిన రెండో ఓవర్లో వరుసగా 6, 4, 6తో రెచ్చిపోయాడు. అయితే, షకీబల్ బౌలింగ్‌లో చూడచక్కని సిక్సర్ కొట్టిన శిఖర్ ధవన్ (10) మరో షాట్ ఆడే ప్రయత్నంలో క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆపై సురేశ్ రైనా (0)ను రూబెల్ డకౌట్ చేయడంతో భారత్‌కు షాక్ తగిలింది. అయితే, అతని స్థానంలో వచ్చిన లోకేశ్ రాహుల్, రోహిత్ భారీ షాట్లతో బౌండ్రీలు రాబట్టడంతో భారత్ 9 ఓవర్లకు 81/2తో సులభంగా లక్ష్యాన్ని చేరుకునేలా కనిపించింది. కానీ, తర్వాతి ఓవర్లోనే రాహుల్‌ను అవుట్ చేసిన రూబెల్.. ఈ జోడీని విడదీశాడు. ఆపై, బంగ్లా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయసాగారు. 35 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న రోహిత్, మనీష్ పాండే నెమ్మదిగా బ్యాటింగ్ చేయడంతో సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతూ పోయింది. ఇక, 14వ ఓవర్లో రోహిత్‌ను నజ్ముల్ అవుట్ చేయడంతో మ్యాచ్ బంగ్లావైపు మొగ్గింది. అప్పటికి చివరి ఆరు ఓవర్లలో 63 పరుగులు అవసరం అయ్యాయి. సౌమ్య సర్కార్ వేసిన 15వ ఓవర్లో మనీష్ రెండు బౌండ్రీలు రాబట్టి జట్టులో ఉత్సాహం నింపాడు. తర్వాతి రెండు ఓవర్లలో 17 పరుగులే రావడంతో సమీకరణం 18 బంతుల్లో 35 రన్స్‌గా మారింది. మనీష్‌తో పాటు విజయ్ శంకర్ (19 బంతుల్లో 17)లో వేగం లేకపోవడంతో భారత్‌పై ఒత్తిడి పెరిగింది.



కూల్‌గా కొట్టేశాడు..: ఇక చివరి 12 బంతులకు భారత్ 34 పరుగులు చేయాల్సి వచ్చింది. బౌండ్రీల మాట దేవుడెరుగు.. కనీసం సింగిల్ తీసే ఆత్మవిశ్వాసం కూడా విజయ్‌లో కనిపించడం లేదు. మొగ్గు బంగ్లావైపే..! అయినా.. టీమిండియాలో ఎక్కడో చిన్న ఆశ. అప్పుడే క్రీజులోకొచ్చిన దినేశ్ కార్తీక్‌పై ఆ ఆశలన్నీ..! తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్న డీకే.. రూబెల్ హుస్సేన్ వేసిన 19వ ఓవర్లో 22 పరుగులతో విశ్వరూపమే ప్రదర్శించాడు. ఆరు బంతుల్లో 12 పరుగులు కావాలి. బ్యాటుతో శంకర్. బంతితో సౌమ్య సర్కార్. వైడ్‌తో ఆరంభమైన ఆ ఓవర్లో తొలి బంతిని శంకర్ ఆడలేకపోయాడు. రెండో బాల్‌కు ఎలాగోలా సింగిల్ తీశాడు. అయితే, మూడో బంతికి దినేశ్ కూడా సింగిల్ తీయడంతో మళ్లీ శంకర్‌కే బ్యాటింగ్. 3 బంతుల్లో 9 పరుగులు కావాలిక. స్టేడియమంతా నిశ్శబ్దం..! భారత్ ఓడితే విలన్‌గా నిలిచేది అతనే.! ఈ దశలో నాలుగో బంతిని థర్డ్‌మ్యాన్ మీదుగా బౌండ్రీ కొట్టిన శంకర్.. ఐదో బాల్‌కు లాంగాన్‌లో షాట్ ఆడి మెహ్దీ హసన్‌కు క్యాచ్ ఇచ్చాడు. మిగిలింది ఒక్క బంతే. కావాల్సింది ఐదు పరుగులు. సిక్సర్ కొడితే గెలుపు. ఫోర్ రాబట్టినా టై చేసుకోవచ్చు. అంతటి ఉత్కంఠలోనూ ప్రశాంతంగా ఉన్న దినేశ్.. ఎక్స్‌ట్రా కవర్ మీదుగా ఫ్లాట్ సిక్సర్ కొట్టడంతో.. భారత ఆటగాళ్ల ఆనందానికి అవధుల్లేకపోయింది. చేతుల్లోకి వచ్చిన మ్యాచ్ చేజారడంతో బంగ్లా బిత్తరపోయింది.

చాహల్ మాయ.. షబ్బీర్ జోరు..: అంతకుముందు బంగ్లా మంచి లక్ష్యాన్ని నిర్దేశించిందంటే అది షబ్బీర్ రహ్మాన్ చలవే. వారి ఇన్నింగ్స్‌లో అతని ఆటే హైలైట్. భారత స్పిన్నర్లు చాహల్, సుందర్‌తో పాటు జయదేవ్ కట్టుదిట్టమైన బౌలింగ్‌కు మిగతా బ్యాట్స్‌మెన్ తడబడినా.. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయినా.. అతనొక్కడే ఎదురు నిలిచాడు. టాస్ ఓడిన బంగ్లా బ్యాటింగ్‌కు రాగా.. నాలుగో ఓవర్లోనే లిటన్ దాస్ (11)ను అవుట్ చేసిన సుందర్ భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాతి ఓవర్లోనే మరో ఓపెనర్ తమీమ్ (15)తో పాటు సౌమ్య సర్కార్ (1)ను పెవిలియన్‌కు చేర్చి చాహల్ బంగ్లాను గట్టి దెబ్బకొట్టాడు. తమీమ్ ఇచ్చిన క్యాచ్‌ను బౌండ్రీలైన్ వద్ద శార్దూల్ అద్భుతంగా ఒడిసిపట్టుకున్నాడు. ఈ దశలో షబ్బీర్ రహ్మాన్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఠాకూర్ బౌలింగ్‌లో బౌండ్రీ.. విజయ్ శంకర్ వేసిన ఎనిమిదో ఓవర్లో వరుసగా 6,4 రాబట్టాడు. అయితే, మంచి ఫామ్‌లో ఉన్న ముష్ఫికర్ రహీమ్ (9) స్వేచ్ఛగా ఆడలేకపోయాడు. అతణ్ణి చాహల్ అవుట్ చేశాడు. కానీ, షబ్బీర్ అదే ధాటిని కొనసాగించాడు. రెండు బౌండ్రీలు కొట్టిన మహ్మదుల్లా (21) అతనికి సహకారం అందించాడు. అయితే, క్రీజులో కుదురుకున్నట్టు కనిపించిన మహ్మదుల్లా రనౌటయ్యాడు. కానీ, షబ్బీర్ ఏ మాత్రం వెనక్కుతగ్గలేదు. సుందర్ బౌలింగ్‌లో భారీ సిక్సర్ కొట్టిన అతను 37 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆపై, శంకర్ వేసిన 17వ ఓవర్లో రెండు సిక్సర్లతో విజృంభించాడు. అదే ఓవర్లో కెప్టెన్ షకీబల్ (7) రనౌట్ వెనుదిరిగినా.. ఠాకూర్ బౌలింగ్‌లో షబ్బీర్ వరుసగా రెండు బౌండ్రీలు కొట్టాడు. అయితే, షబ్బీర్‌తో పాటు రూబెల్ హుస్సేన్ (0)ను వరుస బంతుల్లో అవుట్ చేసిన ఉనాద్కట్ రెండు పరుగులే ఇచ్చాడు. కానీ, ఠాకూర్ వేసిన చివరి ఓవర్లో రెండు ఫోర్లు, సిక్సర్‌తో మెహ్దీ హసన్ మిరాజ్ (7 బంతుల్లో 2 ఫోర్లు, సిక్సర్‌తో 19 నాటౌట్) 18 పరుగులతో జట్టుకు మంచి స్కోరందించాడు.

అయ్యో శంకరా..!

దినేశ్ కార్తీక్‌ను కాదని యువ ఆల్‌రౌండర్ విజయ్ శంకర్‌కు ముందుగా బ్యాటింగ్ పంపడం భారత్‌కు శరాఘాతం అయ్యేలా కనిపించింది. అంతర్జాతీయ మ్యాచ్‌లో తొలిసారి బ్యాటింగ్‌కు వచ్చిన శంకర్ ఈ స్థాయి ఒత్తిడిని తట్టుకోలేకపోయాడు. ఈ క్రమంలో ముస్తాఫిజూర్ వేసిన 18వ ఓవర్లో అతను వరుసగా నాలుగు బంతులను కనీసం టచ్ కూడా చేయలేకపోయాడు. ఆఫ్‌స్టంప్‌నకు దూరంగా దాదాపు ఒకే రకంగా వచ్చిన ఆ బంతులకు గుడ్డిగా బ్యాట్ ఊపగా.. అన్నీ అతణ్ణి బీట్ చేస్తూ కీపర్ చేతిలో పడ్డాయి. ఐదో బంతికి బై రూపంలో సింగిల్ తీయడంతో.. మనీష్‌కు స్ట్రయిక్ వచ్చింది. కానీ, భారీషాట్ ఆడే ప్రయత్నంలో చివరి బంతికి అతను అవుటయ్యాడు.

"**నా** ఆటతీరు పట్ల సంతోషంగా ఉంది. ఈ టోర్నీలో మేం చాలా బాగా ఆడాం. ఒకవేళ ఫైనల్లో ఓడి ఉంటే మా దురదృష్టంగానే భావించాలి. ఈ పిచ్‌పై బ్యాటింగ్ చేయడం కష్టంగా మారింది. పైగా ముస్తాఫిజుర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. అందుకే ఎదుర్కొన్న ప్రతీ బంతిని బలంగా బాదాలని నిర్ణయించుకున్నాను. భారత జట్టులో చోటు దక్కడం చాలా కష్టం. ఒకసారి దక్కితే దాన్ని కచ్చితంగా మనం ఉపయోగించుకోవాల్సిందే.

- దినేశ్ కార్తీక్.

ఫైనల్ మ్యాచ్‌లో ఇంతకు మించి ఎవరు కోరుకుంటారు? మేమైతే బాగా ఆడాం. ఇక మ్యాచ్‌లో ఎవరైనా గెలవొచ్చు. కానీ భారత్ ఒత్తిడిని అద్భుతంగా అధిగమించింది. 19వ ఓవర్‌లో దినేశ్ కార్తీక్ మా నుంచి మ్యాచ్‌ను లాగేశాడు. 166 పరుగులను కాపాడుకోవడం కష్టమని మాకు తెలుసు. అయితే మాలో ప్రతి ఒక్కరు వంద శాతం కష్టపడ్డారు. ఓటమి బాధిస్తున్నా ఏదో ఓ రోజు మేం విజేతలుగా నిలుస్తాం' **- షకీబ్**"

స్కోరుబోర్డు

బంగ్లాదేశ్: తమీమ్ (సి) ఠాకూర్ (బి) చాహల్ 15, లిటన్ (సి) రైనా (బి) సుందర్ 11, షబ్బీర్ (బి) ఉనాద్కట్ 77, సౌమ్య (సి) ధవన్ (బి) చాహల్ 1, ముష్ఫికర్ (సి) శంకర్ (బి) చాహల్ 9, మహ్మదుల్లా (రనౌట్) 21, షకీబల్ (రనౌట్) 7, మెహ్దీ (నాటౌట్) 19, రూబెల్ (బి) ఉనాద్కట్ 0, ముస్తాఫిజుర్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 166/8. వికెట్ల పతనం:** 1-27, 2-27, 3-33, 4-68, 5-104, 6-133, 7-147, 8-148; **బౌలింగ్:** ఉనాద్కట్ 4-0-33-2, సుందర్ 4-0-20-1, చాహల్ 4-0-18-3, శార్దూల్ 4-0-45-0, శంకర్ 4-0-48-0.

భారత్: ధవన్ (సి) సబ్/ఆరిఫుల్ (బి) షకీబల్ 10, రోహిత్ (సి) మహ్మదుల్లా (బి) నజ్ముల్ 56; రైనా (సి) ముష్ఫికర్ (బి) రుబెల్ 0; రాహుల్ (సి) సబ్బీర్ (బి) రుబెల్ 24; పాండే (సి) సబ్బీర్ (బి) ముస్తాఫిజుర్ 28; శంకర్ (సి) మెహదీ హసన్ (బి) సౌమ్య సర్కార్ 17; దినేశ్ కార్తీక్ నాటౌట్ 29; సుందర్ నాటౌట్ 0; **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం: 20 ఓవర్లలో 168/6. వికెట్ల పతనం:** 1-32, 2-32, 3-83, 4-98, 5-133, 6-162. **బౌలింగ్:** షకీబ్ 4-0-28-1; మెహ్దీ హసన్ 1-0-17-0; రుబెల్ 4-0-35-2; నజ్ముల్ 4-0-32-1; ముస్తాఫిజుర్ 4-1-21-1; సౌమ్య సర్కార్ 3-0-33-1.

విదర్భదే ఇరానీ కప్

- రెస్టాఫ్‌తో మ్యాచ్ డ్రా
- తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ట్రోఫీ కైవసం



నాగ్‌పూర్: రెస్టాఫ్ ఇండియాతో ఇరానీ కప్ పోరులో రంజీ చాంపియన్ విదర్భ విజేతగా నిలిచింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా రెస్టాఫ్‌పై ఆతిథ్య విదర్భ విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 236/6తో ఆఖరి రోజైన ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన రెస్టాఫ్ మరో 154 రన్స్ జోడించి 390 వద్ద ఆలౌటైంది. హనుమ విహారి (183) సెంచరీ, జయంత్ యాదవ్ (96) హాఫ్ సెంచరీలతో రాణించారు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 216 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. రజనీష్ గుర్బానీ 4, అదిత సర్వతే 3, ఉమేశ్ యాదవ్ 2 వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భకు 410 రన్స్ ఆధిక్యం లభించింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు అక్షయ్ (50 నాటౌట్), సంజయ్ (27 నాటౌట్) రాణించడంతో ఆట చివరకు విదర్భ వికెట్ నష్టపోకుండా 79 రన్స్ చేసింది. దాంతో మ్యాచ్ డ్రాగా ముగిసినా తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా విదర్భ ట్రోఫీ కైవసం చేసుకుంది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 800/7 (డిక్లేర్డ్) స్కోరు చేసింది. డబుల్ సెంచరీతో మెరిసిన వెటరన్ బ్యాట్స్‌మన్ వసీం జాఫర్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

ఏ ప్లస్.. విరాట్, ధోనీ చలవే



రాయ్

న్యూఢిల్లీ: బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టులో ఏ ప్లస్ కేటగిరీని కెప్టెన్ కోహ్లీ, ధోనీ గట్టిగా సమర్థించారని పరిపాలక కమిటీ చీఫ్ వినోద్ రాయ్ స్పష్టం చేశాడు. అన్ని ఫార్మాట్లలో ఉత్తమ ప్రతిభ కనబరిచే ఆటగాళ్ల కోసం ప్రత్యేకంగా ఏ ప్లస్ కేటగిరీని ఏర్పాటు చేయాలని విరాట్, ధోనీ ప్రతిపాదించారని, ఆటగాళ్లు కూడా అదే ఆశించారని తెలిపాడు. దీంతో నూతన కాంట్రాక్టు విధానంలో కోహ్లీ, రోహిత్, ధవన్, భువనేశ్వర్, బుమ్రా ఏడాదికి రూ.7 కోట్లు లభించే ఏ ప్లస్ కేటగిరీ దక్కించుకున్నారు. అయితే టెస్టులనుంచి వైదొలగిన ధోనీ రూ.5 కోట్లు లభించే ఏ కేటగిరీకే పరిమితమైన సంగతి తెలిసిందే.

ఢిల్లీలోనే హోం మ్యాచ్‌లన్నీ..

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో ఢిల్లీ జట్టు తమ హోం మ్యాచ్‌లన్నీ ఫిరోజ్ షా కోట్లా మైదానంలోనే ఆడనుంది. తమ జట్టుకు కోట్లా మైదానం డెన్‌లాంటిదని, అందుకే అన్ని మ్యాచ్‌లను అక్కడే ఆడించాలని కొత్త కోచ్ పాంటింగ్ సూచనకు ఫ్రాంచైజీ కూడా అంగీకరించింది. ఇంతకుముందు తమ రెండు హోంమ్యాచ్‌లను ఢిల్లీకి ఆవల లక్నో లేక రాయ్‌పూర్‌లో ఆడించాలనుకుంది. కానీ దీన్ని వ్యతిరేకిస్తూ కోట్లాలోనే ఢిల్లీ మ్యాచ్‌లను ఆడించాలని ఆపరేషన్స్ డిపార్ట్‌మెంట్‌కు పాంటింగ్ స్పష్టం చేశాడు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: **K. Srinivas**, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .**Managing Director : Vemuri Radha Krishna**, Founder: K.L.N.Prasad.



MEMORABLE WISH TO THE MONUMENTAL MAN

For the hopes and aspirations of many his temples do stand
Pillars of perfection and pride across the land
From one man's thought a paradise of learning was born
Creating a society that passionately strives for more

Father, friend, actor and teacher
Virtue and grace personified; he is our leader
Those who are traveling with him are filled with new hope
Seizing the stars beyond the man's telescope

Determined and strong he is ever to be reckoned
Equal opportunity for all his knowledge society will provide
A name to be etched into the history of generations to come
We thank you now and always Chairman Dr. M. Mohan Babu

"Padma Shri" Awardee **Dr. Mohan Babu. M**

Heartfelt gratitude and greetings to our beloved chairman Dr.M.Mohan Babu sir from Students, Staff and Management of Sree Vidyanikethan Educational Trust on his birthday.

About SVET: Sree Vidyanikethan Educational Trust was established in 1992 by Dr.M.Mohan Babu, to bring quality and affordable education.
Today it has grown into one of the best educations group in the country.

ENGINEERING COLLEGE | COLLEGE OF NURSING | DEGREE COLLEGE | COLLEGE OF PHARMACY | INSTITUTE OF MANAGEMENT | INTERNATIONAL SCHOOL | NEW YORK ACADEMY

Tirupati Office:
Sree Vidyanikethan Educational Trust
Sree Sainath Nagar, Tirupati, Andhra Pradesh – 517 102.
Tel: +91- 877- 3066777 | +91 - 91609 99966

Hyderabad Office:
Sree Vidyanikethan International School
Sanskruti Township, Pocharam (V), Ghatkesar,
Hyderabad – 500 088.
Tel: +91 - 77998 88848 | +91 - 91609 99988

New York Academy:
858, Road No. 39, Jubilee Hills, Hyderabad – 500033.
Tel: +91 - 91606 06060
Email: info@newyorkacademy.com

For Admissions:
Web: www.vidyanikethan.edu
Email: admissions@vidyanikethan.edu